
ఓం భూర్భువః స్వః తత్సవితుర్వరేణ్యం భర్గోదేవస్య ధీమహి ధియోయోనః ప్రచోదయాత్







# యుగశక్తి గాయత్రి

ఓం వందే భగవతీం దేవీం శ్రీరామంచ జగద్గురుం
పాదపద్మే తయోః శ్రిత్వా ప్రణమామి ముహుర్ముహుః

ప్రఖర ప్రజ్ఞ | సజల శ్రద్ధ


సంకల్పం - సంరక్షణ
వేదమూర్తి, తపోనిష్ఠ, పండిత
**శ్రీరామ శర్మ ఆచార్య**
శక్తి స్వరూపిణి
**మాతా భగవతీ దేవి శర్మ**

ప్రధాన సంపాదకులు
**డాక్టర్ ప్రణవ్ పండ్యా**
సంపాదక మండలి
కందర్ప రామచంద్రరావు
డాక్టర్ మారెళ్ళ శ్రీరామకృష్ణ
పొన్నూరు హైమవతీశాస్త్రి
ముక్కామల రత్నాకర్
డి.వి.ఆర్.మూర్తి

సంపుటి 10 - సంచిక 7
**నవంబర్ 2009**
**విడిప్రతి రూ॥ 10.00**
**సం॥ చందా రూ॥ 110**
**3 సం॥ చందా రూ॥ 310**
**10 సం॥ చందా రూ॥ 1050**

Please send drafts in favour of
SRI VEDAMATA
GAYATRI TUST
BUSINESS DIVISION,
HYDERABAD


## దీపరహస్యం

అత్యంత ఆనందోత్సాహాలతో దీపావళి పండుగను జరుపుకున్నాం. దీపం జడచేతనాలను ఏకం చేసి చూపుతుంది. దీపం యొక్క శరీరం ఒక మట్టి ప్రమిద. అయితే ఏం? దాని ప్రకాశం మాత్రం చైతన్యవంతమైంది. దేవసంస్కృతీ విశ్వవిద్యాలయ పరిసరాల్లో కూడ ఒక దీపం వెలిగించబడింది. దీపం ఎప్పుడు ఊర్ధ్వముఖంగానే ప్రకాశిస్తూ ఉంటుంది. ప్రపంచంలో ఎక్కడ చూసినా జ్యోతి వెలిగించడం అంటే మామూలు విషయం. కాని దాని వెలుగు, శక్తి, కోట్లాది ప్రజలకు ప్రేరణను అందిస్తూ ఉంటాయి.

దీపకాంతులను విశ్వవిద్యాలయాలలోని యువతతో పోల్చవచ్చు. దేవ సంస్కృతీ విశ్వవిద్యాలయ సమీపంలో వెలిగించబడ్డ జ్యోతి అఖండ జ్యోతినుండి తీసుకొనబడింది. డివైన్ ఇండియా యూత్ అసోసియేషన్ (భారత ఆధ్యాత్మిక యువ సంస్థ) అని నామకరణం చేయడం జరిగింది. ఈ సంస్థ యొక్క శరీరం మాతృభూమి యొక్క మట్టితో చేయబడింది. యువత యొక్క ప్రాణశక్తి, బలం, మనోబలం, ఆత్మబలం కలసి తయారైన శక్తియే దాని తైలం. యువత యొక్క దృఢ సంకల్పమే దానిలో వేయబడిన వత్తి. వారి ఆత్మ చేతనయే ఆ జ్యోతి నుండి ప్రసరించే ప్రకాశం. ఆ ప్రకాశమే నేడు ప్రపంచ యువతకు సన్మార్గాన్ని చూపిస్తూ ఉంది.

శారీరికంగా చూస్తే దీపం చాలా చిన్నదే. కాని దానిలో నిండి ఉన్న విశ్వవిద్యాలయ యువ చైతన్యాన్ని కొలిచి చూపగల సామర్థ్యం ఎవరికీ లేదు. అది ఒక పెద్ద అగ్నిశిఖ నిరంతరం పైకి చూస్తున్న దాని దృష్టియే ఆత్మ. ఆ ప్రకాశమానమైన ఆత్మయే లేకపోతే మిగిలిన దంతా మట్టిముద్దయే. ఈప్రకాశమేగనక పూర్తిగా విస్తరించితే భారత దేశంలో యువశక్తి విజయాన్ని సాధించి తీరుతుంది. ఈ జ్యోతి యొక్క ప్రభావాన్ని, దానివల్ల జరగబోయే మార్పుల్ని ఊహించడం మేధావులకు అంత కష్టమైన పని కాదు. జ్యోతిని పరిశీలనగా చూస్తే చాలు మనస్సులలో ఉన్న అంధకారం అంతరించిపోతుంది. దేశయువత యొక్క సంకల్పాలు, యుగదేవత అయిన మహా కాలుని రూపురేఖలు కన్నుల ముందుకదలాడుతూ ఉంటాయి.


పత్రిక అందనివారు, పత్రికకు సంబంధించిన సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు క్రింది నంబర్లను సంప్రదించగలరు.
**(1) 9652862601 (2) 9032674117**


ఇతరులకు సహాయం చేయటం మనకి మనం సహాయం చేసుకోవటమే.

## విషయ సూచిక

1. **సంపాదకీయం :** దీప రహస్యం 1
2. **విషయసూచిక-సద్గురు వచనామృతం :** జీవితం-సిద్ధాంతం 2
3. **వేదమంత్రం :** దేశ రక్షణకు జ్ఞాన, కర్మ, భక్తి యోగాలు మూడూ అవసరమే 3
4. **పరమపూజ్య గురుదేవుల జన్మ శతాబ్ది :** 2400 కోట్ల మంత్రజపం 4
5. **బాలల భవితకు బంగారు బాట-1 :** అమ్మకు ఆభరణాలు 5
6. **ధారావాహిక : పరమేశ్వరుని చిరునామా-6** మానవ శరీరం-ఒక అద్భుత యంత్రం 6
7. **సంస్కృతీ మూర్తి పరమపూజ్యగురుదేవులు :** దేవ సంస్కృతి గురించి సంస్కృతీమూర్తి అమృత పలుకులు 11
8. **ధారావాహిక : హనుమత్‌కథామృతం-19** అనుకోని సంఘటనలు ఆరంభమయ్యాయి 12
9. **తత్వచింతన :** నిజమైన విరాగి అంటే ఎలా ఉంటాడు? 14
10. **ధారావాహిక : భక్తిగాథ-24 :** గోపికల యొక్క కృష్ణ ప్రేమ యొక్క తత్వం 17
11. **మనం-మన ఆరోగ్యం :** పర్యావరణ సంరక్షణ - వనౌషధుల ఆవశ్యకత 19
12. **ధారావాహిక : నా స్మృతిపథంలో గురుదేవులు-38** బాధపడేవారికి సంపద అండగా ఉండాలి 21
13. **గాయత్రీమాత-24 శక్తిధారలు :** దేవమాత 23
14. **సమాజ నిర్మాణం :** వేరును తడిపితేనే మొక్క చిగురు తొడుగుతుంది 24
15. **ధారావాహిక : దివ్యజీవన దర్శనం-67** భవిత కోసం ప్రతీక్ష-3 26
16. **ప్రత్యేక వ్యాసం :** (01.09.09 నుండి 09.09.09 వరకు శాంతికుంజ్‌లో జరిగిన సంజీవనీ సాధనా శిబిరం సందర్భంగా) డా॥ ప్రణవ పండ్యాగారి ప్రవచనం నుండి 28
17. **ధారావాహిక : దేవ సంస్కృతీ సౌరభం-29** భారతీయ సంస్కృతిలో 'గ'కార మహిమ 30
18. **చతుర్ముఖీ సాధన : అమృతవాణి-1** మానవుడు తన సౌభాగ్యానికి తానే నిర్మాత 33
19. **మహిళాజాగరణ :** ఆదర్శాల సజీవ ప్రతిమ-భారతీయ మహిళ 35
20. **ఆధ్యాత్మిక విజ్ఞానం :** స్వప్నంలో దర్శనమిచ్చిన క్వాంటమ్ సిద్ధాంతం 37
21. **ఆలోచనల్లో ప్రచండ శక్తి** 39
22. **విపత్తులకు విలపించడం కాదు-వివేకంతో సాగాలి :** మరో హరిత విప్లవం 40
23. **ధారావాహిక : ప్రజ్ఞోపనిషద్** ఒక పరిచయం 41
24. **నా వారితో నా మాట :** శతజయంతి ఉత్సవాల రూపురేఖలు-10 42
25. ఏ పుస్తకంలో ఏమున్నది? 45
26. **వార్తలు** 46



## సద్గురు వచనామృతం

### జీవితం - సిద్ధాంతం

క్రమబద్ధమైన జీవితానికి ప్రథమ ఆవశ్యకతలు ఏమంటే సిద్ధాంతం, ఆచరణ ద్వారా దాని నిరూపణ. ఇందులో 'కర్తవ్యం' ప్రప్రథమం. కర్తవ్యానికి అతి స్పష్టమైన అర్థం ఏమంటే - తన పనిలో తన్మయత్వం. ఇతరుల పనులలో ఇతరులకు మార్గం చూపుతానని పదేపదే చెప్పే వ్యక్తికి తన మార్గం అసలు తెలియదు.

జీవితం యొక్క రెండవ సిద్ధాంతం "నిజాయితీ". చెప్పేదే చేయి, చేసేదే చెప్పు అన్నది దీని మూల మంత్రం. రకరకములయిన టక్కరులకూ, మోసకారులకూ, కపటులకూ, దూరంకావడం దాని పని. నిజాయితీ వలన మనిషిపట్ల విశ్వాసం ఉత్పన్నమవుతుంది. ఈ విశ్వాసమే సంపూర్ణ సుఖం, సమృద్ధులకు జనని

నాలుగవ సిద్ధాంతం 'ఉదారత'. మితవ్యయంతో దీనికి పరోక్ష సంబంధం ఉన్నది. మితవ్యయం చేయని వాడు ఉదారుడు కాలేడు.

"ఆత్మ సంయమనం" జీవితం యొక్క అయిదవ, ఆఖరి సిద్ధాంతం.

ఈ ఐదు సిద్ధాంతాలు విజయానికి ఐదు మార్గాలు. జీవనపథానికి వెలుగు చూపే అయిదు కిరణాలు. ప్రారంభంలో ఆచరణ ద్వారా వీటి నిరూపణ కష్టం కావచ్చు. అయితే అభ్యాసం మనల్ని ఈ సిద్ధాంతాలతో విలీనం చేస్తుంది.

*(అఖండజ్యోతి, అక్టోబరు, 1951)*

అనువాదం-ఊటుకూరు సత్యనారాయణ గుప్త

### పండుగలు

**నవంబర్ 2009**

02-11-09 గురునానక్ జయంతి

14-11-09 నెహ్రూ జయంతి

28-11-09 గీతా జయంతి

**డిశంబర్ 2009**

01-12-09 దత్తాత్రేయ జయంతి

**అపకారికి ఉపకారము చేయువాడు నేర్పరి - సుమతీ శతకం.**

వేద మంత్రం

# దేశ రక్షణకు జ్ఞాన, కర్మ, భక్తి యోగాలు మూడూ అవసరమే

**యస్యాం పూర్వే పూర్వజనా విచక్రిరే యస్యాం దేవా అసురానభ్యవర్తయన్ ।**

**గవా మశ్వానాం వయసశ్చ విష్ఠా భగం వర్చః పృథివీ నో దధాతు ॥**

**(అధర్వవేద 12/1/5)**

**భావార్థం :** ఏ దేశాన్ని మన పూర్వులు రూపొందించి, దుష్టుల నుండి రక్షించారో, దాని భవ్యతకు మనము త్యాగము, బలిదానమునకు సిద్ధం కావాలి.

**సందేశం :** దేశమంటే కేవలం సరిహద్దుల మధ్యనున్న భూభాగం మాత్రమే కాదు. ఆ పృథ్వితోపాటు, దాని మీద నివసించే నాగరికుల శారీరిక, బౌద్ధిక, ఆధ్యాత్మిక, శీలము, ఆచరణ మొదలయిన వ్యవహారములన్నింటి సమగ్రత యొక్కపేరు. వ్యక్తుల జ్ఞానయోగము, భక్తియోగము, కర్మయోగములచేత ఉత్పన్నమైన పాపము లేదా పుణ్యముల ప్రవాహము యొక్క పేరు. సమాజంలో వ్యాపించి ఉన్న సత్ప్రవృత్తుల, దుష్ప్రవృత్తుల దర్పణంలో దేశం యొక్క ప్రతిబింబం కన్పిస్తూ ఉంటుంది.

బయటి శత్రువుల నుండి లోపలి దుష్టులు, సమాజ వ్యతిరేక శక్తుల నుండి దేశాన్ని రక్షించుటకు ఎల్లవేళలా దేశంలోని ప్రజలందరూ వయోభేదం లేకుండా దేశ రక్షణకై నడుం బిగించాలి. భగవానుడు ఆయా సమయాలలో దేశరక్షణకు అవతరిస్తూ వస్తున్నాడు. ఆయన ఏకైక లక్ష్యం పాపులను నాశనం చేయుట, పుణ్యాత్ములను ఉద్ధరించుట. దీని కోసం జ్ఞానం, కర్మ, భక్తి మూడింటి రహస్యం తెలుసుకొనుట అవసరం. జీవితాన్ని గురించి తెలుసుకొనుట జ్ఞానం. ఇతిహాసం, భూగోళం, గణితం మొదలైనవి చదువుట విద్య, కానీ జీవిత లక్ష్యాన్ని తెలియజేసేదే అధ్యాత్మ జ్ఞానం. నేను ఏమిటి? ఎక్కడ నుండి వచ్చాను? నా లక్ష్యం ఏమిటి? ఈ విషయాలన్నింటిని జ్ఞానం బోధపరుస్తుంది. ప్రాప్తించుకొన్న జ్ఞానాన్ని జీవితంలో ఆచరించుట కర్మ. మనకు గీత, భాగవతం, రామాయణం తెలుసు కానీ ఆ జ్ఞానమును మనం గదిలో బంధించి ఉంచాం. దానిని కర్మలోకి మార్చాలి. మన లోపలి దోషాలను దుర్గుణాలను, దురాలోచనలను బయటకు పంపినపుడే భగవంతుని కృప ప్రాప్తిస్తుంది. జ్ఞానం, కర్మల సమన్వయరూపాన్ని జీవితంలో ఆచరించుటయే నిజమైన భక్తి. కేవలం కర్మకాండలో చిక్కుకోవటం, నిరర్థక పూజా పురస్కారములను భక్తి అని అనలేము.

దేశ రక్షణకు లోపలి, బయటి శత్రువులతో తలపడవలసి వస్తుంది. మహాభారత యుద్ధ సమయంలో భగవాన్ కృష్ణుడు అర్జునుడికి ఎంతో స్పష్టంగా సారగర్భితంగా ఉపదేశించాడు. నేటికి కూడా ఆ పవిత్ర గీత ప్రపంచంలో ప్రకాశస్థంభం (లైట్‌హౌస్) వలె అందరికీ మార్గదర్శనం చేస్తున్నది. బంధువులు, తోడబుట్టినవారు కూడా దేశానికంటే మించిన వారుకాదు. దేశరక్షణకు ఒకవేళ వారిని చంపవలసి వచ్చినా అది కూడా ధర్మానుకూలమే. త్యాగం, బలిదానం యొక్క ఈ ఉత్కృష్ట భావనా బలం చేతనే మనుష్యుడు తన స్వార్థభావనపై విజయం పొంది నిండుమనస్సుతో దేశరక్షణ అనే కీర్తికరమైన కార్యము పూర్తి చేయగలడు.

మన మనస్సులలో దేశ రక్షణ కొరకు త్యాగం, బలిదాన భావన ఉండాలి. మాయ, మోహం, మమకారం వదలివేయాలి. స్వార్థాన్ని బలి ఇవ్వాలి. మనం దేశహితం సర్వోన్నతమైనదిగా భావించి మన హితాన్ని ప్రసన్నపూర్వకంగా వదలివేయుటలో తత్పరులం కావాలి. అప్పుడే దేశ ఋణం నుండి విముక్తులం కాగలం.

అజ్ఞానులైన నాగరికులలో ఈ భావనను ప్రతిష్ఠించుటయే విద్వాంసుల కర్తవ్యము.

★★★

**దానం ఇవ్వడం అంటే నాటుకోవడమే.**

# పరమపూజ్య గురుదేవుల జన్మ శతాబ్ది-2400 కోట్ల మంత్రజపం

కారణజన్ములైన పరమపూజ్య గురుదేవులు గాయత్రీ మంత్రజపం ద్వారానే విజయాలు సాధించారు. వారి జన్మ శతాబ్దినాటికి మనం అంటే దక్షిణ భారత విభాగం 2400ల కోట్ల గాయత్రీ మంత్రజపాన్ని సామూహికంగా నిర్వహించి గురుదక్షిణగా సమర్పించాలన్న నిర్ణయం జరిగింది. ఇప్పటికే అనేకచోట్ల ప్రారంభింపబడింది. పరిజనులందరు రోజుకు మూడు మాలలు మంత్ర జపం చేయాలి. మీమీ బంధుమిత్రులను ప్రభావితం చేసి వారిచేత జపం చేయించాలి. ఏ రోజైనా ఏ కారణంగానైనా చేయలేకపోయినట్లైతే మరియొకరోజు పూర్తి చేసుకోవచ్చు. సగటున రోజుకు మూడు మాలలు వచ్చేలా చూసుకోవాలి. మూడు మాలలకన్నా ఎక్కువ చేయగలిగితే మరీమంచిది. మూడుమాలలు చేయలేనివారు కనీసం ఒక్క మాలైనా చెయ్యాలి.

**ముఖ్యగమనిక :** ప్రముఖ కార్యకర్తలు, పరిజనులు తమతమ ప్రదేశాలలోని పాఠశాలలకు పర్యటించి విద్యార్థుల చేత కనీసం 10-15 నిమిషాలు మంత్రజపం చేయించాలి. ఇప్పటికే చీరాలలోని ఒక పాఠశాలలో చేయించుచున్నారు. "విద్యార్థులలో జ్ఞాపకశక్తి పెరిగింది. ఏకాగ్రత కుదిరింది. బుద్ధివికసించింది. ప్రవర్తన మారింది" అని తెలియచేశారు. కనుక మన ప్రయత్నం ఆ వైపుగా సాగాలి. లెక్కింపు సౌకర్యార్థం క్రింద ఒక పట్టిక ఇవ్వబడింది. దానిలో 31 గడులు ఉన్నాయి. ప్రతిరోజు ఆ రోజు చేసిన మాలల సంఖ్యను ఒక్కొక్క గడిలో వెయ్యాలి. చేయనిరోజు డాష్ పెట్టాలి. నెలపూర్తికాగానే క్రింది ప్రొఫార్మాను నింపి క్రింది చిరునామాకు పంపాలి. ఈ పేజిని చింపుకొని నింపవచ్చు. లేకపోతే స్వయంగా తయారుచేసుకోవచ్చు.

**నోటు :-** సెప్టెంబర్ 2009 చివరి రోజు వరకు పూర్తి అయిన జపసంఖ్య: 5 కోట్ల 55 లక్షలు. లక్ష్యాన్ని చేరుకోవాలంటే ఎక్కువ సంఖ్యలో ఉత్సాహంగా పాల్గోవాలి.

*శ్రీ కె.పి.విఠల్, 48 LIG-II,బి.కె.గూడా,*
*సంజీవరెడ్డినగర్, హైదరాబాద్-500 038*
*ఫోన్ : 040-23705749, సెల్ : 9989655310*

ఇట్లు
మీ
అశ్విని సుబ్బారావు
*(విశ్వగాయత్రీ పరివార్-దక్షిణ భారత సంయోజకులు)*

**2400ల కోట్ల సామూహిక గాయత్రీ మంత్రజపము**

*తేదీ ........................ నుంచి .................. వరకు*

*నెం :* *పూర్తి జప మాలల సంఖ్య :* [ ]

| | | | | | |
|---|---|---|---|---|---|
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | | | | | |
| | *ప్రతిరోజు మీరు మంత్రజప మాలల సంఖ్యను పైన ఇచ్చిన గడులలో రాయండి* | | | | |

*పేరు : ..............................................................*

*గోత్రము : ..........................................................*

*చిరునామా : ......................................................*

*....................................................................*

*....................................................................*

*పుట్టిన రోజు మరియు వివాహదినము : ........................*

*....................................................................*

*ఫోన్ : ..............................................................*

*యుగశక్తి గాయత్రి మాసపత్రికకు క్రొత్త చందాదారులను చేర్పించండి.*

**ఏది నాటుతామో అదే మనకు లభిస్తుంది.**



## బాలల భవితకు బంగారు బాట-1

# అమ్మకు ఆభరణాలు

***(2009 నవంబర్ 14న చాచా నెహ్రూ జయంతి కదా! ఆ సందర్భంగా 'యుగశక్తి గాయత్రి'లో ప్రతి నెలా బాలల కొరకు ఒక ప్రత్యేక పేజీని ప్రారంభిస్తున్నాం – సంపాదకవర్గం)***

19వ శతాబ్దం మధ్యవయస్సుకు చేరుకుంది. కలకత్తాలో మధ్యవయస్కుడైన ఠాకూర్ దాస్ కుటుంబం చింతలు లేని కుటుంబం. చిన్న కుటుంబం కాదు. చింతలు గల చిన్న కుటుంబం. ముచ్చటగా ముగ్గురే ముగ్గురు. తాను, భార్య, ముద్దులు గారే మూడేండ్ల కొడుకు. ఠాకూర్ దాస్ కలకత్తా వీధుల్లో తిరుగుతూ కనిపించిన చిన్నా చితకా పనిచేస్తూ ఉండేవాడు. ఉన్నది ముగ్గురే అయినా ఎప్పుడో ఒక రోజు కాని వారికి కడుపునిండా తిండిదొరికేది కాదు. తండ్రి బాధపడేవాడు. తల్లి వ్యధచెందేది. కొడుకు భవిష్యత్తు శూన్యం. ఒకే ఒక ఆశాకిరణం వారి కళ్లకు వెలుగును చూపించేది. "ఎప్పటికైనా భగవంతుడు కరుణించకపోడు. మాకూ మంచిరోజులు వస్తాయి.'' ఆ రోజు కోసం ఎదురుచూస్తూ కాలం గడుపుతున్నారు.

వారి ఆశ ఫలించింది. ఆరోజు రానే వచ్చింది. భగవంతుని దయ వల్ల ఠాకూర్ దాస్‌కు మేధినీ పురం జిల్లాలోని ఒక గ్రామంలో చిన్న ఉద్యోగం వచ్చింది. నెలకు రెండు రూపాయల జీతం ఆ రోజుల్లో అది దొరకడం కూడ చాలా కష్టంగా ఉండేది. "ఇప్పటికి ఇది చాలు, ముందు ముందు ఇంకా ముందుకు నడిపించకపోతాడా?'' అన్న నమ్మకంతో రోజులు గడుపుతున్నారు. నాలుగేండ్లు గడిచాయి. కొడుకు వీధి బడికి వెళ్లి చదువుకుంటున్నాడు.

ఒకరోజు అమ్మకు జ్వరం వచ్చింది. బడినుండి రాగానే కొడుకు అమ్మకు కాళ్లు పడుతున్నాడు. జ్వరంతో మూలుగుతున్న అమ్మను చూస్తుంటే కొడుకుకు చాలా జాలివేసింది. పాపం అమ్మకు ఎప్పుడూ కష్టాలే. నేను పెద్దవాడిని అయ్యాక అమ్మను సుఖపెట్టాలి అనుకున్నాడు. ఇంక ఆగలేకపోయాడు. "అమ్మా నీకు ఎప్పుడూ కష్టాలే. నేను బాగా చదువుకుని పెద్ద ఉద్యోగం చేస్తాను. నీకు మంచి భోజనం పెడతాను. మంచి చీరలు కొంటాను. ఇంకా బోలెడునగలు చేయిస్తాను" అన్నాడు.

అమ్మ ఆనందానికి అంతేలేదు. అవును నాయనా! నువ్వు బాగా చదువుకుంటావు. నన్ను సుఖపెడతావు. ఆ నమ్మకం నాకుంది. కాని నగలు మాత్రం నేను కోరుకున్న నగలే చేయించాలి సుమా! అంది "తప్పకుండా నువ్వు కోరుకున్న నగలే చేయిస్తాను. ఏం కావాలో చెప్పమ్మా" అన్నాడు హుషారుగా బాలుడు.

"నాన్నా! బోలెడు నగలువద్దు మూడంటే మూడు చేయించు చాలు, జాగ్రత్తగా విను. 1.మన గ్రామంలో పెద్ద బడిలేదు. నువ్వు ఇక్కడ హైస్కూల్ కట్టించాలి. 2. అట్లాగే హస్పటల్ లేదు. ఒక ఆసుపత్రి కట్టించాలి. 3. అనాధ పిల్లలు తినడానికి ఉండడానికి, చదువుకోవడానికి చక్కని అవకాశం కల్పించాలి." అంది కొడుకు తలపై చెయ్యి పెట్టి నిమురుతూ.

ఇక చూసుకోండి పదేండ్ల పిల్లవాని మనస్సులో ఎన్నెన్ని ఊహలో! ఊహించి వ్రాయాలంటే బ్రహ్మదేవునికి కూడా సాధ్యం కాదు. తల్లి పాదాలకు తల ఆనించాడు. "ఈ మూడు నగలు నీకు తప్పకుండా చేయిస్తానమ్మా" అంటూ ప్రమాణం చేశాడు. తరువాత బాగా చదువుకుని పండితుడు అయ్యాడు. ఎన్నో ఉన్నత పదవులు అలంకరించాడు. డబ్బు సంపాదించాడు. తల్లికి ఇచ్చిన మాటను మాత్రం మరచిపోలేదు. ఆ గ్రామంలో ఉన్నత పాఠశాల, ఆసుపత్రి, అనాధశరణాలయం కట్టించాడు. అంతటితో ఆగకుండా స్త్రీవిద్య కొరకు, వితంతు వివాహాలు జరిపించడానికి చాలా కృషి చేశాడు. ఇంతకూ ఇంత నాణ్యమైన నగలను చేయించిన కొడుకు ఎవరనుకుంటున్నారు? మన పండిత ఈశ్వర చంద్ర విద్యాసాగర్. అదేవిధంగా మనం కూడా అమ్మ ఋణం తీర్చుకుందాం.

కం॥ జన్మనొసగినట్టిజనని

జన్మనొసగుభూమియు మన జననియటంచున్

జన్మకుసారము నెరుగుచు

జన్మను తరియించవలయు జగమున బాలా!

★★★

**వినయం వ్యక్తిత్వానికి శోభ ఇస్తుంది.**

ధారావాహిక : పరమేశ్వరుని చిరునామా-6

# మానవ శరీరం-ఒక అద్భుత యంత్రం

శిఖ్కు సామ్రాట్ సర్దార్ రణజీత్‌సింగ్ దర్బారులోని ప్రసిద్ధ భారతీయ యోగి జనరల్ వెంటూర్ సమ్ముఖంలో తన నాలుకను బయటకుచాపి రెండు కనుబొమ్మల మధ్య ఉండే శిరోభాగాన్ని తాకించి చూపించేవాడు. యోగులు నాలుకను మడిచి గొంతులోపలకు పోనిచ్చి అక్కడ రంధ్రాన్ని మూసివేసి మస్తిష్కంలో అమృతపానం చేయగలుగుతారని హరిదాసు చెప్పేవాడు. అలాంటి యోగి తన మృత్యువును జయిస్తాడు. నాలుకతో అలా జరగదని ఇంగ్లీషువారు చెబుతారు. దానికి జవాబుగా హరిదాసు తన నాలుకను బయటకు చాపి చేసి చూపించాడు. కొన్ని ఔషధాల ద్వారా నాలుకను ఈ విధంగా చేయవచ్చని చెప్పాడు.

మనిషిలో ఎన్నో అసాధారణ శక్తులు దాగి ఉన్నాయి. వాటిని వెతికి పట్టుకోవడంలో లగ్నమయ్యేవారు బయటి సంపాదనతో ఏవిధంగానూ సాధ్యంకాని అసాధారణ శక్తులను హస్తగతం చేసుకుంటారు.

సిద్ధుల చర్చ వచ్చిన చోట కొన్ని వివరణలు కూడా ముందుకు వస్తాయి. దీనిని బట్టి బయటి పరిస్థితుల వరకే పరిమితమవ్వడం కంటే సుఖసంపన్నంగా తయారు కావడానికి మన అంతరంగంలో దాగియున్న శక్తులను వెదికి, జాగృతం చేయడం అత్యంత లాభదాయకం అని తెలుస్తుంది.

బౌద్ధమతపు యోగ సాధనలలో ఒక జీవసాధన ఉన్నది. దాని అవశేషాలు జపాన్‌లాంటి దేశాలలో కూడా గత కొంత కాలం వరకు వాడుకలో ఉండేది.

కొరియాకు చెందిన పొట్టిగా, సన్నగా, బలహీనంగా ఉండే ఒక పహిల్వాన్ అమెరికా వెళ్ళాడు. బాగా పేరుమోసిన అక్కడి పహిల్వానులను పోటీకి పిలిచాడు. ఆ రోజులలో అమెరికాకు చెందిన పహిల్వాన్ ఛాంపియన్ డికారియల్‌తో కుస్తీ పోటీ నిర్ణయంచబడింది. కొరియా పహిల్వాన్ చూడడానికి డికారియల్ కంటే రెండడుగులు పొట్టివాడే, అంతేకాక ఆకారంలో కూడా అతని ముందు చిన్న పిల్లవాడుగా కనిపిస్తాడు. ఆరడుగుల ఏడంగుళాల డికారియల్ ఎక్కడ? నాలుగడుగుల, ఒక అంగుళం ఉన్న పొట్టి బాలుడిగా కనిపించే మాస్ ఎక్కడ? ప్రేక్షకుల ఉత్సాహం నీరుగారిపోయింది. పొంతన లేని జోడీ మధ్య జరిగే కుస్తీ పోటీలో సహజ ఫలితాన్ని ఊహించి సమయానికి ముందే లేచి వెళ్ళడం ప్రారంభించారు. కాని చూచేవారికి వింతగా కొన్ని పంచ్‌ల తరువాత 'మాస్' డికారియల్‌ను చిత్తుగా ఓడించి వెయ్యి డాలర్ల బహుమతి పొందాడు.

అమెరికా ప్రజలు ఈ పరాజాయాన్ని తమ జాతికే అవమానంగా భావించారు. మాస్ మోసంతో, కపటంతో గెలిచాడని ఆరోపణలు వెల్లువెత్తాయి. వార్తా పత్రికలలో ఈ విషయంగా కటువైన వ్యాఖ్యానాలు వ్రాశారు. ఖిన్నుడైన మాస్ మరో పోటీకి సిద్ధమై ఆరోపణలకు జవాబు చెప్పాడు. అమెరికాలో ఎవరైనా సరే నన్ను ఓడిస్తే నాకు బహుమతిగా లభించిన ఈ వెయ్యి డాలర్లు అతనిని ఆనందంగా ఇచ్చి వేస్తానని పత్రికలలో ప్రకటించాడు. చివరికి ఒక పోలీసు ఆఫీసరుతో పోటీ ఏర్పాటు చేయబడింది. ఈ ఆఫీసరు అంతర్జాతీయ ఖ్యాతిగాంచిన పహిల్వాను. చాలా ఆవేశంగా కుస్తీ పోటీకి వచ్చాడు. కాని ఈ సారి ఇంకా ఆశ్చర్యకరమైన విషయం. మాస్ ఇచ్చిన పంచ్‌కు పాపం ఆ పహిల్వాను రెండు ఎముకలు విరిగిపోయాయి. దీనికి అమెరికన్లు ఇంకా కోపోద్రిక్తులై తన్నడానికి ముందుకు వచ్చారు. ఏదో విధంగా పారిపోయి తన హోటల్‌కు చేరుకొని ప్రాణాలు కాపాడుకున్నాడు మాస్.

ఇది అమెరికాకు సంబంధించిన విషయం. ఇంతకు ముందు మాస్ జపాన్‌లో కూడా తన పరాక్రమాన్ని ప్రదర్శించాడు. అతడు జన్మతః కొరియా దేశానికి చెందినా బాల్యంలోనే తన తండ్రితోపాటు జపాన్ వచ్చి అక్కడి పౌరుడిగా స్థిరపడ్డాడు. అతడు ఒక విశేష వ్యాయామ కళ జెన్ సాధనను అభ్యసించాడు. ఆ బలంతోనే అతడు గొప్ప యోధుడుగా తయారయ్యాడు.

పోటీలలో తరచుగా అతని ముందు అత్యంత గట్టిగా ఉండే రాళ్ళలాంటి రెండు ఇటుకలను ఉంచేవారు. ఇటుకల గట్టిదనాన్ని నిపుణులు పరీక్షించేవారు. తరువాత రెండు అరచేతుల మధ్య

**ఇష్టం అయితే ఏ పని కష్టం కాదు.**

ఇటుకలను ఉంచుకొని ఇటుకలను చూర్ణం చేసేవాడు. ప్రేక్షకులు అవాక్కయ్యేవారు.

ఒకసారి జపాన్‌లో ఒక విచిత్రమైన కుస్తీ పోటీలో పాల్గొనవలసి వచ్చింది. ఓడిపోయిన పహిల్వానులందరూ కలిసి ఒక ఆబోతుతో కుస్తీ పట్టాలని పట్టుబట్టారు. ముందు తటపటాయించినా వెనుక నుండి అరుపులు కేకల ప్రోత్సాహంతో అందుకు సిద్ధపడ్డాడు. ఇందుకోసం బాగా కోపిష్ఠి, 13 మణుగుల బరువుగల ఒక ఆబోతును మత్తుమందు తాగించి ప్రాణఘాతుక పోట్లు పొడవడంలో తర్ఫీదు ఇచ్చారు. ఈ పోటీని చూడడానికి జపాన్ మారుమూల ప్రదేశాల నుండి ప్రజలు విచ్చేశారు. డాక్టర్లు, పోలీసులు ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేశారు. ఆబోతు దెబ్బలకు మరణస్థితికి చేరుకుంటే మాస్‌కు ఎంతో కొంత చికిత్స చేయడానికి ఈ ఏర్పాట్లు చేశారు. క్రోధంతో ఉన్న ఆబోతును వశం చేసుకునే బాధ్యత పోలీసులది. కనుక అందుకు కూడ ముందుగానే ఏర్పాట్లు చేశారు.

మాస్ పూర్తిగా నిరాయుధుడు. పిడికెళ్ళు మాత్రమే అతని కత్తి – డాళ్ళు. పోటీ ప్రారంభమైంది. మొదటి ఆక్రమణ అవకాశం సుశిక్షితమైన ఆబోతుకు ఇవ్వబడింది. మాస్ తన స్థానంలో రాతి బండలాగా నిలబడ్డాడు. ఢీ కొన్న ఆబోతుకు ఏ మాత్రం బెదరక గ్రుద్దులతో ఎదురుదెబ్బలు వేశాడు. ఒక్క గుద్దుకే తల తిరిగి కుప్పకూలింది. 13 మణుగుల భారీ శరీరం గల మహా రాక్షసుడు లాంటి ఆబోతును పొట్టిగా, కురచగా రెండు మణుగుల బరువు కూడా లేని ఒక మనిషి ఇలా పడగొడ్డగలడా? ఈ దృశ్యం అందరినీ ఆశ్చర్యచకితుల్ని చేసింది. కొంతమందయితే ఇదేదో భూత ప్రేతాలు, గారడీ మంత్ర విద్యల మహిమ అంటూ చెప్పుకోసాగారు.

తన శక్తి యొక్క రహస్యాన్ని చెబుతూ మాస్ యోగ సాధనను విస్తారంగా వర్ణించాడు. ఆ ప్రక్రియ చరిత్రను చెప్పేశాడు.

జపాన్‌లో జెన్ సాధన పూర్వకాలంలో కూడా చాలా ప్రఖ్యాతిగాంచింది. గౌరవించబడింది. బౌద్ధమత సాధువులు తమ శిష్యులకు దీనిని నేర్పేవారు. దీని ఆధారంగా మనుషులు కేవలం ఆధ్యాత్మికంగానే కాక భౌతిక శక్తులను కూడా పొందగలిగేవారు. జెన్ సాధన ఒక నట విద్యగాకాక విశుద్ధ యోగాభ్యాసంగానే భావించాలి. జపాన్‌కు చెందిన "జుజుత్సు" విద్య ప్రపంచమంతా ప్రసిద్ధి చెందింది. దీని ఆధారంగా మనిషి తనకంటే రెండింతలు బలవంతుడైన పోటీదారుని మాటలలో మట్టి కరిపించగలడు. దీనిని బలపరిచే కథలే అక్కడ బాగా ప్రసిద్ధి చెందాయి. జపాన్ వాసులు వాటిలో నిష్ఠను కూడా కలిగియుంటారు.

మాస్‌కు బాల్యం నుండి యోగ విద్య మీద ఆసక్తి ఉండేది. జెన్ నిష్ణాతుడైన మహాభిక్షువు పునా కోశీ వద్ద దీక్ష తీసుకున్నాడు. అతని దగ్గరే ఉండి ఈ విద్యను నేర్చుకోవడానికి వెళ్ళాడు. అందుకోసం నిర్జన పర్వత ప్రాంతాలలో మంచుతో కప్పబడిన గుహలలో వనస్పతులను తింటూ సాధన చేశాడు. కొన్ని సంవత్సరాల తరువాత తిరిగి వచ్చినప్పుడు జడలు, గడ్డం బాగా పెరిగాయి. అందరూ అతడు పిచ్చివాడనుకున్నారు. అయితే ఏమి? పట్టుదల, పంతమే ఆస్తిగా గల అతడు తన లక్ష్యసాధన వైపు సాగిపోతూ ఉన్నాడు. చివరికి జెన్ సాధనలో సిద్ధపురుషుడుగా తయారయ్యాడు.

యోగసాధనల ఉద్దేశ్యం మనిషిలోని అంతఃచేతన యొక్క అసాధారణ శక్తులను, అర్హతలను ఈశ్వరీయ శక్తితో జోడించడమే. ధర్మదర్శన ఆస్తికవాదుల సిద్ధాంతం ప్రకారం పరమాత్మ యోగ్యతలకు కేంద్రం. ఆయనతో సంబంధం ఏర్పరచుకోవడంతో మనిషి కావలసిన విధంగా అభివృద్ధి సాధించవచ్చు.

ఈశ్వరుడు ప్రసన్నుడై ఇలాంటి వరాలేవో ఇస్తాడని దీని అర్థం కాదు. అయితే ఈ శక్తులన్నీ మనిషిలో బీజ రూపంలో ఉంటాయి. సాధనల ద్వారా ఆ అర్హతలను, శక్తులను వికసింపజేయడం జరుగుతూ ఉంటాయి. వాటి ద్వారా ఏదో మానవేతర శక్తి ఉన్నట్లు సంకేతాలందుతాయి.

కలకత్తాకు చెందిన ది మార్టన్ రివ్యూ 1936 జులై సంచికలో సర్ ఎ.ఎస్.ఎడింగ్టన్ ఇలా వ్రాశాడు – 'మనకు అదేమిటో తెలియదు. అయితే ఏదో అజ్ఞాతశక్తి పనిచేస్తున్నది. నేను భౌతిక పదార్థాని కంటే చేతననే ముఖ్యమైనదిగా నమ్ముతాను. నాస్తికవాదం వెళ్ళిపోయింది. మతం ఆత్మకు, మనసుకు చెందిన విషయం దానిని ఏ విధంగానూ కదపలేము.

ఇవన్నీ విన్న తరువాత కూడా ఈనాటి పాశ్చాత్య నాగరికతతో ప్రభావితమైన సమాజం చేతనను నమ్మడానికి సిద్ధంగా లేదు.

**తప్పులు చేయనివారు ఎవరు ఉండరు.**

ఎందుకంటే అది వస్తురూపేణ కనిపించేదికాదు. ఐన్‌స్టీన్ విజ్ఞాన శాస్త్ర పారంగతుడు. సృష్టిలో ఏదో ఒక చేతన పనిచేస్తున్నదని చెప్పాడు. అయినా కూడా విజ్ఞాన శాస్త్రవేత్తలు నమ్మడానికి సిద్ధంగా లేరు. అపుడు పైన చెప్పిన వివరణాత్మక సంఘటనలు ఈ నమ్మకానికి బలం చేకూర్చడం లేదని చెప్పవలసివస్తుంది.

ఒక లండన్ నివాసికి సంబంధించి కొద్ది సంవత్సరాల క్రితం ఒక సమాచారం అందింది. 76 సంవత్సరాల వ్యక్తికి 18 సంవత్సరాల వయసులో ఏదో ఒక రోగం కారణంగా నిద్రాభంగమైంది. ఆ తరువాత జీవితంలో అనగా 58 సంవత్సరాల వరకు అతనికి నిద్ర అనేదే రాలేదు. అతని శరీరము లేదా మస్తిష్కంలో ఏ రోగము లేదు అసాధారణం అని చెప్పగలిగిన లక్షణాలేవీ కనిపించలేదు. అనగా ఇన్ని సంవత్సరాలు వరుసగా నిద్రలేకపోయినా కూడా పూర్తి ఆరోగ్యంగా ఉన్నాడు.

స్పెయిన్‌కు చెందిన బైలెంటిన్ మెడినా పేరుగల మరో వ్యక్తి గత 62 సంవత్సరాల నుండి నిద్రమాట అటుంచితే రెప్పకూడా వాల్చలేదట. ఎప్పుడైనా ఆవులింత అయినా వచ్చిందో లేదో అది కూడా గుర్తులేదు. 24 గంటలు పనిచేసేవాడు. మొదట్లో అర్నెస్టో మేడార్జ్‌కు చెందిన వ్యవసాయ భూములలో 16 గంటలు పనిచేసేవాడు. అక్కడే ఉండేవాడు. మిగిలిన ఎనిమిది గంటలు కాపలాదారుగా పనిచేసేవాడు. ఒక కార్మికుడు ఎనిమిది గంటల కూలీ సంపాదిస్తే వెలైంటిన్ మూడు భాగాలలో పనిచేసి మూడు రెట్లు సంపాదించేవాడు. ప్రతి రోజు రెండుసార్లు అల్పాహారం, నాలుగుసార్లు భోజనం చేసేవాడు. అలసిపోతే కొంచెంసేపు కూర్చొని విశ్రాంతి తీసుకుంటే సరిపోతుంది. నిద్ర అయితే లేనే లేదు. నిద్రపోవడానికి ఇప్పటివరకు అతని వద్ద పక్క కూడాలేదు.

ఈ అసాధారణ స్థితిని గురించి వైద్యులు పరిశోధించి చూశారు. మాత్రలు, ఇంజెక్షన్, మందులు కూడా ఇచ్చారు. కాని తేడా ఏమీ లేదు. మరణించిన తరువాత పరీక్షించడానికి డాక్టర్లు అనుమతి కూడా అడిగారు. స్పెయిన్ మెడికల్ కాలేజీకి ఈ అనుమతి ఇవ్వబడింది. కాని అహర్నిశలు నిద్రలేకుండా ఉండడానికి సంబంధించి ఎటువంటి ఆధారం వారికి లభించలేదు.

స్టాక్‌హోం (స్వీడన్) దగ్గర మెస్టెరీజ్ అనే నగరం ఉన్నది. అధిక జనాభా ఉండేవాడు. మధ్యలో ఒక కన్యా పాఠశాల. ఒక గౌరవనీయ వ్యక్తి యొక్క 13 సంవత్సరాల కుమార్తె కారోప్లయిన్ కార్ల్సవాటర్ ఈ స్కూలులో చదవడానికి వస్తూ ఉండేది. ఒక రోజు జరిగిన విషయం. రాత్రి పూర్తిగా నిద్రపోయినా కూడా ఇంకా నిద్ర ఒక ఆవేశంలాగా వస్తూ ఉండేది. మేలుకొని ఉండడానికి ఎంత ప్రయత్నించినా సాధ్యం కాలేదు. ఒకరోజు చదువుతూ చదువుతూనే అకస్మాత్తుగా డెస్క్ మీద ఉన్న పుస్తకాల మీద తల ఉంచి నిద్రపోయింది. ఉపాధ్యాయులు నిద్రలేపడానికి ఎంతగానో ప్రయత్నించారు. కాని గాఢనిద్రలోకి జారిపోయింది. నిద్రలేపడం అసంభవం అని తెలిశాక ఇంటికి పంపించివేశారు. ఒకరోజు, రెండు రోజులు, మూడు రోజులు, వారం, నెల సంవత్సరం అలా గడిచిపోయింది. కాని ఆమె నిద్రలేవలేదు. పాలు, పళ్ళ రసాలు ఒక ట్యూబ్ ద్వారా ఇస్తూ ఉండేవారు. తద్వారా శరీర ధర్మాలు సామాన్యరీతిలో జరుగుతుండేవి. కాని ఒక్కసారి పట్టిన నిద్ర మరల భంగం కాలేదు.

నిరంతరం సంరక్షణ, ఎదురు చూపులతో 23 సంవత్సరాల తరువాత నిద్రాభంగం కలిగింది. అప్పటికి 36 సంవత్సరాల నడివయస్కురాలైంది. యవ్వనం నిద్రలో వెళ్ళిపోయింది. నిద్రలేస్తూనే పుస్తకాలు అడిగింది. ఎక్కడ చదువు ఆపివేసిందో అక్కడ నుండే మరల చదవడం ప్రారంభించింది.

కొంతకాలం క్రితం గ్రీస్‌లో ఒక వ్యక్తి ఉండేవాడు రోజుకు 100 పౌండ్ల కంటే ఎక్కువ భోజనం చేసేవాడు. ద్రవపదార్థాలు, అల్పాహారం వేరే ఉండేవి. గ్రీకు దేశీయులు, ముంతాజ్ మహల్ గుర్తుకు చిహ్నంగా తాజ్‌మహల్ కట్టించినట్లు 'మిలో ఆఫ్ క్రోటోనా' అనే పేరుగల ఈ వ్యక్తి స్మృతికి ఒక కట్టడాన్ని నిర్మించారు.

వాస్తవానికి ఈ స్మృతి పథం (మాన్యమెంట్) క్రోటోనాదికాదు. అతని విచిత్రమైన జీర్ణవ్యవస్థకు సంబంధించినది. ప్రకృతి ఇచ్చిన సాధనాలు ఎంతో శక్తి వంతమైనవి సమర్థమైనవి. వాటిని దుర్వినియోగం చేసుకోకుండా ఉంటే ప్రపంచంలోని యంత్రాలు మానవ శరీరంతో పోటీ పడలేవు.

నిజానికి క్రోటోనా ఈ స్మృతి చిహ్నం ద్వారా బాగా ప్రసిద్ధి చెందాడు. కాని అతని కంటే ఎక్కువ జీర్ణశక్తిగల వారు వచ్చారు. భారతదేశంలో వృద్ధులలో ఇలాంటి నిజమైన కథలు గ్రామ గ్రామాల వినబడుతూ ఉంటాయి. వాటితోపాటు చెడు ఆహారపు అలవాట్లు కారణంగా మనిషి శరీర అగ్నిని నష్ట పరుచుకోకుండా

**తప్పులు సరిదిద్దుకుని ముందుకు సాగాలి.**

ఉంటే పొట్ట చెడిపోకుండా ఉంటుందని ఉపదేశిస్తూ ఉంటారు. ప్రొఫెసర్ పి.జి.గ్రే కథనానుసారం మట్టిలో 200 కంటే ఎక్కువ క్రిములుంటాయి. అవి కార్బాలిక్ యాసిడ్ లాంటి విషపూరితమైన రసాయనాన్ని త్రాగి హరాయించుకుంటాయి. హరాయించు కోవడమేగాక దానితోనే శరీరాన్ని వికసింపజేసుకుంటాయి. అలాంటపుడు మనిషి పొట్టలోని గందరగోళం మాటఏమిటి? మందాగ్నితో ఏడుస్తున్నాడంటే శరీరాన్ని దేవుడిచ్చిన వరంగా భావించి దానిని పవిత్రంగా సురక్షితంగా ఉంచుకోవలసినది పోయి దానినొక చర్మం కప్పిన యంత్రంగా భావించి దాని శక్తిని పిండి మరీ ఆనందిస్తున్నాడని చెప్పాలి.

శరీర వేడిని నష్టపరచుకోకుండా ఉంటే మనిషి ఎంత తినగలడు? దీనికి సంబంధించి మరో ఘటన డెట్రాయిట్ – మిచిగావ్ (అమెరికా) ముందు మిలోక్రోటోనా భోజనమైతే ఒక చిన్న పశువుతో పోల్చవచ్చు. రైల్వే విభాగంలో పనిచేసే ఎడికో 6 అడుగుల ఎత్తు, 210 పౌండ్ల బరువుండేవాడు. రోజుకు 150 పౌండ్లు అంటే సుమారు 75 కిలోల ఆహారం తీసుకునేవాడు. అయిదుగురు వ్యక్తులున్న ఒక సామాన్య కుటుంబానికి ఒక వారానికి సరిపడే భోజనం ఎడికో ఒక పూటకు అతికష్టం మీద సరిపెట్టుకోవాల్సి వచ్చేది.

అతను ఏదైనా హోటల్‌కు భోజనానికి వెళ్ళితే కొద్దిసేపు ఇతరులకు భోజనం ఆపివేయవలసి వచ్చేది. ఎడికో భోజనం చూసిన తరువాత దానితోనే వారి కడుపు నిండిపోయేది. మరల భోజనం చేయవలసిన అవసరం వచ్చేదికాదు. ఒక పెద్దపంది మాంసంతో తయారైన 60 ముక్కలు, పళ్ళు, 24 కచ్చోరీలు ఒకేసారి తుడిచిపెట్టేవాడు. తిన్న తరువాత నీరు అపరిమితంగా త్రాగేవాడు. ఒక్కసారి లెక్కగట్టి చూస్తే 50 సీసాల నీళ్ళు త్రాగేశాడు.

ఆదివారం ప్రత్యేకమైన ఆహారం తీసుకునేవాడు. ఆ రోజు పందిమాంసం తీసుకోడు. 15 కోళ్ళను తినేవాడు. ఒక సారి పొట్ట నిండిపోయిన తరువాత ఇతరుల బలవంతం మీద 60 పౌండ్ల బరువుగల మూడు పక్షులను తిన్నాడు. 24 పౌండ్ల జున్ను, 300 గుడ్లు అతని అతి తేలికైన అల్పాహారం. అలా రోజుకు రెండు, మూడు సార్లు తినేవాడు. అంతేకాక వేయించిన ఒక పంది మాంసం 45 పెద్ద ముక్కలు, 60 చిన్న ముక్కలు రెండు గ్యాలన్ల వేయించిన బంగాళాదుంపలు, 10 కప్పుల కాఫీ, 50 సీసాల బీరు, 50 సీసాల ఇతర పానీయాలు, 50 కచోరీలు ప్రతి రోజూ భోజనంలో ఉండాలి. వివాహం గురించి అడిగితే నాకు భోజనంలోనే మహా ఆనందంగా ఉంటుంది అనేవాడు. అతడు వివాహమే చేసుకోలేదు. ఈ సంఘటన ఏం చెబుతుందంటే నశింపజేసుకోకుండా ఉంటే ఒక గూడ్సు రైలును లాగగలిగే ఇంజనుకు కావలసిన వేడిని, అగ్నిని పరమాత్మ మనిషి పొట్టలో నింపాడు. దానిని మనుషులు గుర్తించలేదు.

1998వ సంవత్సరంలో జపాన్‌కు చెందిన ఫ్యూజీ టెలివిజన్ కంపెనీ డైరెక్టర్స్ భారత్ వచ్చారు. భారతదేశంలో ఒకవ్యక్తి అద్దం పెంకులు, ఇనుపముక్కలు, రాగి పిన్నులు, కంకర, రాళ్ళు ఏదికావాలంటే అది తినగలడనీ, శారీరక క్రియాకలాపాలలో ఏ మాత్రం తేడా చూపడనీ వారికి తెలిసింది. వారు అతనిని ఢిల్లీకి పిలిపించారు. ఇతర అతిథులందరికీ రుచికరమైన పదార్థాలను పెట్టి, ఇతనికి మేకులు, పిన్నులు, పగిలిపోయిన ప్లాస్టిక్ ముక్కలు ఆహారంగా ఇవ్వడం జరిగింది. అతడు వాటినే ఎంతో ప్రేమతో తిన్నాడు. జపనీయులు దిగ్భ్రమ చెందారు. ఈతనిని మూడున్నర నెలలపాటు తమవెంట జపాన్ తీసుకెళ్ళారు. అనేక రకాల ప్రయోగాలు చేశారు. కాని మోటార్లను, ట్రాలీలను కూడా తినగలిగే ఆ మనిషి రాక్షస పొట్టలోని రహస్యం ఏమిటో కనుక్కోలేకపోయారు.

సాధారణంగా అయితే మనిషిపొట్ట పళ్ళు, అన్నం, రసాలను జీర్ణం చేయగలిగే అగ్ని కలిగినదిగా అందరికీ తెలుసు. ఇనుము, సీసాల జీర్ణం విషయం వచ్చినపుడు అందుకోసం అణు బట్టీ ఒకటి అవసరమవుతుంది. ఎవరైనా బాహ్య రసాయనాలు, ఇనుము, రాళ్ళు లాంటి గట్టి పదార్థాలను లేదా సైనైడ్ లాంటి మారణ విషాన్ని తిని హరాయించుకోగలిగే అతని పొట్టలో ఏదో అగ్ని గుండం ఉండి ఉండాలి. జఠరాగ్నిని ప్రదీపనం చేసే ప్రాణాయామం, యోగాసనాల మహత్యాన్ని అర్థం చేసుకుంటే శరీరం, శరీర లక్ష్యం యొక్క యదార్థ జ్ఞానాన్ని పొంది, మానవ జీవన ఉద్దేశ్యం కూడ సార్థకం చేసుకోవచ్చుననే విశ్వాసాన్ని పొందవచ్చు.

డా॥ అలఖ్ మోహన్ మాథుర్ అనే పేరు గల ఈ భారతీయుని ఆశ్చర్యకరమైన జన్మ అలీగఢ్‌లో సంభవించింది. వారు ప్రసవ సమయానికి ముందే కవలపిల్లలుగా జన్మించారు. జన్మతోనే

**చేసుకున్న వారికి చేసుకున్నంత - మహదేవ.**

ఆశ్చర్యానికి గురిచేసిన శ్రీ మాథుర్ ఆశ్చర్యాలకు ప్రతీక. ఒకరోజు చండీగఢ్‌లో డాక్టరుగా పనిచేస్తున్నప్పుడు ఒక బాలిక ఒక సూదిని మింగినట్లు విన్నాడు. సూది మింగడంతోనే ఆ బాలిక స్థితి మరణాసన్న స్థితికి చేరుకుంది. డాక్టర్లు ఏదోవిధంగా ఆపరేషన్ చేసి ఆ బాలిక ప్రాణాలు కాపాడారు. ఈ సంఘటన డాక్టర్ మాథుర్‌ని బాగా కలచివేసింది. నిజంగా ఒక చిన్న గుండుసూదితో ప్రాణాలు కోల్పోయేంత నికృష్టమైన నిర్మాణమా మానవుని శరీరం? అని ఆలోచించాడు. కుతూహలంతో అదే రోజు సాయంత్రం ఒక చిన్న బ్లేడు ముక్కను తిని చూశాడు. ఉదయాన్నే మల విసర్జనలో ఆ బ్లేడు ముక్క బయటకు వచ్చింది. దానితో పాటు రక్తం కూడా పడింది. బ్లేడు ముక్క గీసుకోవడం వలన అలా జరిగింది. రెండవ రోజు మరల బ్లేడు తిన్నాడు. అది బయటకు వస్తుందని కొద్ది రోజులు వేచి చూశాడు. కాని బ్లేడు రాలేదు రక్తమూ పడలేదు. ఆందోళన ఎక్కువైంది. ఎక్స్‌రే తీసి చూస్తే ఆ బ్లేడు ముక్క ఆచూకీ కనబడలేదు.

మరల ఒక్కొక్కటిగా మొదలు పెట్టి గుండు సూదులు, ఇనుప ముక్కలు, సీసా పెంకులు, పాదరసం, ప్లాస్టిక్, రాగి ఏదిపడితే అది నమలడం, జీర్ణం చేసుకోవడం ప్రారంభించాడు. ఇందులో మహత్తు ఏమీలేదు. ఇది శరీరం అనే అద్భుత యంత్రానికి సంబంధించిన ఒక నగ్న సత్యం. అందువలన దాని మీద పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఢిల్లీకి చెందిన గోవింద్ వల్లభ్ పంత్ హాస్పటల్‌లో, ముంబాయి, కలకత్తా, లక్నో, చండీఘర్, గజియాబాద్‌లలో పరీక్షలు జరిపిన డాక్టర్లు ఈ విధంగా అభక్ష్యపదార్థాలను కూడ జీర్ణం చేసే తత్వాన్ని కనుక్కోలేక పోయారు.

జపాన్ డాక్టర్లు అతనిని కొద్ది రోజుల వరకు ఏకాంతంలో ఉంచారు. తిన్న వెంటనే తరువాత అనేక సార్లు ఎక్స్‌రే మరియు ఇతర ప్రయోగాలు కూడా చేశారు. కాని ఆ విజ్ఞానం ఏమిటో కనుక్కోలేక పోయారు. డాక్టరు మాథుర్‌కి 'విశ్వంలో అద్భుతమైన భారతీయుడు' (వరల్డ్ సప్రయిజ్ మాన్ ఆఫ్ ఇండియా) అని సర్టిఫికేట్ ఇచ్చారు.

★★★

## కదిలించే కళ్లు

13.సీ॥ యుక్తమౌ వయసులో యోగ్యమౌ కన్యతో
పరిణయంబు జరుగ పరవశించె
అనువైన భార్యతో ఆనందమొందుచున్
గాయత్రి మరువకగడుపుచుండె
మంత్ర దీక్ష నిడుచు మాలవ్యపలికిన
మాటల మర్మంబు మదిని నిలిపె
ఐదుమాలల కెప్డునంత రాయము లేక
తగురీతి జపియించి ధన్యుడాయె

తే॥ నిష్ఠతోడను జపియించి నిశ్చలముగ
వేచి చూసిన వివరంబు వెలితి లేక
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

14.సీ॥ పదునాల్గు వత్సరాల్ పదిలంగ నిండగా
వాసంతపంచమీ పర్వమందు
బ్రహ్మమూర్తమునందు భ్రమలుకలుగురీతి
జ్యోతి పుంజమొకటి చుట్టుకొనియె
కనులు నులుముకొంచు కాంక్షతో చూడగా
అక్షిముందునిలిచె సూక్ష్మరూపు
గాలిలో వింతగా తేలియాడుచునున్న
యోగివరుడొసంగె యోగనిద్ర

తే॥ యోగ నిద్రకులోనౌచు యోగివలెను
వింత అనుభూతి పొందిన వితమునంత
మానవాళికి దెలుపుట మరువకనుచు
కవిని కదిలించె గురుదేవు కంటిచూపు

రచన–మధుర కవయిత్రి
పొన్నూరు హైమవతీ శాస్త్రి

**ఫలితానికి ఆత్మ విశ్వాసమే పునాది.**

సంస్కృతీమూర్తి - పరమపూజ్య గురు దేవులు

# దేవ సంస్కృతి గురించి సంస్కృతీ మూర్తి అమృత పలుకులు

సంస్కృతీ సభ్యతలమీద ఏలాటి దెబ్బతగిలినా ప్రజలు ధైర్య సాహసాలతో ఎదుర్కొన్నారు. సంస్కృతిని రక్షించుకున్నారు. ఇది దేవ సంస్కృతీ లక్షణం. ఏ కాలంలోనైనా సంస్కృతి బలిదానాలవల్ల, త్యాగాలవల్లనే రక్షింపబడుతుంది. లంకలో రాక్షసరాజ్యం ప్రపంచాన్నే త్రాహిత్రాహి అనిపించింది. స్వార్థ పరుడైన మానవుడు తానేదో లాభం పొందుతున్నాను అనుకుంటాడు. కాని అతను పొందేది లాభంకాదు, నష్టమే. రాక్షస సంస్కృతికి పునాది స్వార్థమే. స్వార్థం పెరిగిన కొద్దీ కళ్ళు పొరలు గమ్ముతాయి. అంధత్వ పొరలు గమ్ముతాయి. అంధత్వం పెరిగినకొలదీ హద్దులను చూడలేకపోతాడు. హద్దులను మీరిన వ్యక్తిని పిశాచ స్వభావం ఆవరిస్తుంది.

రాక్షస సభ్యతకు నిలయమైన లంకలో అందరూ అనాచారులే. దేవసంస్కృతీ సభ్యులు ఆలోచనలో పడ్డారు. "ఈ అనాచారాన్ని ఏవిధంగా నిలుపు చేయాలి? ప్రపంచ ప్రజల మానాభిమానాలను ఏవిధంగా రక్షించాలి? "భగవానుడు అధర్మాన్ని శిక్షించి, ధర్మాన్ని రక్షిస్తానని మాట ఇచ్చాడు. రావణుని చంపితే ఇంకో రావణుడు జన్మిస్తాడు. వ్యక్తిని చంపితే లాభం లేదు. ఆసురీ సంస్కృతినే అంతం చెయ్యాలి. పరశురాముడు గతంలో 21 సార్లు ఆసురీ శక్తుల మీద దండయాత్రలు చేశాడు. అడ్డం వచ్చిన వారినందరినీ నరుకుతూ వచ్చాడు. నరికి నరికి అలసిపోయాడు. ఫలితం రాలేదు. చిట్టచివరకు గొడ్డలిని నదిలోకి విసిరేశాడు. పలుగు-పారా చేపట్టాడు. బీడు భూములను సరిచేసి, మొక్కలు నాటుతూ పచ్చదనాన్ని పెంపొందించాడు. ఆ పచ్చదనం ఎందరినో ఆహ్లాద పరిచింది. ఆహ్వానించింది. ఆదరించింది. అయోధ్యలో దేవ సంస్కృతి ఉదయించింది. దేవ సంస్కృతిని పెంచడానికి ఉపన్యాసాలు, ఉపదేశాలు సరిపోవు. వాటివలన మనస్సులలో కర్తవ్య బీజాలను నాటవచ్చు. కాని ఆవేశం, ఉత్సాహం ఉబికిరావు. కలముతో సాధించవచ్చు అంటారు కొందరు. కలం ద్వారానే మనస్సులు మారిపోతే ఈనాడు ప్రపంచంలో లక్షల సంఖ్యలో వార్తా పత్రికలు అచ్చు అవుతూ ఉన్నాయి. వాటి ప్రయోజనం కూడా కొంతవరకే. అన్నింటికీ మించి ఆచరణ ముఖ్యం. అందుకే విశ్వామిత్రుడు అయోధ్యకు వచ్చాడు. ఓర్పుగా మాట్లాడి, నేర్పుగా దశరథుని ఒప్పించాడు. రామలక్ష్మణులను వెంట బెట్టుకుని అడవులకు వెళ్ళాడు.

దైవీ సభ్యత వ్యావహారిక జీవనంతోటే ఆరంభం అవుతుంది. శ్రేష్ఠమైన పరంపరను ఋజువు చెయ్యాలంటే వ్యక్తిగత జీవితాన్ని ఆదర్శంగా మలిచి చూపించాలి. కథలూ, సత్సంగాలూ, ఉపన్యాసాలూ మొదలైనవన్నీ దారిని మాత్రమే చూపిస్తాయి. రైలుబండికి పట్టాలవలె పని చేస్తాయి. ఆ పట్టాల మీద నడిచి చూపాల్సింది వ్యక్తిగత జీవనం మాత్రమే.

రామరాజ్యానికి బీజాలు దశరథుని కుటుంబంలో నాటబడ్డాయి. ఆ కుటుంబంలో అందరూ త్యాగమూర్తులే. రాముడు సింహాసనం వదిలి వనాలకు వెళ్ళాడు. రాజభోగాలన్నీ త్యజించాడు. ఆయనకు తోడుగా సీతాదేవి, లక్ష్మణుడు కూడా వెళ్ళారు. అన్నదమ్ములను వధించి, తండ్రిని జైలులో పెట్టి, సింహాసనం ఎక్కే సంస్కృతి రాముని సోదరులకు లేదు. అన్నగారిని ఆరాధిస్తూ భరతుడు పాదుకలను సింహాసనంపై పెట్టి రాజ్యం చేశాడు. నిద్రాహారాలు మాని అన్నావదినెలను సేవించాడు. శత్రుఘ్నుడు రాజ్యపాలనలో భరతునికి చేదోడు వాదోడుగా ఉన్నాడు. దేవ సంస్కృతికి మూలాలు ఇవే.

★★★

**క్షమాగుణం, దయాగుణం వ్యక్తిత్వంలో భాగం కావాలి.**

ధారావాహిక: హనుమత్ కథామృతం-19

# అనుకోని సంఘటనలు ఆరంభమయ్యాయి

"ఓం ఘృణిః సూర్యాయ నమః" అన్నమంత్రం బాల హనుమాన్‌ను ఒక విచిత్రఅనుభూతిలో చుట్టివేసింది. ఆ మంత్రాన్ని వింటున్న కొద్దీ అతనిలో అనేక సాధనా మార్గాలు గోచరిస్తూనే ఉన్నాయి. రాత్రివేళ, నిద్రాసమయంలో కూడా అపూర్వ సూర్యోదయం అవుతూనే ఉంది. ఆ మంత్రంలోని ప్రతీ అక్షరంలోనూ సూర్య సాధనకు సంబంధించిన అనేక రహస్యాలు దాగి ఉన్నట్లుగా అనుభూతి పొందుతున్నాడు. ఇంత సులభంగా కనిపిస్తున్న మంత్రం యొక్క సాధనావిధానం దుర్లభమైందని ఆతని అంతరాత్మలో లీలగా అనిపిస్తూ ఉంది. ఏదైనాకాని మంత్రసాధన అనేది నిగూఢమై ఉంటుందని హనుమాన్‌కు తెలుసు. పసితనం నుండి ఋషులు, మునుల సాన్నిధ్యంలో మెసలిన హనుమాన్ ఈ గూఢత అంతా సాధన విధానంలోనే ఇమిడి ఉంటుందని అర్థం చేసుకున్నాడు.

ఒకరోజు రాత్రి నిద్రనుండి విచితంగ్రా మేల్కొన్నాడు. సూర్య సాధనా విధానం ఒకానొక నూతన పద్ధతిలో స్ఫురించింది. ఆ రాత్రి స్వప్నంలో సూర్య సాధనామృతాన్ని కొద్దిగా రుచి చూచాడు. ఇక పాత్రచేతబట్టి పానంచేయాల్సిఉంది. తన ప్రకాశంతో అంధకారాన్ని తొలగిస్తూ సూర్యభగవానుడు స్నేహహస్తాన్ని చాచాడు. సొంత బంధువులాగా ఒకానొక ఆధ్యాత్మిక అనుభవాన్ని అందించాడు. స్వప్నావస్థలో అనుభవమైన ఈ ఆలోచనలు రింగులురింగులుగా పెనవేసుకుని ఒక హారంగా తయారయ్యాయి. మేల్కొన్నవెంటనే అంతరంగంలో పొంగిపొర్లుతున్న శ్రీరామనామామృతంలో సూర్యసాధన కలిసిపోయినట్లుగా అనిపించింది.

ఉపోషదయం అయింది. ఏదో తెలియని ఆనందంతో హనుమాన్ ఒంటరిగా ఉద్యానవనానికి చేరుకున్నాడు. అప్పుడే బాలభానుడు ఉదయిస్తున్నాడు. ఆతని బంగారువన్నె కిరణ ప్రకాశంలో ఉద్యానవనం వింతగా మెరిసిపోతోంది. పువ్వులతో నిండి ఉన్న వృక్షాలు, వృక్షాలను పెనవేసికొని ఉన్న లతలు–తీగలు, లతలలో అప్పుడే విచ్చుకుంటూ ఉన్న మొగ్గలు, పూర్తిగా విచ్చుకున్న పుష్పాలు ఆహా! ప్రకృతి సౌందర్యం వర్ణనాతీతం. ఉద్యానవనమంతా ఒక విచిత్రమైన దుప్పటి కప్పుకున్న కన్నెపిల్లలా మురిసిపోతోంది. చూడగాచూడగా బాలహనుమాన్‌కు ఈ తోటకు ప్రాణశక్తిని ప్రసాదించిన బాలసూర్యుడు ఎదురుగా కనిపించాడు. లోకాలకే ప్రాణదాత అయిన సూర్య భగవానునికి చేతులెత్తి నమస్కరించాడు.

హనుమాన్‌కు తాను చేతులు జోడించి ఎంతసేపు నిలబడ్డాడో తెలియడంలేదు. తనకు తెలియకుండానే లోలోపలనుండే సూర్యదేవుని ఆహ్వానిస్తున్నాడు. "ఓం ఘృణిః సూర్యాయనమః" మంత్రం యొక్క మధురమైన ధ్వని రకరకాల పద్ధతుల్లో వెలువడి ఒక రూపానికి వచ్చేసింది. ఆ పవిత్రధ్వని హనుమాన్‌ను ఎక్కువసేపు నిలబడనీయలేదు. ఒక్కసారిగా కూర్చుండిపోయాడు. అలాగే కూర్చుని రాత్రి స్వప్నంలోపొందిన అనుభూతులను నెమరుకు తెచ్చుకుంటున్నాడు. తరచి చూచిన కొద్దీ అంతరంగంలో విలీనమైపోయిన సూర్య భగవానుడు కనిపించసాగాడు. ఆయన రూపం చూచిన కొద్దీ ఆకర్షణీయంగా తయారవుతోంది. తన యొక్క మానసిక చైతన్యం పూర్తిగా సూర్యదేవునికి అర్పితమైపోయిన భావన కలిగింది. ఇది ఒక విచిత్రమైన మార్పు. ఆలోచించగాఆలోచించగా హనుమాన్ ఆలోచనలు బాహ్య జగత్తు నుండి ఎక్కడికో వెళ్లిపోయాయి.

ధ్యాన నిమగ్నుడైన హనుమాన్ ప్రేమపూరితమైన స్పర్శతో ఉలిక్కిపడి కన్నులు తెరిచాడు. తల్లి అంజనీదేవి తన భుజంపై చెయ్యివేసి నిలబడి ఉంది. ఆమెకన్నుల్లో మమకారం, పెదవులపై చిరునవ్వు దాచాలన్నా దాగడంలేదు. హనుమాన్ కూడ మూగవానివలె తల్లివంక చూస్తూ ఉండిపోయాడు. ఒక్కమాట కూడా మాట్లాడలేదు. చివాలున లేచి తల్లికాళ్ళను చుట్టుకుపోయాడు. తల్లీ కొడుకులు ఇద్దరు ఇంతవరకు ఒకరితో ఒకరు నోరువిప్పి మాట్లాడుకోలేదు. కాని కళ్ళతోటే ఎన్నెన్నో

**పృథ్విని పూజించడం అంటే పృథ్వి లక్షణాలైన దయ, సహనం తెచ్చుకోవడమే.**

విషయాలు ముచ్చటించుకున్నారు. కొడుకు చెయ్యిపట్టుకుని అంజనాదేవి భవనంవైపు సాగిపోయింది. కొడుకు కూడా మౌనంగా తల్లిని అనుసరించాడు. ఆమె ఎంతో ప్రేమతో కుమారునికి కాళ్లు చేతులు ముఖం కడిగింది. అల్పాహార పళ్ళాన్ని చేతికి అందించింది.

అంజనాదేవి ఫలములతోపాటు కొంత సాత్విక ఆహారాన్ని తినిపించింది. అల్పాహారం ముగించిన హనుమాన్ తల్లిపైటకొంగుతో మూతిని తుడుచుకున్నాడు. చిరునవ్వుతో తల్లివంకచూచాడు. మెల్లగా కుమారుని దగ్గరకుతీసుకుంది అంజని. "నాయనా! ఈ రోజు నీ ముఖం ఆనందంతో వెలిగిపోతోంది. కారణం ఏమిటి?" అంటూ ప్రశ్నించింది. రాత్రి తనకు కలిగిన అనుభూతులన్నీ పూసగుచ్చినట్లు తల్లికి వివరించాడు. తల్లి ఆనందానికి మేరలేదు. "తండ్రీ! నీవు పరమపావనుడైన సూర్యదేవునే పొందినట్లు అనుభూతి చెందావు. అతనిని సంతృప్తిపరచగలిగిన మంత్రం అమోఘమైంది. ఈ మంత్ర సాధనతోపాటు కొన్ని రహస్యపూర్ణమైన యోగసాధనలు కూడా నిండి ఉంటాయి. మంత్ర జపాన్ని దీక్షగా చేస్తూపోతే యోగ సాధనలు వాటంతట అవే వచ్చిచేరుతాయి. నీవు నీ సాధన ప్రారంభించు" అని దీవించింది.

హనుమాన్ మొదటి నుండి తల్లి గీచిన గీత దాటడు. అన్ని విషయాలలో ఆమె మాటే వేద వాక్కు. తన తల్లి ఏది చెప్పినా తన మేలుకొరకే అని నమ్మేవాడు. అందువల్ల సూర్యసాధన చేయాలని గట్టిగా నిర్ణయించుకున్నాడు. మధ్యాహ్న సమయంలో తన గదిలో కూర్చుని సూర్యమంత్రాన్ని, దానికి సంబంధించిన యోగసాధనను గుర్తు చేసుకున్నాడు. "ఓం ఘృణిః సూర్యాయ నమః" అన్న మంత్రంలోని రహస్యమైన విషయాలను మనో నేత్రంతో చదువగలిగాడు.

సాయంకాలం అయింది. రాత్రి ప్రవేశించింది. తెల్లవారింది. సూర్య భగవానుడు ప్రకృతిని చైతన్య పరుస్తూనే ఉన్నాడు. హనుమాన్ నిద్రలేస్తూనే కాలకృత్యాలు ముగించుకున్నాడు. సూర్య సాధనలో నిమగ్నమయ్యాడు. మంత్రధ్వని యోగవిధిలో కలిసిపోయింది. హనుమాన్ శరీరంలో ఏదో నూతన విద్యుత్ ప్రవహించసాగింది. అంతరంగంలో ఆ అనుభవాన్నుండి బైట పడలేకపోతున్నాడు. సూర్యదేవుని సంపర్కం ఆతనిని బంధించి వేసింది. ఏం చేయాలో తోచని సందిగ్ధస్థితిలో ఉన్నాడు. తాను స్వయంగా పరమేశ్వరునిఅవతారం. ఏకాదశరుద్రులు తనలో విలీనమై ఉన్నారు. పవనదేవుని ఆశీస్సువలన తన శరీరంలో, ప్రాణశక్తిలో పరివర్తన వచ్చింది. కాని తన ఆలోచన ఇప్పుడు శరీరంపైన, ప్రాణాలపైనలేదు. బాహ్య జగత్తులో విహరిస్తున్నాడు. సూర్యదేవుని సాన్నిధ్యంలో మనస్సు తేలియాడుతోంది. మనోవీధిలో అనుకోని సంఘటనలు ఆరంభం అయ్యాయి.

★★★

## శ్రీ గాయత్రీ శతకం

14. లక్షణంబుగ నోరార లక్షమార్లు
అనగ నిరువది నాలుగు అక్షరములు
తక్షణంబున కరుణించి రక్షజేయు
విశ్వ జనయిత్రి గాయత్రివేదమాత

**భావం:** వేదమాత అయిన గాయత్రి విశ్వానికే జనయిత్రి. ఒక నియమం ప్రకారం లక్షమార్లు గాయత్రీ మంత్రంలోని 24 అక్షరాలను జపిస్తే, ఆ తల్లి కరుణించి మరునిమిషంలోనే నిన్ను రక్షిస్తుంది.

15. నిత్యమొకపరి మంత్రమున్ నీవు పలుక
తల్లి ముదమంది కరుణతో తాను పూని
నాటిపాపమ్ముతొలగించి నగవునిచ్చు
విశ్వ జనయిత్రి గాయత్రి వేదమాత

**భావం:** వేదమాత అయిన గాయత్రి విశ్వానికే జనయిత్రి. ఏదేని ఒకరోజు తెలిసో, తెలియకో ఏదైనా పాపం చేశానని నీకు అనిపిస్తే ఆ రోజు ఒక్కసారి గాయత్రీ మంత్రం జపించు. ఆ తల్లి సంతసించి తానే స్వయంగా పాపాన్ని తొలగిస్తుంది.

రచన
సహజ కవి, సాహిత్య రత్న,
శతక చతురానన, పద్య కవితాసుధానిధి
శ్రీ అయినాల మల్లేశ్వర రావు

**ఇతరుల మీద నేరాన్ని ఆరోపించవద్దు.**

తత్వ చింతన

# నిజమైన విరాగి, యోగి ఎవరు?

సాధు, సంత్‌లు ఒక చోట కలుసుకునే రోజున త్యాగ, వైరాగ్యాలను గురించి, జ్ఞానాన్ని గురించి చర్చ జరుగుతూ ఉంటుంది. నిజానికి వైరాగ్యమంటే ఏమిటి? భార్యా పిల్లలను వదిలివేసి వన, ఉద్యానవనాలలోనో, గుహలలోనో ఉండడమేనా? కాకపోతే ఏమిటి?

వీతరాగులైన పురుషులను గురించి తెలుపుతూ విద్వాంసులు– "సంసారాన్ని వదిలివేయడం మాత్రమే వైరాగ్యం కాదని, అది పారిపోవడమే అవుతుందని" పేర్కొన్నారు. అటువంటివారు హృదయగతంగా సత్పురుషులు కారు. తమ స్వార్థాలను సాధించుకునేవారనబడతారు. ఎవరిలో నిజంగా విరక్తిపుడుతుందో అటువంటివారు ఎక్కడికీ పోవలసిన అవసరమే ఏర్పడదు. అటువంటివారు బురదలోని కమలము వంటివారు. సంసారము యొక్క మాయ అట్టివారిని తాకనైనా తాకలేదు. అందుకే యోగులు, యతులు సంసారాన్ని వదిలివేయాలన్న మాటకు అర్థం బాహ్యంగా వదిలివేయడమని కాదు, అంతరంగంలో సంసారవ్యామోహం వదలాలని. వ్యక్తి సంసార వ్యామోహాన్ని లోపల దాచుకుని బాహ్య జగత్తులో ఇటు అటు పరిగెత్తుతూ, నిర్జన ప్రదేశాలలో ఎంతగా నివసించినా ప్రయోజనం ఉండదు. కారణం అతను సంసారాన్ని తనలోపల దాచుకుని తిరుగుతున్నవాడే ఔతాడు.

సంసారాన్ని గురించి వివరిస్తూ విద్వాంసులు సంసారమన్నది రెండు విధాలుగా ఉంటుందని తెలిపారు. వాటిలో ఒకటి జడ ప్రకృతి, ఇందులో మనమంతా ఉంటాము. ఇది పంచతత్వాలతో, భూమి, నీరు, వెలుతురు, గాలి, ఆకాశములతో నిర్మింపబడి ఉంటుంది.

వ్యక్తిగత జగత్తును గురించి చెప్పుకునేప్పుడు అది అతని దృష్టి మీద ఆధారపడినదని అర్థం చేసుకోవాలి. ఆ దృష్టి త్యాగులకు, విరాగులకు చెందినదైతే ఆ జగత్తు కూడా త్యాగ, వైరాగ్యాలతో నిండి ఉంటుంది. దాని ఆలోచనలు, ఆచరణలు అట్లాగే ఉంటాయి. అదే అజ్ఞాని, భౌతికవాదికి చెందినదైతే బాహ్య ఆకర్షణలకులోనయి జీవితము వాటిలో చిక్కుకుపోతుంది. జ్ఞాని అయినవానికి, సామాన్యవ్యక్తికి మధ్యగల భేదమిదే, జ్ఞాని అయినవాడు ఇహములోనే రాళ్లలో దాగియున్న పరమాత్మను దర్శించగలుగుతాడు, భౌతికదృష్టిగలవాడు దేవాలయాలను, మసీదులను, గురుద్వారాలను మాత్రమే చూస్తాడు. అంతా చూచే పద్ధతి మీద ఆధారపడి ఉంటుంది. మనస్సులోపల ఉన్నదే బైట కనబడుతుంది. వ్యక్తి వాస్తవాన్ని యధాతథంగా చూడలేడు. ఇందుకు ఈ క్రింది ఉదాహరణను చూద్దాం.

బైట నవ్వులతో నిండిన సంతోషపూరిత వాతావరణం నెలకొని ఉండి, అంతా ఆనందంతో హాయిగా తిరుగుతున్నారు. కానీ వారిని గమనిస్తున్న ఒక వ్యక్తి మనస్సు నిండా దుఃఖం, బాధా నిండి ఉండడం వల్ల అతనికి ఆ వాతావరణం ఆనందకరంగా కనిపించదు. ఆనందోల్లాసాలతో నిండిన మనస్సు కలవారికి ఎంతటి దుఃఖపూరితవాతావరణమైనా వారి ఆనందానికి దెబ్బ తగిలించదు, తగ్గించదు. దీనిని బట్టి బయటి ప్రపంచం మనలోపలి జగత్తుకు విస్తార రూపం అని తేలుతోంది. మనం ఎటువంటి వారమో నాలుగు దిక్కులలోగల జగత్తు అదేవిధంగా ఉంటుంది. అపరిమితమైన ఆకలితో బజారులో తిరుగుతూ ఉన్నవానికి బజారులోని బట్టల దుకాణాలు, బొమ్మల షాపులు, యంత్ర పరికరాల దుకాణాలు మొదలైనవేవీ కనబడవు. ఆ బజారు మొత్తంలో అతనికి కనబడేవి ఫలహారశాలలు, మిఠాయి దుకాణాలు, భోజనాలయాలు, పానశాలలు మాత్రమే. అతనికి నాలుగు దిక్కులనుంచి భోజన పదార్థాల వాసనే వస్తూ ఉంటుంది. అదేవ్యక్తి కడుపునిండా భోజనం చేసి బజారుకు వస్తే ఆ బజారు స్వరూపమే మారిపోతుంది.

గొప్ప ఆలోచనాపరుడు, దార్శనికుడు అయిన రోమారోలాగారు "మానవ ప్రవృత్తులు బాహ్య వాతావరణం చేత నియంత్రింపబడడం సహజమే. కానీ బాహ్య వాతావరణాన్ని ఒక విధమైన అంకుశమని పిలువవలసి వస్తుంది. అది మార్పు కాదు. ఇందుకు మూల కారణం మనస్సు. ఆ మనస్సు చేసే నీచమైన

మన పరిస్థితికి మనమే కారణం.

కార్యకలాపాలను బయటి ఒత్తిడులతో సరిచేయడం కుదరదు. కేవలం ఆపుట మాత్రమే సంభవం. మనోచైతన్యాన్ని పరిష్కరించడానికి ఆంతరికమైన అభిలాష, సంకల్ప బలాలు కావాలి. వాటి ద్వారా ఈ పరిమార్జన ప్రక్రియ మొదలవుతుంది. అది పూర్తి కాగానే ఆ వ్యక్తి ఆత్మసత్తాకు, పరమాత్మకు చిహ్నంగా మారిపోతాడనడంలో సందేహం లేదు. దీనివలన మనిషి. భగవంతునితో సమానుడైపోతాడు. దీనికి ముందు అతను మామూలు మనిషి. అతను తాను తయారు చేసుకున్న జగత్తులోనే జీవిస్తాడు, అడ్డదిడ్డపు పనులేవో చేస్తూ ఉంటాడు. అందుకే జగత్తన్నది ఒకటి కాదని, ఎన్ని మనస్సులున్నాయో అన్ని జగత్తులున్నాయని అనడం జరుగుతోంది. ప్రతి వ్యక్తి తన జగత్తును తానే తయారు చేసుకునేంతవరకూ వ్యక్తి నిజమైన అర్థంలో సన్యాసి కాలేడు, త్యాగి కాజాలడు. వదిలివేయడం, త్యాగం చేయడం జరిగినప్పుడు వ్యక్తి బైటి సంసారాన్ని వదులుతాడు. కానీ తనలోపల గల సంసారాన్ని గట్టిగా పట్టుకునే ఉంటాడు. దీనివలన కలిగేమార్పు ఎలా ఉంటుంది? పైపై వేషధారి ఐన సన్యాసి భౌతిక సుఖాలు లేకుండా జీవిస్తున్నా రాత్రింబగళ్ళు వాటిని గురించే ఆలోచిస్తూ ఉంటాడు. అందువలన అతడు హిమాలయ పర్వత గుహలలో కూర్చున్నా తాను తానుగానే ఉంటాడు. అతనిలో వీసమంత తేడా కూడా ఏర్పడదు. వ్యక్తిలోపల మార్పు రాకపోతే గుహలేమి చేస్తాయి? నిర్జన, ఏకాంత స్థలాలు ఏం చేయగలుగుతాయి? అన్ని నిష్ప్రయోజననాలు, నిరర్థకాలు అయిపోతాయి.

ఇంద్రుడు ఋషి, మునుల తపస్సులకు భంగం కలిగించడానికి అప్సరసలను పంపించేవాడని చెప్పే అనేక పౌరాణిక గాథలున్నాయి. విశ్వామిత్రుని ముందు మేనక వచ్చి నిలబడింది. ఈ గాథలను గురించి లోతుగా ఆలోచిస్తే అవి బయటికి సంబంధించిన క్రీడలు కావని, అంతరంగమునకు చెందిన పరిస్థితి అని ఆగాథల అసలైన ఆంతర్యం అర్థమౌతుంది. ఇంద్రుని వంటి దేవతకు, అప్సరసలకు, ఋష్యాదులను పతనస్థితికి తీసుకురావడానికి కావలసిన సమయం, విశ్రాంతి ఎక్కడుంటాయి? శ్రేష్ఠతత్వాలు ఎప్పుడూ ముందుకు సాగడానికి, ఉన్నతిని సాధించడానికి సహాయమే చేస్తాయి. అవి ఎవరినైనా పతనావస్థకు ఎందుకు తెస్తాయి? తపస్సులో మునిగిన ఋషి, మహర్షుల ముందుకు మేనక, రంభ, ఊర్వశి వంటి స్వర్గ సుందరీమణులు రావడమంటే అదివారి మనస్సులను శుద్ధి చేయడానికే అని గ్రహించాలి. వారిలో అప్పటివరకు దాగియున్న వాసనలు, కోరికలు ఏకాంతంలో ఉప్పొంగుకు వస్తాయి. అవి ఒక రూపాన్ని ధరిస్తాయి. కొందరికవి స్త్రీమూర్తుల రూపంలో దర్శనమిస్తాయి. అవి బయటి స్త్రీల మూర్తులు కావు. లోపల ఏర్పడిన ఊహా చిత్రాలు. ఇందువల్ల సన్యాస, వైరాగ్యాలను గురించి ఆలోచించడానికి ముందు మనిషిలోని మనస్సు ద్వారా నిర్మింపబడిన జగత్తు వేరే కలదని గ్రహించాలి. దానిని పూర్తిగా వదిలితేగానీ నిజమైన అనాసక్తి లేక వైరాగ్యం కలుగదు. అందుకే కబీర్ వంటి సంత్‌లు "జగ్ సూం ప్రతిన కీజియే" అని సెలవిచ్చారు. అంటే భ్రమలో పడవద్దని. నిజానికి అది బాహ్యానికి చెందినది కాదు. లోపల ఏర్పరచుకున్న జగత్తుకు సంబంధించిన మాట. ఆలోపల గల జగత్తు మన మనస్సులోని భాగం. వదలవలసింది ఆ మనస్సునే. ఐతే ఆపని అంత తేలిక కాదు. తేలికే ఐతే ఎంతో మంది బుద్ధులు, వివేకానందులు పుట్టి ఉండేవారు. కానీ అటువంటి త్యాగులు, తపస్వులు ప్రపంచం మొత్తంలో నూటికి కోటికి ఒక్కరు మాత్రమే పుడతారు. కారణమేమంటే అది సాహసానికి చెందిన పని. అందుకు విప్లవం అవసరమౌతుంది. కుళ్లిపోయిన మనస్సును అవతల పారేసి కొత్తమనస్సును పుట్టించడమన్నది గొప్ప విప్లవంతో కూడిన కార్యమేఔతుంది. దాని ఫలితంగా విరాట్ మనస్సు ఉత్పన్నమౌతుంది. అది అన్ని మనస్సులను తనలో లీనం చేసుకుంటుంది. అందరినీ తనలో కలుపుకుంటుంది. సర్వత్రా వ్యాపించినదిగా మారుతుంది. సాధారణంగా రెండు మనస్సులు కలవడానికి ప్రయత్నించినప్పుడు, ఒకదానికొకటి దగ్గరైనప్పుడు రెండు జగత్తులు ఒకదానికొకటి ఢీకొట్టుకుంటాయి కానీపైన తెలిపిన పద్ధతిలో అవి కలిస్తే ఏవిధమైన బాధ, శ్రమ కలుగవు. ఆవిధంగా కాకుంటే రెండు మనస్సులు స్నేహితులుగా దగ్గరయినాయని అనిపించినా అది నిజమైన స్నేహం కాదు. దానికి స్వార్థం కారణం. అది తీరగానే వైమనస్యం, విభేదాలు ప్రారంభం అవుతాయి. బయటి ప్రపంచం మన మనస్సు యొక్క పరిణామం అనే సత్యం అర్థమైతే ఆ ప్రపంచాన్ని మనకు అనుకూలంగా నిర్మించుకోగలుగుతాం. అప్పుడు దాని నుంచి పారిపోవలసిన అవసరమే కలుగదు. ఆ స్థితిలో మన అంతః

**ప్రగతి అయినా, పతనం అయినా మన చేతిలోనే ఉంటుంది.**

కరణ పదే పదే తనలోపల నిర్మింపబడిన స్వప్న సౌధాన్ని నేలమట్టం చేయాలనీ, స్వప్నసౌధ నిర్మాణానికి కారణమైన దానికి కాయకల్ప చికిత్స జరగాలనీ ప్రబోధిస్తుంది. ఎప్పుడు ఈ ప్రబోధం వల్ల మనస్సుమేలుకుంటుందో ఆ క్షణం నుంచి వ్యక్తి లోపల సన్యాసి జన్మిస్తాడు. అప్పుడు మనం ఎక్కడున్నాగాని, జన సమూహంలో ఉన్నామా? లేక నిర్జన ప్రదేశంలో ఉన్నామా? భవనములో ఉన్నామా? లేక కుటీరంలోనా? అన్న ప్రశ్నలే ఉద్భవించవు. అదే నిజమైన సన్యస్థ స్థితి.

ఇదే విషయాన్ని ఇంకా నొక్కి చెబుతూ కబీర్ మహాశయుడు. "ఏక్ కనక్ అరూ కామినీ జగ్‌మే దోయీ ఫందా" అని పేర్కొన్నారు. అనగా ఈ జగతిలో మనకు కనకం, కామిని అన్నవి రెండే బంధాలు అని. సంపత్తిని, స్త్రీని వదిలివేస్తే బ్రహ్మ సాక్షాత్కారంఅవుతుందని తలుస్తాం. కారణమేమంటే జగత్తు ఈ రెండింటి చుట్టూనే తిరుగుతోంది కాబట్టి, వాటితోనే కట్టి వేయబడింది కాబట్టి. మనష్యులకు రెండే కోరికలుంటాయి. అవి-ఒకటి స్త్రీ, రెండవది ధనము. వీటిని వదిలివేయడమే వైరాగ్యం. అప్పుడే పరమాత్మ ప్రాప్తి కలుగుతుంది.

కబీర్ ఆలంకారిక భాషలో చెబుతారు. లుబ్ధత్వానికి ప్రతీక బంగారం, కామానికి ప్రతీక స్త్రీ లేక కామిని. ఈ రెండింటినీ వదిలివేయడమంటేనే వైరాగ్యమని కబీర్ సెలవిచ్చారు. కామమే కామినిని ఉత్పనం చేస్తుంది. కావున త్యాగం చేయవలసింది కామాన్నేగాని కామినిని కాదు. బంగారాన్ని ఏ కొద్దిగా సొంతం చేసుకున్నా ఆదిలోభం. ఈ కామ లోభాలే మనిషి చుట్టు ముట్టి ఉంటాయి. లోభం మనిషిని బంధితుడిని చేస్తుంది. కామలోభాలు పూలు, ఆకులవంటివి. వాటిని తెంపినా, రాల్చినా మళ్లీ కొత్తవి పుట్టుకొస్తాయి. వాటివేరు మనసులో ఉంది. అది వాటిని ఎప్పుడూ పచ్చగానే ఉంచుతుంది. కావున మూలాన్ని ఛేదించడమే ప్రధానమైన విషయం.

దోస్తో వర్కీ తన సంస్మరణ గ్రంథంలో ఈవిధంగా వ్రాశాడు. తాను జార్ సాహీకి విరుద్ధంగా విప్లవాన్ని నడుపుతున్న రోజులలో ఒక రోజున అతను పట్టుబడ్డాడట. తనతోబాటు ఇంకా కొందరు అతని సహచరులు. కూడా అదుపులోనికి తీసుకోబడినారట. అందరికీ మరణదండన విధింపబడింది. మరణదండన విధించిన నాటి ఉదయం ఆరుగంటలకు అందరినీ తుపాకి గుండ్లు పేల్చి చంపాలి. అందుకు అన్ని ఏర్పాట్లు చేయబడ్డాయి. శవపేటికలు కూడా సిద్ధం చేయబడ్డాయి. అంతే, అందరూ నిర్ణయింపబడిన ఆ క్షణం కోసం ఎదురు చూస్తున్నారు. వాళ్ళకు ప్రతిక్షణమూ, భరించరానిదిగా మారింది. మానసికంగా వాళ్ళంతా మరణించిన వాళ్ళే అయ్యారు. ఇక మిగిలింది శారీరక మరణం మాత్రమే. అందరూ ఒక వరుసలో నిలబడ్డారు. అప్పుడు ఆరింటికి గంట మ్రోగింది. సైనికులు తమ తుపాకులను పేల్చడానికి సిద్ధంగా ఉన్నారు. ఇంతలో ఒక వ్యక్తి గుర్రమెక్కి అక్కడకు వచ్చాడు. వస్తూనే అతను వాళ్ల మరణదండన ఆజీవనకారాగారవాసంగా మార్చబడిందన్న ఆదేశాన్ని వినిపించాడు. ఐతే అప్పటికే వాళ్ళలో ఒకడు నేల మీదవాలిపోయాడు. ఆరుగంటలయింది. తమకు విధించిన శిక్షలోని మార్పు వినగానే అతను లేచి నిలబడ్డాడు. అందరితో కలిసి జైలువైపుకు నడిచి వెళ్లాడు.

ఆ సంఘటన జరిగిన తరువాత ఆ మనిషి అనేక సంవత్సరాలు జీవించాడుట. ఐతే ఇప్పుడతను లోగడవలెలేడు. ఇటు, అటు తిరగడం, లేవడం, కూర్చోవడం, పనిపాటలు చేయడం మామూలు వ్యక్తి చేసినట్లు చేసేవాడు. ఐతే ఎవరైనా అతనిని ప్రశ్నిస్తే తాను ఫలానారోజున, ఉదయము ఆరుగంటలకు చనిపోయానని చెప్పేవాడు. అందరూ అతనిని పిచ్చివాడనేవారు. కాని అతనిలో పిచ్చివాని లక్షణాలేవీ లేవు. అతను నిస్పృహుడైన యోగివలె ఉండేవాడు. దేనియందు ఆసక్తిగాని, కోరికగానీ లేకుండా నిర్లిప్తుడుగా ఉండేవాడు. దోస్తోవర్కీ తనను గురించి చెబుతూ తాను కూడా మరియొక మనిషిగా మారిపోయానని తెలిపారు.

ఇక్కడ ఒక పిచ్చివానికి సన్యాసి అని పేరు పెట్టడం లేదు, లేక అతనినొక నిర్లిప్తయోగిగా పేర్కొనడం లేదు. అంతరంగంలో అనాసక్తిపెల్లుబికి, లోపల సృష్టించుకున్న ప్రపంచం తనలో లయమైపోయి తీవ్రమైన వైరాగ్యానుభూతిని పొందాడు. దానికి చెందిన లక్షణాలు ఆతని నిత్య జీవనాన్ని వాటిని అనుకూలముగా మారుస్తాయి. ఇట్టి స్థితియే నిజమైన సన్యాస సాధన. భర్తృహరి రచించిన 'వైరాగ్య శతకం' యొక్క సారమిదే.

అనువాదం - కె.బి.సోమయాజులు

*(అఖండ జ్యోతి మార్చి 1999)*

**ఎంత సంపాదించావు అన్న దాని కంటే ఎలా ఖర్చు పెట్టావు అన్నదే ముఖ్యం.**

ధారావాహిక : భక్తిగాథ-24

# గోపికల కృష్ణ ప్రేమ యొక్క తత్వం

తీవ్రమైన ఉత్కంఠ, హృదయంలోని మౌనస్పందన నిశ్శబ్దానికి భంగం కలిగిస్తోంది. కంటక ప్రాయమైన చాలా ప్రశ్నలు చాలా మందికి మనస్సుల్లో గుచ్చుకుంటాయి. ఆధ్యాత్మికము, నైతికము ఈ ద్వంద్వ భావన ఉండిపోయింది. శ్రీకృష్ణునికి గోపికల యందున్న ప్రేమ, గోపికలకు శ్రీకృష్ణుని మీది ప్రేమ సామాజిక, నైతిక కొలతలతో ఎంతవరకు సార్థకమైంది? శ్రీకృష్ణుని పూర్ణ బ్రహ్మతత్వాన్ని తెలియని ప్రజలు దీనివలన నేర్చుకునేదేమిటి? పొందేదేమిటి? తమకాలంలో అనేకమైనస్మృతులను, సంహితలను రచించిన మహర్షులలో ఇటువంటి ప్రశ్నలు తెలత్తాయి. వీరిలో ఆపస్తంభ మహర్షి ఒకరు. పైకి ఏమీ ఆనకపోయినా అతని మనస్సులోని వ్యాకులత ముఖం మీద ప్రస్ఫుటమౌతోంది. నుదుటిమీద ఒకటితర్వాతఒకటిగా ముడుతలు వచ్చిపోతున్నాయి.

సర్వజ్ఞులూ, అంతర్జ్ఞానులూ అయినటువంటి సప్తఋషులు కృష్ణతత్వాన్ని బాగా తెలిసిన వారయినప్పటికి దేవర్షివంక చూస్తూ ఉండిపోయారు. వారికి దేవర్షి క్రొత్త సూత్రంలో దీనికి సమాధానం లభిస్తుందనిపించింది. చాలా సేపటి వరకు మౌనంగా ఉన్న దేవర్షి కళ్ళుతెరచిచూచారు. వారు కళ్ళు తెరవగానే హిమాలయ దివ్య ప్రాంగణంలో భక్తి ప్రకాశించింది. వారు వాతావరణ స్పందనలను అనుభవిస్తూ ఇలా చెప్పారు. – "శ్రీ కృష్ణుడు పరబ్రహ్మ. విశిష్టమైన ఆయన ప్రేమ సమాజానికి విరోధమైందికాదు, నైతికబంధనాలకూ అతీతమైంది."

"శ్రీకృష్ణునికి గోపికల ఎడల ఉదయించిన ప్రేమ జీవాత్మలయందు పరమాత్మునికి గల సహజ ప్రేమ. గోపికలకు శ్రీకృష్ణుడు పరబ్రహ్మ స్వరూపుడని తెలుసు కనుక వారి భక్తిలో జీవాత్మలకు భగవంతుని యందున్న సమర్పణ భావము, సామాజిక, నైతిక హద్దులు స్థూల శరీరం వరకు ఉంటాయి.కానీ గోపికలకు, శ్రీకృష్ణుని భక్తి ప్రేమకథ కారణశరీరంలో వ్యాపించి ఉంది. సాధనలో ఇంకొక సత్యం కూడా ఉంది. భగవంతునికి సమర్పించిన కోరికలు రూపాంతరం చెంది నిండైన భక్తి భావ స్వరూపాన్ని దాలుస్తాయి. వాటిని భగవంతునిలో లయం చేస్తే మోక్షద్వారాలు తెరుచుకుంటాయి.

"గోపికలు జన్మజన్మాంతరాల నుండి శ్రీకృష్ణుని భక్తులు. వారికి నంద నందనుడు సాక్షుత్తూ పరమాత్మ యొక్క సాకార విగ్రహమని క్షణ్ణంగా తెలుసు". ఈ వాక్యం పూర్తి చేసి నవ్వుతూ దేవర్షి తమ క్రొత్త సూత్రాన్ని ఉచ్చరించారు.

"తద్విహీనం జారాణా మివ(23)" శ్రీకృష్ణుని పరమాత్మ స్వరూపాన్ని గ్రహించలేనివారి ప్రేమ వ్యభిచారుల ప్రేమతో సమానము !! ఈ సూత్రాన్ని పూర్తిచేసి దేవర్షి ఆపస్తంబ ఋషితో ఇలా అన్నారు. "నీతి కోవిదులై స్మృతి సంహితలను రచించిన మహర్షుల అనుభవంలో ఒక సత్యముంది. గొప్ప ఉద్దేశ్యాలతో కూడిన సామాన్య ప్రాపంచిక క్రియలూ, భావనలూ కూడా ఎంతో గొప్పగా ఉంటాయి. కానీ నీచమైనవి, తెలివితక్కువవీ ఐన ఉద్దేశ్యాలతో కూడిన గొప్ప ప్రదర్శన కూడ చాలా అల్పమైంది అవుతుంది.

అపస్తంబ మహర్షి ఏమీ మాట్లాడక పోయినప్పటికీ వారి ముఖం మీద అగుపించే సంకోచాన్ని గమనించనట్లుగా దేవర్షి చెప్పసాగారు.

"ప్రభువు వ్రజ భూమిలో అవతరించినపుడు విద్రుమ మహర్షికి కూడ ఇదే విధమైన భ్రమ ఉండేది. వారు అఖిల బ్రహ్మాండ నాయకుడూ, సర్వలోకాధిపతీ అయిన సర్వేశ్వరుని ప్రాపంచిక కొలమానంతో చూశారు. కానీ ...... అంటూ దేవర్షి ఒక క్షణం ఆగారు. అప్పుడే బ్రహ్మర్షి వసిష్ఠులు ఇలా అడిగారు." దేవర్షీ! ఈ భక్తి కథను విస్తారంగా వివరించండి". ఆపస్తంబ మహర్షి కూడ చేతులు జోడించి దేవర్షితో "మా అజ్ఞానాన్ని మన్నించి కృష్ణ కరుణా రేణువులను మాకు ప్రదానం చేయండి." అన్నాడు.

బదులుగా దేవర్షి మందహాసం చేసి కథను వినిపించసాగారు. "వ్రజ భూమిలో అవి శరత్‌నవరాత్రులు." గోప కన్యలందరూ మహామాయ కాత్యాయినీ వ్రతాన్ని విధి పూర్వకంగా చేశారు. ఈ వ్రత సంపూర్ణ వ్యవస్థ భగవతి పూర్ణ మాసీ నిర్వహించింది. భగవతి పూర్ణమాసీని వ్రజభూమిలోని వారంతా తమ ఆరాధ్యదేవిగా కొలుస్తారు. ఆమె పనుల్లో ఏ విధమైన ఆటంకమూ

ఎన్నాళ్ళు జీవించావు అనేదానికన్నా ఎలా జీవించావు అన్నదే ముఖ్యం.

కలుగ చేసేవారు కాదు. గోపికలచేత ఈ వ్రతం చక్కగా చేయబడుతోంది. వారు మూడు వేళల్లో యమునా స్నానం చేసి మూడు సంధ్యలలో భగవతీ కాత్యాయనీ పూజ చేసే వారు. మూడు కాలాల్లో దేవీమహత్యాన్ని గురించిన కథలు వినేవారు. ఈ విధంగా వారు ఆచరించే నవ రాత్రి వ్రతంలో ఏడు రోజులు గడచిపోయాయి. "

"అష్టమీ తిథిరోజున మహర్షి విద్రుమ్ వ్రజభూమికి వచ్చారు. వారు యథా ప్రకారం ప్రణామ మాచరించడానికి మహామాయ మందిరానికి వెళ్ళారు. వారు జగదంబ యొక్క అనన్య భక్తులు. మందిరంలోనికి వెళ్ళగానే గోపికలు వారికి నమస్కరించి ఆశీర్వాదం కోరారు. ఈ మహర్షివారిని మీరేమి కోరుకుంటున్నారని అడిగాడు. వారు మేమందరం శ్రీకృష్ణుని మాకు పతిగా కోరుకుంటున్నామన్నారు. అతను ఆశ్చర్యంతో మీరందరూ కూడానా? అని అడిగారు. అందుకు వారంతా ఒకే స్వరంతో ఔనని బదులు చెప్పారు. విద్రుమ మహర్షి జడుడిలా ఉండిపోయాడు. వారికేమీ తోచక అలాగే చూస్తూ ఉండిపోయారు. వివాహితులూ, అవివాహితులూ కృష్ణుని భర్తగా కోరుకుంటున్నారు. ఆశ్చర్యమేసింది."

మహర్షి నిరుత్తరుడై నించోవడం చూచి ఒక గోపిక నవ్వుతూ మహర్షీ! మావ్రతాన్ని గురించి ఇంతగా ఆశ్చర్యపడుతున్నా రెందుకు? జీవాత్మలన్నింటికీ ఆయన పతియే గదా ! జీవునికి అతను తప్ప సంపూర్ణమైన స్వామి ఎవరు కాగలరు?" ఆ గోపిక మాటలను మహర్షి అర్థం చేసికోలేక పోయాడు. వ్రజ భూమిలో ఇంత పెద్ద అనాచారం జరుగుతోంది. దీన్ని ఎవరూ ఎందుకు అడ్డగించడం లేదు. ఈ నందగోపుని కుమారుడు పరమాత్మ ఎప్పుడయ్యాడు? మనస్సులో ప్రశ్నలెన్నో ఉదయిస్తున్నాయి. ఏమీ మాట్లాడకుండా జగదంబ మందిర ప్రాంగణంలో కూర్చొని తనకు మార్గ దర్శనం కావాలని ప్రార్థించారు.

"ఇలా ప్రార్థిస్తూ ఎంత సేపు ఉన్నారో తెలియదు. గోపికల వెంట వచ్చిన భగవతి పూర్ణమాసీ స్పర్శతో చైతన్యం కలిగింది. ఆమె స్పర్శతో ఆయనలోని ఆలోచనలన్నీ మారిపోయాయి. భగవతి పూర్ణమాసీ వంక తదేకంగా చూస్తున్నారు. ఈమె స్వయంగా యోగమాయ గదా ! తర్వాత చుట్టూ గోపికలతో కూడుకొని ఉన్న రాధను చూచాడు. మూల ప్రకృతియే ఈ రాధ రూపం దాల్చింది. మహా మాయ రూపంలో గోపికల పూజలను స్వీకరిస్తున్నది. ఈ గోప బాలికలు వేరెవ్వరో గాదు. జన్మ జన్మాంతరముల నుండి తపస్సాధన చేస్తున్న తత్వ జ్ఞానులైన ఆత్మలు. ఎంతటి అపూర్వమైన దృశ్యము! స్వయంగా ఆదిశక్తియే పూజ చేస్తూ, చేయిస్తూ ఉంది మహర్షి విద్రుమ్ గాబరాపడి కళ్ళు మూసుకున్నాడు. వారికి నిజమైన భక్తి ఏమిటో అనుభవమైంది." ఇటువంటి అనుభూతే ఆపస్తంబమహర్షికి కూడ కలుగుతోంది.

*అనువాదం – కె. అరవిందమ్మ*

## ఆశావాది

*దౌర్భాగ్యములతో కూడిన దుర్గమ మార్గములో సాహసంతో ముందుకు సాగే వ్యక్తి ఇతరుల కొరకు విశ్వాసం అనే సువాసనతో కూడిన పుష్పాలను వెదజల్లుతాడు.*

*"నేను తరుణ వయస్సులోనున్నప్పుడు కాలేజీలో చదువుకునే సమయంలో జీవన మంత్రాన్ని వ్రాశాను. "నేను భగవంతునియందు నమ్మకము కలిగి ఉంటాను. అట్లే మానవునియందు, ఆత్మశక్తియందు విశ్వాసం కలిగిఉంటాను. ఇతరులను కూడా సాహసులను చేయడం కర్తవ్యం. పరమాత్మ కృతియైన ఈ విశ్వాన్ని గురించి ఒక చిన్న తప్పుడు మాట కూడా మననోటి నుంచి వెలువడకూడదు. ఈ సృష్టిని గురించి ఏ ఒక్కరికీ నేరారోపణ చేసే అధికారం లేదు. ఎందుకంటే ప్రభువు దీనినింత అందంగా తయారు చేశారు, వేలాదిమంది దీనిని సుందరంగా ఉంచడానికి ప్రయత్నించారు."*

*ఈ మాటలు వ్రాసిన తరువాత చాలా సంవత్సరాలు గడిచిపోయాయి. ఆ సమయంలో నేను ఎన్నో వియోగాలు, దుఃఖాలు సహించాను. కానీ వాటిని మార్చే అవసరం నాకేమీ కనబడలేదు. భగవంతునియందు, మానవునియందు, ఆత్మయందు నమ్మకముంచిన వ్యక్తి తప్పకుండా ఆశావాది అవుతాడు. అతనికి ఎన్ని బాధలు కలిగినా జగత్తులో దైవ శక్తి యొక్క తేజస్సు కలదని, ఆ శక్తి, తనను ఎల్లప్పుడూ చుట్టి ఉండి కాపాడుతుందని భావిస్తాడు.*

*– హెలెన్ కేలర్.*

**జరిగిన దానిని గురించి విచారించడం అనవసరం.**

మనం - మన ఆరోగ్యం

# పర్యావరణ సంరక్షణ - వనౌషధాల ఆవశ్యకత

పర్యావరణ సంరక్షణకైగత కొద్ది సంవత్సరాలుగా తీవ్ర చర్చ జరుగుతోంది. ఈ సందర్భంగా పెద్ద పెద్ద ఏర్పాట్లు జరుగుతున్నాయి. అయినప్పటికీ పర్యావరణ పతనానికి కారణం ప్రకృతి గురించి మన ఆలోచనా విధానం, వ్యవహారం, వికృత తత్వంలో ఉండడవే. మనం ప్రకృతిపై విజయం సాధించాలనుకుంటున్నాం. గర్వంతో దానిపై ఆధిపత్యం చలాయించాలని కోరుకుంటున్నాం. నిజానికి మనం వినమ్రతతో ప్రకృతితో సహ జీవనం చేయాల్సిన అవసరముంది.

చరిత్రలో ఎప్పుడూ ఇలా జరగలేదు. ప్రకృతి ఎడల గాఢమైన శ్రద్ధాభావం కలిగుండాలని , ప్రాచీన భారతవైదిక వాఙ్మయంలో చెప్పబడిన అనేక సూక్తులు, బోధ కథలు లభ్యమౌతున్నాయి. వేద కాలం నాటి ఋషులు, తత్వవేత్తలు ప్రకృతిని మాతగా భావించి వందనం చేస్తుండేవారు. ప్రకృతిని శ్రద్ధాభావంతో చూసినట్లు అనేక ఉదాహరణలు ఉన్నాయి. ప్రాచీన కాలంలో భారతదేశమే కాక, అమెరికా మహా ద్వీపం మొదలు బాబిలోనియా, ఈజిప్టు మొదలైన సమాజాలలోను ప్రకృతిని గౌరవించేవారు. గ్వాటిమాలా మాయా యొక్క సభ్యత, నైతిక ఆలోచనా విధానంలో జీవితంలో ప్రతీ ఉత్పత్తికి బీజమొకటిగానే భావించబడింది. వీటిలో కొన్ని బీజాలు మొక్కలు, చెట్లుకాగా , మరికొన్ని నదులైనాయి. ఈ విధంగా అన్నీ ఒకే బీజం నుండి పుట్టాయనే ఆలోచన మనిషికి ప్రకృతిలోని అన్ని రూపాల యెడ ప్రేమ కలిగి యుండి, రక్షించాలనే భావనకు ప్రేరణ నిచ్చింది.

ఒకవైపు ప్రకృతి వరాల వల్ల లాభం పొందుతున్న మనిషికి, లోభం కూడ పెరుగుతూ వచ్చింది. లోభం శ్రద్ధాభావాన్ని తగ్గించేసింది. ఈ క్రమంలో ఐరోపాలోని ఆధునిక విజ్ఞానంలో మహా మేధావి ఫ్రాంసిస్ బేకన్ “మనిషి ప్రకృతిపై విజయం సాధించి, తన బానిసగా చేసుకోవడమే ప్రధాన లక్ష్యంగా పెట్టుకున్నాడు. దీంతో ప్రకృతిపై ఆధిపత్యం పొందాలనే ఆలోచన పెరుగుతూ వచ్చింది. అలా ఆధిపత్యం సంపాదించడంలో ఉద్దేశ్యమేమిటంటే, మనం ప్రకృతి కెంత నష్టం కలిగించినా, దానిగురించి, చింతించ నవసరంలేదని. మనం కేవలం మన భోగం కోసం అధికాధిక రీతిలో ఉత్పత్తిని పెంచాలని కోరుకుంటున్నాం. దానివలన ప్రకృతి విభిన్న రూపాలలో – వాయు మండల శుద్ధత, భూమి ఉత్పాదక శక్తి, జలవనరుల లభ్యత మొదలైన వాటిపై పడే ప్రభావమేమిటి – అనే విషయాలను పట్టించుకోవడం లేదు.

రెండో వైపు ప్రకృతితో మనం సహజీవనం చేయాలనే దానికి అర్థం మన అవసరాలను తీర్చుకుంటూనే, ప్రకృతిపై వత్తిడి అధికంగా పెంచి, దాని విభిన్న రూపాలకు నష్టం కలిగించ కూడదని. అంటే మన వత్తిడి ప్రకృతిపై చాలా తక్కువగా ఉండాలి. ప్రకృతి పద్ధతుల ఉపయోగంలో నియంత్రణ పాటించడం నేర్చుకుంటాం. మనముపయోగిస్తున్న వస్తువులను ముఖ్యమైన అవసరాలకు పరిమితం చేసుకుంటూ, సామాన్య జీవనాన్ని అలవరచు కుంటాం. ప్రకృతి పరిమితులను పట్టించుకోకుండా, కరకుతనాన్ని రెట్టిస్తూ పోతే, ప్రకృతి నాశ్రయించే ప్రాణులకు వనస్పతుల కొరత ఏర్పడడమే గాక మనిషికి కూడ నష్టం కలుగుతుందని గుర్తించాలి.

వేలాది సంవత్సరాల నుండి మనుష్యులు వనాల నుండి తమ అవసరాల కోసం రకరకాల పూలు, పండ్లు, వన మూలికలు, వంట చెరకును పొందుతూనే ఉన్నారు. వీటన్నిటినీ వనాలు కూడ మనఃపూర్వకంగా ఇస్తూనే ఉన్నాయి. కాని మనిషి కలపను అవసరానికి మాత్రమే వినియోగించకుండా, అనవసరమైన వానికి కూడ వాడనారంభించాడు. అతడు వనాలను గ్రుడ్డిగా నాశనం చేస్తూ (నరుకుతూ) పోయాడు. కొత్త మొక్కలను నాటి వృక్షాలను పెంచవలసిన ఆవశ్యకతను గూర్చి కొంచెం కూడ ఆలోచించలేదు. కఱ్ఱ గుజ్జుతో వివిధ ఉపయోగాలను నేర్చుకున్నాడు. అంతులేని భోగ వస్తువుల తయారీకై హెచ్చు భారాన్ని వనాలపై వేయగోరుతున్నాడు. ఫలితంగా ఒక సంవత్సరంలోనే లక్షల ఎకరాల వనాలు ధ్వంసమౌతున్నాయి. అక్కడ నివసించే రకరకాలైన జీవ జంతువులు రక్షణ కోసం పరుగులు తీస్తున్నాయి.

**జరుగవలసిన దాన్ని గురించి ఆలోచించాలి.**

ఎన్నో జీవులు నశించి పోయాయి. మరెన్నో నశించే స్థితికి చేరువౌతున్నాయి. రకరకాల ఉపయోగాలు కలిగిన వేలాది వనస్పతులు నశించాయి.

వనస్పతుల నాశనం వలన వాయు మండలంలో విషతత్వం పెరిగిపోతోంది. నేటి పరిస్థితులలో వాతావరణ కాలుష్యమెంత వికృత స్థితికి చేరిందంటే మానవ ఆరోగ్యస్థితికే కాకుండా ఇతర జీవజంతువుల స్వస్థతకు కూడా పెను ప్రమాదాన్ని కలిగిస్తోంది. వాయుమండలంలోని పై పొరలలోనకి కాలుష్యం ప్రవేశించి ఓజోన్ పొరను కూడా ఛిద్రం చేసింది. దీనివలన సూర్య కిరణాలలో కూడా హాని కారకతత్వం ప్రవేశించి చర్మ సంబంధింత పుట్టకురుపు వ్యాధి (కేన్సర్), ఉబ్బసం మొదలైన అనేక సమస్యలుత్పన్నమౌతున్నాయి.

పర్యావరణ కాలుష్యం ఏ రూపంలో ఉన్నా, మొట్టమొదటి హాని మానవుని ఆరోగ్యానికే. ప్రస్తుతం వస్తున్న రోగాలు అంతుపట్టకుండా ఉన్నాయి. వాటినిగూర్చి ఇంతవరకు ఎవరూ చదవలేదు, వినలేదు. ఇకవాటిని చూసిఉండడమనే ప్రశ్నే ఉత్పన్నం కాదు. భయానక కాలుష్యాన్ని నియంత్రించి పర్యావరణ రక్షణకు సంబంధించిన ఉపాయానికి ఉన్నత స్థానం ఇవ్వాల్సి ఉంది. అలా అయితేనే పర్యావరణం కాలుష్య ప్రమాదం నుండి ఉద్ధరింపబడుతుంది. అనారోగ్య స్థితి నుండి ప్రజలకు విముక్తి లభిస్తుంది.

ఈ క్రమంలో ఓషధీ మొక్కలను అచ్చటచ్చట నాటి, పెంచడమే శ్రేష్ఠమైన ఉపాయం. గృహ ప్రాంగాణాలలో, పెరటి వనాలలో, మరెక్కడైనా నాటితే వీటి ఉనికివలన ప్రాణతత్వం పెంచే స్థితి ఏర్పడుతుంది. వీటి సంపర్కం, సాన్నిధ్యం మనిషి అనారోగ్యం బారినపడకుండా తోడ్పడుతుంది. వనాలలో నాటి, పెంచి పోషించవలసిన ఓషధీ మొక్కలలో నేరేడు, వేప, ఉసిరిక, రావి, మర్రి, మారేడు, అర్జున, అశోక, మునగ, కోవిదార, అమలతాసు, వరుణ, శిరీష మొదలైన వృక్షాలు శ్రేష్ఠమైనవి.

వనాలుగాని, ఖాళీ మైదానాలు గాని లేని చోట్ల, గృహ ప్రాంగణాలలో వనౌషధులను మొలిపించి పర్యావరణాన్ని సమృద్ధిచేయవచ్చు. అలా ఇంటి పెరడులలో పెంచడానికి యోగ్యమైన ఔషధ మొక్కలలో తులసి, ఘృత కుమారి, పుదీనా, గులాబి, పథర్‌గటా, తిప్పతీగ, అశ్వగంధ, శతావరీ, అకలకర్ర, బ్రాహ్మీ, వస, బంతి మొదలైనవి చాలా ముఖ్యమైనవి. మన ఇంటి ఆవరణ లేక సమీప పరిసరాలలో పైన చెప్పిన ఔషధ మొక్కలను మొలిపించి, పెంచే పరంపర కొనసాగితే పర్యావరణ కాలుష్యము నుండి రక్షణకు పరిష్కారం చూస్తుండగానే లభిస్తుంది. ఈ ఔషధాల సామీప్యంవలన, వీటి గుణాల పరిచయం వలన రోజువారీ జీవితంలో వచ్చే అనారోగ్య సమస్యలు నివృత్తి అవుతుంటాయి. ఈ కార్యం ప్రకృతికి శోభనిస్తుంది. దాని యెడల మనకుగల భావపూర్వక శ్రద్ధను అభివ్యక్తం చేసినట్లు కూడా ఔతుంది.

*అనువాదం – బాసంగి శ్రీరాములు*
*(అఖండజ్యోతి – జూన్ 1998)*

## వ్యక్తిలో ధర్మ సూక్ష్మం

*ఒక పాపాత్ముడికి ఒకసారి తన పాపాలకు సంబంధించి పశ్చాత్తాపం కలిగింది. అతనిని ఎవరో కబీర్‌దాసు వద్దకు వెళ్ళమని సలహా ఇచ్చారు. ఆయన అతని మనస్సుకు శక్తిని కలిగిస్తారని కూడా తెలిపారు. అతను వెంటనే ఒకరోగి హాస్పిటల్‌కు పరుగెత్తినట్లు కబీర్‌దాసు దగ్గరకు పరుగెత్తాడు. కబీర్ ఇంట్లోలేరు. అందువలన అతని భార్య అతనికి మూడుసార్లు దృఢంగా భగవన్నామాన్ని ఉచ్చరించమని సలహా చెప్పింది. ఆ పాపి నిజమైన భావనతో అట్లాగే చేశాడు. దానితో అతని మనస్సు శాంతించింది. అతను భగవంతుని స్మరిస్తూ తాండవం చేశాడు. అదే సమయంలో కబీర్ ఇంటికి తిరిగి వచ్చాడు. భగవత్ప్రేమతో నిండిన అతనిని చూచి ఎంతో సంతోషం కలిగింది. ఆయన భార్య ఆ భక్తుని యొక్క విషయమంతా ఆయనకు వివరించింది. అందుకు కబీర్ ఖిన్నుడై తన భార్యతో "కేవలం ఒక్కసారి ప్రభువు యొక్క నామాన్ని పలికితే అన్నీ సిద్ధిస్తాయి కదా! అటువంటప్పుడు నీవు అతనిని మూడుసార్లు హరినామాన్ని పలకమని ఎందుకు చెప్పావు? దీనిని బట్టి నీకు పరమాత్మయందు విశ్వాసం లేదని తెలుస్తోంది." అని ఆమెను నిలవేశాడు. అప్పుడామె, "ఈశ్వర నామాన్ని మూడుసార్లు పలకమనడానికి కారణం దానివలన ఆ పాపి యొక్క కాయిక, వాచిక, మానసికములైన మైల దూరమౌతుందని," జవాబిచ్చింది. దానితో కబీర్ తన భార్య యొక్క సూక్ష్మబుద్ధికి మిక్కిలి సంతోషించాడు.*

**జీవించడం కోసమే తిండి తినాలి.**

ధారావాహిక : నా స్మృతిపథంలో గురుదేవులు-38

# బాధపడేవారికి సంపద అండగా ఉండాలి

దైవం మనకు అందించిన బహుమతులలో సంపద ప్రధానమైనదని మనం భావిస్తాం. నిజం మరొక విధంగా ఉంది. మంచి ఆలోచనలు, మంచి భావనలు ఉన్న వ్యక్తులే దైవాంశ సంభూతులు. ఋషులు, యోగులు, సన్యాసులు, అమరవీరులు మొదలగువారు దైవాంశలుగా పూజింపబడుతున్నారు. వారు మనందరికీ మార్గదర్శకులు, దివిటీలాంటివారు. మన మంచి భావనలే మనకు మార్గదర్శకాలు. తర్వాత విద్య కూడా చాలా ముఖ్యమైన విషయం. ప్రతిభ మనను శాసిస్తుంది. దాని తర్వాతే 'సంపద' స్థానం.

మనుష్యుని దురదృష్టం వలన సంపద ప్రథమ స్థానంలోకి వచ్చింది. మనిషి డబ్బు కూడబెట్టి గౌరవస్థానం పొందాలని చూస్తున్నాడు. ప్రజాహితానికి ఉపయోగించబడవలసిన ధనం, ఒకచోట పోగుపడుతూ ఉంది. అలా దాన్ని వృథాగా ఉంచరాదు. నీరు ఒకచోట ఉంటే మురిగిపోతుంది. అలాగే ఆహారం నిలవ ఉంటే కుళ్ళిపోతుంది. వాటివల్ల దుర్వాసన వచ్చి జబ్బులకు మూలకారణమౌతుంది. ఒకచోట కూడబెట్టిన ధనం మనిషిని, సమాజాన్ని భ్రష్టుపట్టిస్తుంది. అందువల్ల ధనం సంపాదించాలి కాని దాన్ని, సమాజానికి ఉపయోగించాలి.

మంచి ఆలోచనలూ, నేర్పరితనమూ, కష్టాలను ఎదుర్కొనే సామర్థ్యంతోబాటు మంచి కార్యక్రమాలకు ధనం చాలా అవసరం. మంచి పనులకు ధనం దానంతటదే ప్రవాహం లాగా వస్తుంది. మన చరిత్రలో ఇటువంటి సంఘటనలు అనేకం. విశ్వామిత్ర మహర్షికి సత్కార్యములకు ధనం కావలసి వస్తే, అతని ప్రధాన శిష్యుడు హరిశ్చంద్ర మహారాజు, తన రాజ్యాన్నే ధారపోశాడు. తన భార్యనూ, బిడ్డనూ, చివరకు తననూ అమ్ముకొని ఆ ధనాన్ని ఆ ఋషి పాదాల చెంత ఉంచాడు. సుదాముని గురుకులానికి ధనం అవసరమైతే, అతని బాల్యమిత్రుడు ఆ విషయాన్ని గ్రహించి అతనికి అడగకుండానే ధనం సమకూర్చాడు. స్వాతంత్ర్య సంగ్రామంలో రాణా ప్రతాపసింగ్ డబ్బులేక ఇబ్బంది ఎదుర్కొనగా, భామాషా తన ధనాన్నంతా అతనికి ఇచ్చి స్వాతంత్ర్య సంగ్రామానికి ఊతమిచ్చాడు. బుద్ధుని బోధనలు ప్రపంచమంతా వ్యాపిస్తుండగా, ధనం అవసరమైంది. అశోకుడు తన రాజ్యాన్ని బుద్ధుని పాదాల చెంత ఉంచాడు. ఆవిధంగా బౌద్ధమతం వెలుగులు చిమ్మింది.

జగద్గురు శంకరాచార్య వైదిక ధర్మాన్ని ప్రచారం చేసినపుడు వారికి కావలసిన సంపదను, మాంధాత మహారాజు సమకూర్చాడు. జమునా లాల్ బజాజ్, గాంధీజీని తనకన్న కుమారునిగా భావించాడు. గాంధీజీ కార్యక్రమాలకు కావలసినంత ధనాన్ని అందించాడు. సుభాష్ చంద్రబోస్‌కు స్వాతంత్ర్య సంగ్రామానికి ధనం కావలసివస్తే బర్మాలో ప్రజలు ఆయనను బంగారంతో తూచి, ఆయనకు అండగా నిల్చారు. ఇదీ మన చరిత్ర. పురాణ ప్రసిద్ధుడైన కర్ణుడు, తన సంపదను ప్రతి ఉదయం ప్రజలకు దానం చేసేవాడు.

ప్రజలు ఆ రోజులలో ధనం బాగా సంపాదించేవారు. కాని దానిని బ్రాహ్మణులకు, సమాజానికి మేలు జేసే కార్యక్రమాలకు దానం ఇచ్చేవారు. బ్రాహ్మణులకు దానం చేసిన ధనం సద్వినియోగం అవుతుందని ప్రజలు నమ్మేవారు. ప్రతి కర్మకాండల్లో బ్రాహ్మణులకు దానం, భోజనం అనివార్యం. వారు ఆ రోజులలో మంచి పనులు చేయదానికే దానం తీసుకునేవారు. బ్రాహ్మణులు తమ అవసరాలను బాగా తగ్గించుకొని నిరాడంబర జీవితం గడిపేవారు. మిగతా ధనం ప్రజలకు ఉపయోగపడే మంచికార్యాలకు వినియోగించేవారు.

ధనం ఒకచోటే కూడబెడుతూ ఉంటే, ప్రజలలో అంతర్గత భేదాలు తలెత్తుతాయి. ధనికులనీ, బీదవారనీ తేడాలు వస్తాయి. దానివల్ల, దోపిడీలు దొంగతనాలు, హత్యలు మొదలవుతాయి. ఒకరిపై మరొకరు అపనమ్మకంతో ఉంటారు. ధనవంతులు రాక్షసులుగా మారే అవకాశం ఉంది. అందువల్ల మనకు కావలసినంత ధనం మాత్రమే ఉంచుకొని, మిగతాది సమాజానికి ఉపయోగపడే మంచికార్యక్రమాలకు వినియోగించాలి. దానివల్ల సమాజంలో వారికి గౌరవ మర్యాదలు ఏర్పడతాయి. ధనవంతుల దురాశ, స్వార్థం మూలంగానే కమ్యూనిజం ప్రబలమైంది. ధనవంతుల సొమ్ము కొల్లగొట్టబడుతోంది. నాస్తికత్వం ప్రబలుతోంది. కమ్యూనిష్టులు ధనికుల్ని మాత్రమే వ్యతిరేకిస్తారు. ధనికుల సంపదను బలవంతంగా తీసుకుంటారు.

కాబట్టి ధనవంతులు, తమ సంపదకు తాము కాపలాదారులు

**తినడం కొరకు జీవించకూడదు.**

మాత్రమే అని గుర్తించాలి. తమ ధనాన్ని మంచిపనులకు వినియోగించాలి. ఇది ఒక ఆచారంగా మారాలి. కాని ధనికుల స్వార్థం వల్ల, దూరదృష్టి లేనందువల్ల, ధనం దుర్వినియోగం అవుతూఉంది. ధనికులు వారి సమాజ దృష్టిని కోల్పోకపోతే, తప్పనిసరిగా పూర్వకాలపు ఆధ్యాత్మిక సామ్యవాదం, అందరి ఆమోదంతో మంచి ఆర్థిక కార్యక్రమంగా వచ్చి ఉండేది. ఇప్పటికీ ఆ అవకాశం ఉంది. ఉదారులైన ధనవంతులు, వారి సంపదను స్వచ్ఛందంగా సమాజానికి అందుబాటులో ఉంచితే, వారికి మంచి జరుగుతుంది. సమాజానికీ మంచి జరుగుతుంది. ఈ పద్ధతి, కమ్యూనిజానికి ప్రత్యామ్నాయం.

భగవంతుని ఆశీర్వాదంతో లభించిన సంపదను ప్రజాశ్రేయస్సుకు ఉపయోగించాలన్నది భగవంతుని కోరిక. ఈ సంపద, ఆవుపాదుగు వంటిది. ఆవు పాలు సద్వినియోగపడిన విధంగా ధనం కూడా ప్రజా ప్రయోజనాలకు ఉపయోగపడాలి. ధనవంతులు, ఎంత కష్టపడి ధనం సంపాదించారో, అంతే విజ్ఞతతో దాన్ని సద్వినియోగం చేయాలి.

ధనవంతులు ఒక చేదు నిజాన్ని గ్రహించాలి. రానున్న రోజులలో వారు ధనవంతులైనందువలన గౌరవింపబడరు. ధనాన్ని సమాజం స్వాధీనపరచుకొంటుంది. ప్రతి వ్యక్తీ తన సామర్థ్యం మేరకు పని చేయవలసి ఉంటుంది. సంపాదించి కూడబెట్టిన ధనంతో కొడుకులుగానీ, మనుమలుగానీ, ముని మనుమలుగానీ ఎవరూ సుఖపడలేరు. ముమ్ముందు ప్రభుత్వం ధనవంతులపై సంపదపన్ను, అధిక సంపద పన్ను వేసి, వారి ధనాన్ని లాగి వేస్తుంది. కష్టించి పని చేయలేని, స్త్రీలు, చిన్నపిల్లలు, వృద్ధులు తప్ప మిగతావారెవరూ వారసత్వ సంపదను అనుభవించకుండా శాసనాలు వస్తాయి. పూర్వకాలంలో ధనవంతులు తమ ధనాన్ని శ్రద్ధాపూర్వకంగా సమాజానికి అర్పించేవారు. వారు మాత్రం కష్టించి పని చేసి తమను తాము పోషించుకునేవారు. ఈ విధానం అమలులోకి రాబోతోంది. పూర్వీకులు సంపాదించిన ధనంతో జీవించాలి అనుకునేవారు తమ సామర్థ్యాన్నీ, తెలివితేటలనూ నిరుపయోగం చేస్తారు. పనికిరాని జీవితాన్ని గడుపుతారు. చెడు సాంప్రదాయాలను ఏర్పరచుకుంటారు. పనికిరాని పిల్లలను సమాజానికి భారంగా ఇవ్వరాదు.

ధనికులు ఒక ఉపయోగకరమైన కార్యక్రమం చేపట్టాలి. ధనాన్ని సద్వినియోగం చేయాలి అనుకోవాలి. ప్రజాశ్రేయస్సుకు పాటుపడాలి.

భామాషావలె ప్రతి వ్యక్తీ ప్రజాశ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని సంపదను సద్వినియోగం చేయాలి. ధనవంతులు తమ గుప్పిడి తెరవాలి. వానరులు, ఎలుగుబంట్లు తమ జీవితాలను లెక్కజేయకుండా రామకార్యం కొరకు పరుగులు తీశాయి. ప్రజలను ఇబ్బందులపాలు చేస్తూ ఆధిపత్యం వహిస్తున్న రాక్షసులను నిలువరించాయి. ఈవిధంగా ప్రతీ వ్యక్తి కూడా తన పద్ధతిలో రాక్షసులను ఎదుర్కోవాలి.

క్రొత్తయుగాన్ని నిర్మించడానికి ధనం చాలా అవసరం. ప్రచారానికి చాలా జ్ఞాన యజ్ఞాలు ఏర్పాటు చేయాలి. ప్రచార సామగ్రి, పుస్తకాలు అన్ని భాషలలోనూ కావాలి. దేవాలయాల నిర్మాణం జరగాలి. వాటి పోషణకు తగు సామగ్రి సమకూర్చాలి. వ్యాయామ శాలల ఏర్పాటు చేయాలి. మతాన్ని మంచిగా మలచాలి. మత విశ్వాసాలకు ఒక మంచి కుదుపు రావాలి. సాహిత్యకారులూ, సామర్థ్యము గల వారూ, కళాకారులూ, సరియైన దిశలో ప్రయాణించాలి. సమాజం వారిని సద్వినియోగం చేసుకోవాలి. సరిక్రొత్త విద్యావ్యవస్థ ప్రజలకు ఏర్పడాలి. సృజనసేన అన్ని హంగులతో ప్రజలముందుకు రావాలి. సమాజంలో జరుగుతున్న పాపాలనూ, చెడ్డ పనులనూ, పాతుకుపోయిన చెడు అలవాట్లను ధైర్యంగా ఎదుర్కోవాలి. మంచి కార్యక్రమాలు చేసేవారికి సహాయపడాలి. వారికి ధనం అవసరమౌతుంది. పిసినారుల నుండీ, అల్పబుద్ధులవారి నుండీ, అవగాహనలేని వారి నుండి ధనం రాదు. మంచివారు, సమాజశ్రేయస్సు పట్ల దృష్టిగలవారు, ఆత్మబలంగలవారి నుండి ధనం లభిస్తుంది. త్యాగమూర్తులైన ధనవంతులు చాలా మంది, మంచి కార్యాలకు ముందుకు వస్తారు. ధన ప్రవాహాన్ని ఎవరూ నిరోధించజాలరు.

యుగ నిర్మాణ పరివార్ సభ్యులు ముందుకు రావాలి. అంశదానం, సమయదానం చేయాలి. ఇది ప్రారంభం మాత్రమే. మామూలు శ్రామికుడు కూడా ఒకరోజు సంపాదన దానం చేయాలి. ధనం లేక కాదు ఇబ్బంది, విశాల హృదయంలేకనే. ఒక అడుగు ముందుకు పడితే, కోట్లాది అడుగులు కదులుతాయి.

యుగ నిర్మాణ పరిజనులు ధన సంపాదనకు గాక, క్రొత్త ప్రపంచాన్ని సృష్టించడానికి ప్రణాళిక తయారు చేసుకోవాలి. ఇది యుగసేనాని కర్తవ్యం. స్వార్థ రాహిత్యమే వారి ఆయుధం అని గుర్తుంచుకోవాలి.

(సమాప్తం)

**భగవంతుని పొందడానికి విశ్వాసం కావాలి.**

గాయత్రీమాత - 24 శక్తిధారలు :

# దేవమాత

గాయత్రీమాతను దేవమాత అంటాం. ఎందుకో తెలుసా? ఆమె సన్నిధికి చేరినవారు, ఆమె వద్ద అమృత స్తన్యాన్ని గ్రోలినవారు (జ్ఞాన స్తన్యం) ఆమె కొంగును విడువక ఆరాధించినవారు దేవత్వాన్ని పొందుతారు. వారి జీవితాలు వికసిస్తాయి. క్రమంగా ఈ భూమి మీద దేవతలుగా మారిపోతారు. వారే దేవమానవులు. అందువల్ల ఆమె దేవమాత.

గాయత్రీమంత్రంలో 24 అక్షరాలు ఉన్నాయి. ప్రతీ అక్షరం మనకు శిక్షణను ఇస్తూనే ఉంటుంది. ఆ శిక్షణను పొందినవారు ప్రతీక్షణం నూతన చైతన్యాన్ని పొందుతూనే ఉంటారు. సత్ప్రవృత్తులను స్వీకరించడంలోనే మానవ జీవన సార్థకత ఉన్నదని అర్థం చేసుకోగలుగుతారు. అజ్ఞానాంధకారంలో పడి కొట్టుమిట్టాడుతూ, మోహ బంధాలు అనే బురదలో కూరుకు పోతున్నారు. జీవితమంతా వ్యయ ప్రయాసలతోనే గడిపి వేస్తున్నారు. విచిత్రం ఏమిటంటే అలాంటి వారి మనస్సులో కూడ గాయత్రీమాత దృష్టిపడిందంటే పూర్తిగా మారిపోతారు. స్వార్థభావన పటాపంచలవుతుంది. వారు చేపట్టే ప్రతీచర్యా పరమార్థం వైపే పరుగులు తీస్తూ ఉంటుంది. మానవ శరీరంలో దైవత్వం ప్రవేశించడం అంటే ఇదే. దైవత్వాన్ని అనుభవంలోనికి తెచ్చుకున్నాక వారికి భూమి స్వర్గంలా గోచరిస్తుంది. వారి వ్యక్తిత్వంలో మార్పు వస్తుంది. వారి మనస్సులో ప్రశాంతత రాజ్యం చేస్తుంది. ఇలాంటి వారికే దేవాత్మ అన్న బిరుదు లభిస్తుంది. వారు స్వయంగా అభివృద్ధి పథంలో పయనిస్తారు. అంతేకాదు. తమతోపాటు అనేకమందిని తమ మార్గంలో నడిపిస్తారు. గంధపు చెట్టులాగా తమ చుట్టుప్రక్కల వాతావరణం అంతా సుగంధ మయం చేస్తారు. అంటే, అందరికీ దైవత్వాన్ని ఆపాదిస్తారు.

గాయత్రీమాత ఉపాసన వల్ల లభించే మొట్టమొదటి ఫలితం దైవీభావనల అభివృద్ధి. సాధకుని యొక్క అంతరంగం, బాహ్య ప్రపంచం రెండూ కూడ దైవత్వంతో పోలి ఉంటాయి. దుష్ప్రవృత్తులు ఒకదాని వెంట ఒకటి తెలియకుండానే తొలగిపోతూ ఉంటాయి. సత్ప్రవృత్తులతో ప్రగతిని సాధిస్తారు. గుణకర్మ స్వభావాలలో చిక్కుకుని ఉన్నా దుష్ట భావాలన్నీ శిశిర ఋతువులో ఆకులు రాలిపోయినట్లు జలజల రాలిపోతాయి. భక్తి భావం అనే గాలికి అంతులేని దూరాలకు ఎగిరిపోతాయి. వెంటనే జీవితంలో వసంత ఋతువు ప్రవేశిస్తుంది. జీవన వృక్షం క్రొత్త చిగురులు తొడుగుతూ ఉంటుంది. శ్రేష్ఠమానవులుగా మారిపోతారు.

దేవతకు ముఖ్యంగా రెండు గుణాలుంటాయి. 1) వ్యక్తిత్వ దృష్టితో ఉన్నతత్వం. 2) ఆచరణ దృష్టిలో ఆదర్శం. అసలు 'దేవత' అన్న పదానికి నిర్వచనం ఇచ్చే గుణంకలవాడు. పైన తెలిపిన రెండు గుణాలు కలవారు ప్రత్యక్షంగానో, పరోక్షంగానో ఎవరో ఒకరికి ఏదో ఒకటి ఇస్తూనే ఉంటారు.

దేవతలు అన్ని వేళలా యువావస్థలోనే ఉంటారు. వారి మనస్సులకుగాని, శరీరాలకు గాని వృద్ధాప్యం రానేరాదు. వారి ముఖాలు ఎప్పుడూ సంతోషంలో వెలిగిపోతూ ఉంటాయి. సంతోషముద్ర స్థిరపడి ఉంటుంది. ఎప్పుడూ ఉత్సాహ భరితంగా ఉంటారు. ఎలాంటి పరిస్థితుల్లో కూడా వారిని దీనులుగా ఆవేశపరులుగానూ, నిరాశాపరులుగానూ, అసహన శీలురుగానూ చూడం. ఈ ప్రత్యేకతలన్నీ ఎవరిలో ఉంటాయో, వారే దేవ మానవులు. దేవతలు స్వర్గంలో ఉంటారు. దేవ మానవులు ఆప్తులను కల్పవృక్షంవలె కాపాడుతూ ఉంటారు. తమ కోర్కెలను ఇతరుల కొరకు మాత్రమే ఉపయోగిస్తూ ఉంటారు. జీవించడానికి అవసరం ఉన్నంతవరకే తమ కొరకు దాచుకుంటారు. కోర్కెలు, ఆశలు, అహంకారం మానవుని అధఃపాతాళంలోనికి త్రొక్కి వేస్తాయని గ్రహిస్తారు. అసంతృప్తికి, అసహనానికి అవే మూల కారణాలని అందరికి నచ్చ చెపుతారు. భూమి మీదనే స్వర్గాన్ని సృష్టించుకోవచ్చునని బోధిస్తారు. వారి ఆరాధ్యదేవత దేవమాత. ఆమెయే గాయత్రీమాత. గాయత్రీ సాధకులను ఈ గీటురాయి మీదనే పరీక్షించుకోవాలి.

★★★

**మానవత్వాన్ని మించిన మతం లేదు.**

సమాజ నిర్మాణం

# వేరును తడిపితేనే మొక్క చిగురిస్తుంది

ఈ ప్రపంచంలో వస్తువుల కొరతలేదు. ఉపయోగపడే పరిస్థితులకు లోటులేదు. విపత్తులు కేవలం దుర్బుద్ధుల వల్లనే ఉత్పన్నమౌతున్నాయి. సద్భావనలకు బదులుగా దుర్భావనలు, మంచి ప్రవర్తనలకు బదులు చెడుప్రవర్తనలు చోటు చేసుకుంటున్నాయి. ఫలితంగా సుఖశాంతులకై, ప్రగతికై ఉపయోగించే వస్తువులను విపత్తులను, చిక్కులను పెంచటానికై ఉపయోగిస్తున్నారు. ప్రగతికి బదులుగా అధోగతిని చేతికి చుట్టుకుంటున్నారు.

జీవితంలోని అన్ని రంగాలలోనూ, అన్ని వర్గాలలోనూ చెడు ప్రవృత్తులు లోతుగా నాటుకుపోయాయి. ఫలితంగా అన్ని దిక్కులా కష్టాలను కల్గిస్తూ, సర్వాన్ని భక్షిస్తూ రాక్షసులు నగ్ననృత్యం చేస్తున్నారు. దుర్బుద్ధులతో యుద్ధం చేసేందుకు ఆలోచనా విప్లవమనే గాండీవాన్ని ఎత్తి పాంచజన్యాన్ని పూరించాలి. పరశురాముని గొడ్డలితో చెడు ఆలోచనల తలలను నరికివేయాలి. ఆలోచనల్లో మార్పు లేకుండా సమాజానికి ఆధారాన్ని ఏర్పరచలేం. జ్ఞానయజ్ఞం లేకుండా సుఖ-శాంతులు సర్వోన్నతమైన ప్రగతిని సాధించే నవయుగనిర్మాణం సాధ్యం కాదు.

యుగ నిర్మాణంలోని మూడవచరణం సమాజ నిర్మాణం. ఆత్మ నిర్మాణం, కుటుంబ నిర్మాణంలాగానే సమాజ నిర్మాణం కూడా యుగనిర్మాణంలో ముఖ్యపాత్ర వహిస్తుంది. ఆలోచనా పరిధిని విస్తరింపచేసి, వ్యాపింపచేయుట సంఘటిత సంస్థల వల్లనే సాధ్యమౌతుంది. ఇది అందరూ కల్సి చేయవలసిన పని. యుగనిర్మాణ ఆలోచనాధారతో పరిచయం ఉండి, ప్రభావితులైన జనులు సంఘబద్ధులై యుగనిర్మాణ సంస్థలను ఏర్పరచాలి.

ఈ సంస్థల ముఖ్యమైన పని ఆలోచనా విప్లవం యొక్క భూమికను తెలియచేయడం. దీనికై పుస్తకాలయాలు, జ్ఞానరథాలు, గోడలమీద రాయటం, స్టిక్కర్లు అంటించటం, మందిరస్థాపన మొదలైనవి చేయాలి. ప్రతివారం సత్సంగాలు, కథలు, కీర్తనలు, ఆలోచనాగోష్ఠులు, యుగనిర్మాణ సమ్మేళనాలు, కవితా సమ్మేళనాలు సంగీత సమ్మేళనాలు, గాయత్రీ యజ్ఞాలు, పుట్టిన రోజులు, పెళ్ళిరోజులు, సంస్కారాలు, పండుగలు మొదలైన వాటిద్వారా ఈ ప్రచారాన్ని ముందుకు తీసుకువెళ్ళవచ్చు. చదువుకున్న వారికి సాహిత్యం ద్వారా, చదువురాని వారికి ప్రతిపాదనలను వినిపించి ఆలోచనలను తీర్చిదిద్దే ప్రయత్నం చేయవచ్చు.

**మస్తిష్కాన్ని శుభ్రపరచటమే జ్ఞానయజ్ఞం :**

మన మస్తిష్కాలను శుభ్రపర్చటానికై చేసే పని పేరే జ్ఞానయజ్ఞం. అజ్ఞానంతోనిండిన యుగాలలోని అనైతికత, చెడు రీతులు, మూఢ భావాలు, అంధవిశ్వాసాలు, సంకుచిత తత్వాలు ఇప్పుడు కూడా మన మస్తిష్కాలలో నిండి ఉంటాయి. మానవులు వ్యక్తిగతవాదులు, స్వార్థవాదులుగా తయారయ్యారు. లోకకల్యాణం, పరమార్థ ప్రయోజనం, సమాజ ఉద్ధరణకై మనం ఏం చేయాలనేది మర్చిపోయారు. ఆధ్యాత్మ, చమత్కారం, స్వర్గం, ముక్తి, కోరికలు పూర్తి కావటమనే ఆలోచనలలో చిక్కుకుపోయారు.

ఈ స్థితిని మార్చటానికై ఆలోచనా విప్లవం ఇతరుల మనస్సులలో ప్రవేశపెట్టడం అవసరం. చెడు ఆలోచనలను తీసివేయడంతోపాటు మంచి ఆలోచనలు, ఆదర్శాలు, కర్తవ్యాలను ప్రేరేపించే తత్వజ్ఞానాన్ని స్థాపించడం అవసరం. యుగనిర్మాణ సాహిత్యం ద్వారా ఈ ప్రయోజనాలను పూర్తి చేయవచ్చు. వ్రాయటం, చెప్పటం ఈ రెండింటిని జ్ఞాన యజ్ఞాన్ని పెంపొందించేందుకు ఉపయోగిస్తున్నారు. మనం కూడా ఈ సంస్థల ద్వారా, ప్రచార కార్యక్రమాల ద్వారా ఉత్సాహంతో మన భావాలను వ్యక్తీకరించవచ్చు.

సమాజ నిర్మాణానికి ఆధారభూతమైన సంస్థలు ప్రచారానికి ముందు ఎక్కడ స్థాపించబడ్డాయో తరువాత కూడా అక్కడే పనులను చేపట్టాలి. ప్రణాళికా వ్యవస్థను ఏర్పాటు చేయాలి. సామూహిక శ్రమదానపరంపర ఎక్కడ సాగుతుందో అక్కడ అనేక రచనాత్మక కార్యాలు సహజంగానే వృద్ధి పొందుతాయి.

ఈ ఆందోళనలతో చెడు రీతులను, అనైతికతలను ఖండిస్తూ సమరం సాగించటం అవసరం. పెళ్ళిళ్ళలో జరిగే అనవసర ఖర్చు కట్న-కానుకలను నిరోధించటానికై మనం యుద్ధ ప్రాతిపదికన తీవ్రమైన ఆందోళనలు లేవదీయాలి. దేశాన్ని నిరంతరం పీడిస్తున్న అనైతికతను, దరిద్రాన్ని పెంచుతున్న ఈ

**భూత దయ లేనివాడు భూతాలతో సమానం.**

అనాచారాలను అన్ని విధాలా ఎదిరించాలి. భిక్షా వ్యవస్థను, పుణ్య క్షేత్రాలపై ఆవరించి ఉన్న పురోహితవాదాన్ని, భూతప్రేతాలు, అదృష్టాలు, ధర్మం పేరుతో పశుబలులు, బాల్యవివాహాలు, జాతులు, జన్మలపేరుతో ఎక్కువ తక్కువలు, ఆడపిల్లలు, మగపిల్లల మధ్య వ్యత్యాసం, స్త్రీలనూ, శూద్రులను తక్కువగా చూడటం మొదలైనవాటిని వెంటనే తొలగించాలి. నైతికంగా మాంసాహారం, మద్యం, బద్ధకం, పనిపట్ల అగౌరవం, పశువుల పట్ల నిర్దయ, భ్రష్టాచారాలు, దొంగతనం, మోసం, లంచగొండితనం, ఎక్కువలాభాలు తీసుకోవడం అధిక సంతానం, అనవసర ఖర్చులు, నాగరిక కర్తవ్యాల పట్ల ఉదాసీనత, సమయాన్ని దుర్వినియోగం చేయడం, విశృంఖలత్వం మొదలైన అనేక చెడు ప్రవృత్తులు ప్రచారంలో ఉన్నాయి. వీటిని సహిస్తూ ఉంటే ఈ కేన్సర్‌తో సమాజమనే శరీరమంతా కుళ్ళిపోతుంది.

అన్ని క్షేత్రాలలోనూ అనాచారం వ్రేళ్ళూనుకుంటూ వస్తోంది. వీటివలన కలిగే నష్టాలను గురించి తెలిపి ప్రజలను చైతన్యవంతులను చేయాలి. లోకుల మనస్సులలో అవాంఛనీయమైన వాటిపట్ల విరోధాన్ని, నిరాదరణ భావాన్ని కల్గించాలి. ఈవిధమైన సంఘర్షణలను ముందుకు తీసుకువెళ్ళేవారు అనేక రకాలైన ఆక్రమణలను, దెబ్బలను ఎదుర్కొనవలసి ఉంటుంది. వీటిని సహనంతో భరించేందుకై ఎవరిలో ధైర్యం, శౌర్యం, సంయమనం, సాహసం ఉంటాయో వారు ఈ ఉద్యమాలను నిర్వహించాలి. సాధారణంగా 8 గంటలు జీవనోపాధికి, 7 గంటలు నిద్ర, విశ్రాంతి, 5 గంటలు ఇంటిపనులు, శారీరక శ్రమ అన్నీ కలిపి 20 గంటలు. ఈవిధంగా ఖర్చు చేస్తే మిగిలిన 4 గంటలు సమాజ నిర్మాణానికై పైన చెప్పిన నాలుగు పద్ధతుల ద్వారా వినియోగించాలి. ప్రతిరోజూ ఒక గంట సమయాన్ని, ఒక రూపాయిని ప్రారంభ సభ్యత్వరుసుముగా నిర్ణయించుకోవాలి. సంతానంలో ఒక్కరు ఎక్కువగా ఉన్నట్లయితే వారి భారాన్ని పోషణను ఏవిధంగా భరిస్తామో అదేవిధంగా విశాల హృదయంతో యుగ పరివర్తనను కూడా దేవతగా భావించినట్లయితే బీదవారు కూడా ఈ మహా ప్రయోజనంలో పాలు పంచుకోగల్గుతారు.

కుటుంబ బాధ్యతల నుండి ముక్తి పొందినవారు, సంపాదనాపరులైన పెద్ద పిల్లలు వారి కంటే చిన్న పిల్లల నిర్వహణా బాధ్యతలను భరించకల్గితే పూర్తి సమయాన్ని లోక కల్యాణం కోసం ఉపయోగించాలి. అవకాశం ఉన్నవారు పెన్షన్, ఫండ్స్ మొదలైనవాటితో వారిపై ఆధారపడిన భార్య మొదలైన వారి బాధ్యతలను నిర్వహిస్తూ ఉండాలి. సాధువులు, బ్రాహ్మణులు ప్రాచీన పరంపరను పునర్జీవింపచేయటానికై మనలోని ప్రతి ఒక్కరూ జీవితంలోని అంతిమ భాగాన్ని వానప్రస్థ ప్రయోజనాలకై సమర్పించాలి. ఎవరి అంతరాత్మలో ఆదర్శవాదమైన ఆలోచనలు ఉప్పొంగుతాయో, లోక కల్యాణం కోసం అనుసరణీయమైన ఆదర్శాలను ఏర్పరచగల కాంక్ష జాగృతమౌతుందో వారే యుగనిర్మాణ వ్యాపకత్వాన్ని, ప్రయోజనాన్ని సాహసంతో సాధించగలరు.

ఆత్మ నిర్మాణం, కుటుంబ నిర్మాణం, సమాజ నిర్మాణమనే మూడు విధులనూ సుసంపన్నం చేస్తూ, యుగనిర్మాణ సాధనలను పూర్తిచేయగలగాలి.

*అనువాదం - ఎ.ఆర్.నిర్మల*
*(యుగ నిర్మాణయోజన, డిశంబర్ 2004*

# అందరికీ ఆహ్వానం

**24-11-2009 నుండి 02-12-2009 వరకు గాయత్రి శక్తి పీఠం, నారాకోడూరులో 9 రోజులు నవదుర్గ సాధన నిర్వహింపబడుతుంది. 03-12-2009 నాడు పూర్ణాహుతి సాధనలో పాల్గొని గాయత్రీమాత కృపకు పాత్రులు కాగలందులకై కోరుచున్నాము. వివరాలకు క్రింది ఫోను నంబర్లను సంప్రదించగలరు. పాల్గొనదలచినవారు 23-11-2009 నాటి రాత్రికే నారాకోడూరుకు చేరుకోవలసి ఉంటుంది.**

**కోట సుబ్బారావు**
పర్యవేక్షకులు
గాయత్రీ శక్తిపీఠం - నారా కోడూరు

ఫోన్ : **0863 2534440**
**0863 2534658**

ఇతరుల వస్తువులు ముట్టుకోకూడదు - అపరిగ్రహం.

## ధారావాహిక: దివ్యజీవన దర్శనం-67

# భవితకోసం ప్రతీక్ష-3

1947 ఆగస్టు 15న స్వరాజ్యం వచ్చింది. మథురలో కూడ స్వరాజ్య ఉత్సవం జరిగింది. శ్రీరామ్ తమ నివాసంలో విశేషయజ్ఞం జరిపారు. గుమ్మంలో త్రివర్ణ పతాకాన్ని ఎగురవేశారు. ఆ తర్వాత ఆయన కలెక్టర్ కార్యాలయంలో జరిగిన ఉత్సవంలో పాల్గొన్నారు. అనంతరం కట్రా కేశవదేవ్‌కు వెళ్ళారు. ఆయనతోపాటు పలువురు సామాజిక కార్యకర్తలూ, మిత్రుడు శ్యామ్‌లాల్ వెళ్లారు. కట్రాలో నివసిస్తున్న కుటుంబాలలో కూడా ఉల్లాసం ఉంది. అయితే మనసిచ్చి మాట్లాడే ధోరణి అంతగా లేదు. వారి మనస్సులలో, ఆలోచన ఉంది. అనుమానం ఉంది. మీకు భయంగా ఉంటే, మా ఇంటికి వచ్చి ఉండండి. మా ప్రెస్‌లో మీ మతం వ్యక్తులు పనిచేస్తున్నారు. మీరు అక్కడ ఎన్ని రోజులయినా ఉండవచ్చు. ఆందోళన చెందకండి అని శ్రీరామ్ వారితో చెప్పారు.

రెండు కుటుంబాలు రావడానికి సిద్ధమైనాయి. సాయంత్రంలోగా అందుకు తగు ఏర్పాట్లు చేస్తామని శ్రీరామ్ వారితో చెప్పారు. ఘియామండేలోని తమ నివాసంలో వారికోసం రెండు గదులు ఖాళీ చేయించారు. మరునాడు వారిని అక్కడకు తీసుకువెళ్లారు. మాతాజీ ముందుకువచ్చి వారికి స్వాగతం చెప్పారు. వంటింటిలోనే వారికి భోజనం ఏర్పాటుచేసేశారు. సుమారు రెండు వారాలపాటు అక్కడ ఉన్నారు. వాతావరణం చల్లపడ్డ తర్వాత వారు తమంతట తాము తమ ఇళ్లకు వెళ్లిపోయారు.

ఘర్షణ చెలరేగడంతో పెక్కు అల్పసంఖ్యాక వర్గ కుంటుంబాలకు జీవనోపాధి సమస్య ఎదురయింది. జనం వారికి పనులు ఇవ్వడానికి వెనుకాడుతున్నారు. వారు పని చేస్తున్న స్థలాలలో జనం వారిని అనుమానిస్తున్నారు.కొన్ని చోట్ల వారిని పనులనుండి తొలగించారు. ఇలాంటి కుటుంబాలు కొన్ని తమ సమస్యను శ్రీరామ్ ముందుంచారు. శ్రీ రామ్ వారి యజమానులను కలుసుకున్నారు. వారికి పలువిధాలుగా నచ్చజెప్పారు. ఆ యజమానుల అనుమానాలకు కారణం లేకపోలేదు. సమాజంలో వ్యాపించి ఉన్న అవిశ్వాసం, ఉద్రిక్తత అందుకు కారణాలు. పనిచేస్తున్నవారి గుణగణాలు కారణాలు కావు. ఉద్రేకాలను పెంచేమత సంస్థలుకూడా ప్రజలపై ఒత్తిడి తెస్తున్నాయి.

అలా నచ్చజెప్పడం వల్ల కొందరు యజమానులు తమ వద్ద పనిచేసే కార్మికులను తిరిగి పనిలోకి తీసుకున్నారు. అయితే, అవిశ్వాసపు అగాధాన్ని పూడ్చడం ఎలా అనే ప్రశ్న వచ్చింది. ఒక సహకార సంఘాన్ని ఏర్పాటుచేయాలని శాంతిదళ కార్యకర్తలు నిర్ణయించారు. కొద్ది పెట్టుబడిని సమకూర్చి లఘు పరిశ్రమలను స్థాపించాలని అనుకున్నారు. చేనేత, ఇళ్ళకు వెల్లవేయడం తలుపులకు రంగులు వేయడం మసాలా దినుసులు తయారుచేయడం, సబ్బుల తయారీ, యంత్రాల మరమ్మత్తు వంటి పనులు ఎంపిక చేశారు. వీటికి హెచ్చు పెట్టుబడి అవసరం ఉండదు. తమవద్ద ఉన్న ధనంతో, సంపన్నుల వద్దనుండి సేకరించిన ధనంతో అవసరమైన పెట్టుబడిని సమకూర్చారు. 1947 అక్టోబరు నాటికి సమితి పని ప్రారంభించింది. తయారైన వస్తువుల అమ్మకం బాధ్యతను కూడ వారు చేపట్టారు. మొదట్లో కొన్ని ఇబ్బందులు ఎదురైనాయి. ఈ పనులు ఆ కార్మికులు గతంలో చేసిన పనుల కన్న మెరుగైనవని ఆ తర్వాత అనుభవమయింది. స్వంత పనులు లాభం హెచ్చు. కనుక కార్మికులు కావడానికి ఈ పనులు దొరికినందుకు ఆనందించారు. సమితి కొద్ది సంవత్సరాలపాటు క్రియాశీలంగా పనిచేసింది.

సమాజసేవలో క్రియాశీలంగా పాల్గొంటూ ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నారు. మథుర నగరమంతటిలో మార్చి నుండి డిసెంబరు వరకు గాయత్రీ యజ్ఞాలు నిర్విరామంగా, దిగ్విజయంగా జరిగాయి. ఈ నెలలలో 35 యజ్ఞాలు నిర్వహించబడ్డాయి. నాలుగైదు వేలమంది సంపర్కంలోకి వచ్చారు. యజ్ఞ కార్యక్రమంలో శ్రీరామ్ ఇలా సందేశం ఇచ్చేవారు.

అసలు యజ్ఞం అనేది మన ఆంతర్యంలో జరగాలి. అగ్నిహోత్ర అనుష్ఠానం ఈ ఆంతరిక యజ్ఞానికి ప్రతీక. కృష్ణ పరమాత్మ దానిని బ్రహ్మయజ్ఞం అనీ, జ్ఞాన యజ్ఞం అనీ వర్ణించారు. మనం మన స్వార్థాన్ని సమాజానికీ, జాతికీ, విశ్వ ఆత్మకూ ఆహుతిగా ఇవ్వాలి. యజ్ఞ జ్వాల దానికి బాహ్య రూపం.

ప్రజల మనస్సులలో రగులుతున్న క్రోధానికీ, ద్వేషానికీ దిశను ఇవ్వడం ఈ కార్య క్రమాల వెనుక ఉన్న ఉద్దేశ్యం. మథురలో అల్లర్లు జరగకుండా చూడడం వీటి తాత్కాలిక లక్ష్యం. మథురలో రగులుతూన్న దావాగ్నిని శ్రీరామ్ జరిపిన యజ్ఞ జ్వాలలు తమలో ఇముడ్చుకున్నాయని 1948 నాటి వసంత ఉత్సవంలో ప్రముఖ రాజకీయ కార్యకర్త, శ్రీరామ్‌కు మిత్రులూ అయిన జగన్ ప్రసాద్ రావత్ చెప్పిన మాట అక్షర సత్యం. ఈ యజ్ఞాల ద్వారా ప్రజల ధార్మిక భావాలకు సరైన దిశ అందకపోయి ఉంటే మథురలో ఘోరమైన కల్లోలాలు జరిగి ఉండేవి.

**శరీరానికే కాదు, మనస్సుకు మాలిన్యం అంటుకోకుండా చూచుకోవాలి.**

1948 జనవరి 30న ఒక ఉన్మాది గాంధీగారిని హత్యచేశాడు. ఆవార్త దేశమంతటినీ కుదిపివేసింది "ఆజ్యోతి ఆరిపోయింది" అని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నోట వెలువడిన మాటలో జాతి అంతటి ఆక్రోశం వినిపించింది. ఆ ఉన్మాది హిందువు కావడం సంతోషించవలసిన విషయం. అతడు అల్ప సంఖ్యాక వర్గానికి చెంది ఉంటే ఏమి జరిగి ఉండేదో ఊహించడమే కష్టం.

శ్రీ రామ్ జనవరి 31న ఉపవాసం ఉన్నారు. మహా పురశ్చరణ సాధనలో మామూలుగానే ఒక పూట భుజించేవారు. మహాత్మ గాంధీ హత్యలో సమాజం యావత్తూ అపరాధి అని శ్రీరామ్ భావించారు. ఈ దోష ప్రక్షాళనకే ఆ ఉపవాసం. రెండవ రోజున, మూడవ రోజున కూడ ఆయన ఏమీ భుజించలేదు. వారి ఉపవాస కార్యక్రమంలో మత నాయకులూ, సామాజిక నాయకులూ పాల్గొన్నారు. గడచిన సంవత్సరం ఏర్పాటయిన సద్భావ సమితిలోని సభ్యులతో పాటు కాంగ్రెస్ కార్యకర్తలూ మామూలు పౌరులు కూడ ఒకరోజు ఉపవాసం ఉన్నారు. ఫిబ్రవరి ఒకటవతేది శ్రీరామ్ ఉపవాసాన్ని ముగించారు. ఆరోజున వందమందికి పైగా ప్రజలు హాజరైనారు. అందరి ముఖాలు వాడిఉన్నాయి.

శ్రీరామ్ కుటుంబంలో ఒక శిశువు ఉదయించాడు. ఆ బాలుడు జన్మించిన సమయంలో (ఆశ్వయుజ బహుళ తదియ – 1948 సెప్టెంబరు) శ్రీరామ్ జయసింహపుర వెళ్ళి ఉన్నారు. అక్కడ ఉద్రిక్త పరిస్థితి ఏర్పడిందని వార్త వచ్చింది. అక్కడి ప్రజలకు నచ్చ జెప్పివారిని శాంతింపజేసి శ్రీరామ్ ఆరోజు సాయంత్రం తిరిగి వచ్చారు. సన్యాసి, మిత్రుడూ ఆయన స్వామి ప్రేమానంద ఆయనతో పాటు వచ్చారు. ఆ సన్యాసి ఆర్య సమాజ్‌కు చెందిన వారు. ఆయన భజనలు చేస్తూ ఉంటారు. శ్రీరామ్ నిర్వహించే యజ్ఞాలలో అప్పుడప్పుడూ భజనలు చేస్తూ ఉండేవారు. ఒక సనాతన వాదితో కలసి పనిచేస్తున్నందుకు ఆయనను ఆర్య సమాజ్ కార్యకర్తలు విమర్శించేవారు. ఆయన ఎన్నడూ ఆ విమర్శలను పట్టించుకోలేదు. ఇంటిలోనికి అడుగు పెట్టగానే, స్వామి ప్రేమానంద్ పిల్లవాడు జన్మించాడని తెలుసుకున్నారు. పిల్లవాడికి శివుని నామాలలో ఏదో ఒక పేరు పెట్టాలని సూచించారు. సమాజం యొక్క ఆత్మ ప్రస్తుతం ద్వేషమనే గరళాన్ని త్రాగుతోందనీ, ఈ పిల్లవాడు ఆ గరళంపై విజయానికి చిహ్నంకావాలనీ ఆయన ఆకాంక్షించారు. మృత్యుంజయ అనే పేరు ఎలా ఉంటుంది? అది శివుని నామమే కదా? అనే వాక్యం శ్రీరామ్ నోట వెలువడింది.

పేరు ఖరారు అయింది. నామకరణ ఉత్సవం జరిగింది. ఆ ఉత్సవానికి కటరా కేశవదేవ్, ఛత్తా బజార్, హోవాగేట్ బయట నివసిస్తున్న ముస్లిం కుటుంబాలను కూడ ఆహ్వానించారు. కల్లోల సమయంలో ఈ కుటుంబాలకు ఏదో ఒక రూపంలో శ్రీరామ్ యొక్క సంరక్షణ లభించింది. ఆ సందర్భంగా వచ్చిన అన్ని మతాల ప్రజల తరఫున ద్వారక బాబు ఇలా అన్నారు. శ్రీరామ్! మీరు మత రంగానికి పరిమితం కావద్దు. సామాజిక రంగంలో, రాజకీయ రంగంలో మీ అవసరం ఉంది. ఆ రంగాలలో ప్రజలకు నాయకత్వం వహించండి. ఆయన సూచనను అందరూ సమర్థించారు. ఇమామ్ సాహెబ్ ఇలా అన్నారు. మీరు మథుర ప్రజలకు ప్రాతినిధ్యం వహిస్తే, అల్పసంఖ్యాక వర్గాలకు మరింత భద్రత కలుగుతుంది. ఆ మాటలు అందరికీ ఆమోదయోగ్యాలు అయినాయి, కానీ రాజకీయ కార్యకర్తలు మాత్రం కొంత ఇరుకున పడ్డారు. మథుర రాజకీయాలలో పేరు ప్రఖ్యాతులు గడించి, అక్కడ నుండి పైకి ఎగబ్రాకి పదవులను పొందాలని కోరుకునేవారు శ్రీరామ్ ఈ ప్రతిపాదనకు ఎక్కడ అవునంటారో అని గాభరా పడ్డారు. దీన్ని గుర్తించి కొందరు ఇలా అన్నారుకూడా.'శ్రీరామ్ రాజకీయాలలో ప్రవేశించడం ఎవరికీ ఇబ్బంది కలిగించదు. ఆయన ఎవరికీ అడ్డురారు. శ్రీరామ్ వంటి సహచరుడు లభించడంవల్ల వారి యాత్ర మరింత సుగమం అవుతుంది.

చర్చను ముగిస్తూ శ్రీరామ్ ఇలా స్పష్ట పరచారు. ఆ రంగంలో పనిచేస్తూనే రాజకీయాలకు మార్గంచూపవచ్చు. ప్రజల భావనలను అదుపుచేయడంలో ధార్మిక ఆధారమే సమర్థవంతం అయినదని గత సంవత్సరం మనందరికీ అనుభవమయింది. రాజకీయాల ఆసరాగా, పరిపాలన ఆసరాగా పరిస్థితులను అదుపుచేయడం తెలియకయిన పని కాదు. ఈ పరిస్థితులు ప్రజల మనస్సులలో తిష్ఠవేసి ఉన్న ద్వేష భావం నుండి జన్మించినవి. ప్రజల మనస్సుల లోతుల దాకా వెళ్ళగలిగేది ధర్మం మాత్రమే.

రాజకీయాలలోకి వెళ్ళడం తనకు ఏమాత్రం ఇష్టం లేదని శ్రీరామ్ ఈ మాటల ద్వారా స్పష్టంచేశారు. అక్కడకు వచ్చిన మిత్రులు కొందరు ఆయనను మళ్ళీ ఒత్తిడి చేశారు. అందుకు ఆయన ఇలా అన్నారు.

సముద్రంలో, నదులలో ఈదేవారికి చెరువులలో ఈదడం నచ్చదు. రాజకీయ రంగం ఒక చెరువు వంటిదని నేను భావిస్తున్నాను. విస్తృతమైన జలాశయాలన్నింటికీ నీరు ఇచ్చేది అయిన సముద్రంలో ఈదడమే మాకిష్టం. ఈ ప్రకటనలో అక్కడ ఉన్న రాజకీయ నాయకులకోపం చల్లారింది. వారి ముఖాలు వికసించాయి. పులకించిపోయారు. 'శ్రీరామ్ ధన్యుడు' అని వారు మళ్ళీ మళ్ళీ అన్నారు. శ్రీరామ్‌కు ప్రణామం చేశారు. ఆ నమస్కారంలో కృతజ్ఞత పాలు తక్కువ. తమ భయాలు తొలగిపోయాయన్న తృప్తి ఎక్కువ.

★★★

**సత్యం వద - ధర్మం చర**

ప్రత్యేక వ్యాసం (01.09.09 నుండి 09.09.09 వరకు శాంతికుంజ్‌లో జరిగిన సంజీవనీ సాధనా శిబిరం సందర్భంగా)

# డా॥ ప్రణవ పండ్యాగారి ప్రవచనం నుండి

పరమపూజ్య గురుదేవుల – వందనీయ మాతాజీల సూక్ష్మసంరక్షణలో ఇక్కడ కూర్చున్న మీరందరూ ఆంధ్రప్రదేశ్ కార్యకర్తలు. శాంతికుంజ్‌లో ఉండి తొమ్మిది రోజుల సాధన చేశారు. శిశువు తల్లిగర్భంలో ఉండి పరిపక్వం చెందినట్లుగా మీరంతా మాతాజీ గురుదేవుల కృపకు పాత్రులయ్యారు. వందనీయ మాతాజీ ఇదే ఆసనం మీద కూర్చుని అందరికీ మార్గదర్శనం చేసేవారు.

మనకోరికలను, ఇబ్బందులను, కష్టాలను అవి వ్యక్తిగతం అయినా, కుటుంబపరమైనవి అయినా గురుదేవుల తపశ్శక్తి దూరం చేస్తుంది. గురుదేవులనుధ్యానం చేస్తూ మూడు సార్లు గాయత్రి మంత్రం పఠించండి. మీకుడి చేతిని శిరస్సుమీద ఉంచుకుని వెనుకకు ఆనుకుని కూర్చోండి నేను మిమ్ములను అభినందిస్తున్నాను.

మీరంతా మీదైనిక కార్యాలను నిర్వహించుకుంటూనే గురుదేవుల కార్యం చేస్తున్నారు. మీరు చేస్తున్నది కొంచెంకాదు. చాలా ఎక్కువ. గురుదేవుల సాహిత్యాన్ని వారి ఆలోచనలను, యుగ శక్తి గాయత్రిని తెలుగులో తెలుగువారివద్దకు తీసుకుని వెళ్ళు చున్నారు. గురుదేవులు రచించిన హిందీ సాహిత్యాన్ని మొత్తం తెలుగులోనికి అనువదించే ప్రయత్నం జరుగుతోంది. అలాంటి ప్రయత్నాల్లో ఇది మూడవ భాష. తెలుగులోనికి వచ్చిన సాహిత్యాన్ని మీరంతా గ్రామ గ్రామానికి, ఇంటింటికి చేర్చవలసి ఉంది.

గురుదేవుల జన్మ శతాబ్ది దగ్గర పడుతున్నది. మనం వారి జన్మ శతాబ్ది జరపడం ఎందుకు? వారు జన్మించినందుకా? కాదు. వారు ఈ భూమి మీదకు ఒక విశేష కార్యం కోసం వచ్చారు. వారు **1911**లో జన్మించారు. **2011**న మనం జరుపుకునే జన్మశతాబ్ది ఉత్సవాలలో మీరు అందరూ పాల్గొంటారని ఆశిస్తున్నాను.

గురుదేవుల భావ విప్లవం negativity దూరం చేయాలి. ప్రపంచానికి మంచి ఆలోచనలను అందించాలి. విచార క్రాంతి మన దేశంలోనే కాదు విశ్వంలో ప్రఖ్యాతి గాంచింది. కారణం అది అందరికి కొత్త ఆలోచనా విధానాన్ని అందించింది.

మనం మారితే యుగం మారుతుంది. మనం చక్కబడితే యుగం చక్కబడుతుంది. అనే నినాదాన్ని అందించింది.

మనందరం గురుదేవుల జన్మ శతాబ్ది జరుపుకోబోతున్నాం. మనమంతా ఈ రెండు సంవత్సరాలు దానిలో భాగస్వాములం కావాలి. ప్రపంచంలోని భవిష్య వేత్తలు "**2010, 2011, 2012** ఈమూడు సంవత్సరాలు విశ్వసౌభాగ్యాన్ని ఆలోచనా విధానాన్ని నిర్దేశించటంలో మహత్వ పూర్ణ భూమిక పోషిస్తాయి. ఇటువంటి సమయంలో మనం చేయాల్సింది మన సాధన స్థాయిని పెంచుకోవటం. అంటే మాలలు పెంచుకోవటం కాదు. నాకు ఏ సమస్య వచ్చినా గురుదేవుల సోఫాముందు కూర్చొని, లేక వారి మంచం ముందు కూర్చొని వారిని ప్రార్థిస్తాను. నాకు ఖచ్చితంగా సమాధానం లభిస్తుంది. మీరు కూడా మీ పూజ చేసే ఆసనం మీద కూర్చొని గాయత్రీ మంత్రం చేసి గురుదేవులను ప్రార్థించండి. ఖచ్చితంగా సమాధానం లభిస్తుంది.

రాబోవు రోజుల్లో గాయత్రీ చేతనా కేంద్రం హైదరాబాద్ చాలా కార్యాలు చేయాల్సి ఉంటుంది. కొత్త స్థానాలలో 2012 వరకు నిర్మాణ పనులు ఆపటం జరిగింది. ఇపుడు మనకు ఉన్న కార్యాలయాలు విజయవాడ, గుంటూరు, వైజాగ్, నారా కోడూరు. వాటిలో కార్యకలాపాలు క్రియాశీలం చేయాలి.

**మొదటి సాధన :** అది వ్యక్తిగతంగానూ సామూహికంగానూ ఉండాలి. సామూహిక సాధన వలన

**ఇతరులకు కష్టం కలిగించే సత్యం జోలికిపోవద్దు.**

వాతావరణం శుభ్రపడుతుంది. ఇది మనందరి సమిష్టి ప్రయత్నం వల్లనే సాధ్యపడుతుంది. మనందరికీ సమయం 24 గంటలే. అందులో రెండు గంటల సమయాన్ని సామూహిక సాధన కోసం కేటాయించాలి. ధ్యానం చేయండి శక్తిని ఇస్తుంది. ఇది శని ఆదివారాల నుండి ప్రారంభించి వారంలోని మిగతారోజుల్లో కూడా చేయుటానికి ప్రయత్నించండి. ఎంత ఎక్కువ మంది వస్తే అంత మంచిది. ముందుగా ఎంత మంది వస్తే అంతమందితోనే ప్రారంభించండి.

**రెండవ సాధన :** యజ్ఞం. మన సుబ్బారావు గారు తేలు కాటుకు మందును వేల, లక్షలమందికి పంచారు. 12 సంవత్సరాలు అందుకోసమే వినియోగించారు. మనం కూడ ప్రజా సేవ చేయాలి.

స్వైన్ ఫ్ల్యూ ఈరోజు ప్రపంచం అంతటా వ్యాపించింది. అందుకు కారణం మురికి, అపరిశుభ్రత, వానలు కురవకపోవడం. ఇందుకు మనం యజ్ఞం, దీపయజ్ఞాలు, బలివైశ్యయజ్ఞం మొదలైనవి చేయాలి. బలివైశ్యం అంటే మనం వండిన అన్నాన్ని కొంచెం తీసుకుని బెల్లంతో, కొంచెం నెయ్యితో కలపాలి. చిన్న చిల్లుల గరిట పొయ్యి మీద పెట్టి, చిన్న చిన్న ముద్దలు చేసి ఆహుతులుగా వెయ్యాలి. లేదా అగ్ని హోత్రంలో వెయ్యాలి. ఈ చిన్న యజ్ఞాన్ని ప్రతి ఇంట్లో చేయాలి. దీనిని మించిన టీకా ఇంకోటి లేదు. పూనాలో స్వైన్ ఫ్లూ వ్యాపించింది. మా యూత్ గ్రూప్ సభ్యులు ప్రతి ఇంట్లో యజ్ఞం చేశారు. విశేషహవన సామగ్రిని మేము ఇక్కడ నుంచి పంపించాము. స్వైన్ ఫ్లూని మేము పూనాలో చాలావరకు రూపుమాపగలిగాము.

**మూడవ సాధన :** జ్ఞాన యజ్ఞం. గురుదేవులు అందించిన జ్ఞానాన్ని ఇంటి-ఇంటికి తెలుగులో తీసుకుపోవాలి. ఇంగ్లీష్‌వారికి ఇంగ్లీష్‌లో, హిందీ వారికి హిందీలో ఒక మందులాగా మంచి ఆలోచనను తీసుకువెళ్ళాలి.

గురుదేవుల సాహిత్యాన్ని, యుగశక్తి గాయత్రి, గురుదేవుల ఆలోచనలను, ఎన్నో మంచి మంచి చిన్న చిన్న పుస్తకాలను ప్రతి పల్లెకు, ప్రతి పట్టణానికి, ప్రతి నగరానికి తీసుకువెళ్ళాలి. గురుదేవుల ఆలోచనలతో వారిలో ప్రేరణ నింపడం మీరు చేయాల్సిన పని.

2010వ సంవత్సరాన్ని సంస్కృతీ సంవత్సరంగా పేర్కొనటం జరిగింది. అందులో భాగంగా మన సంస్కృతీ సామ్రాజ్యం, మన సంస్కృతిలోని గొప్పదనం. మహా పురుషులను గురించిన, గురుదేవుల గురించిన ప్రదర్శన దేశం మొత్తంలో ఒక వాహనం మీద ప్రదర్శించటం జరుగుతుంది. దానిలో 30 నుంచి 40 ఫోటోలు, వాటి కింద కేప్షన్స్ తెలుగులో ఉంటాయి. దానిని ప్రతి పల్లెకు తీసుకువెళ్ళాలి.

భారతీయ సంస్కృతి జ్ఞానపరీక్ష, మన నదుల పరిరక్షణ, నీటి సంరక్షణ, చెట్లు నాటటం మొదలైన పనులు చాలా ఉన్నాయి. వీటన్నింటిని వేగవంతం చేయటానికి కార్యకర్తలు ముందుకు రావాలి.

2011వ సంవత్సరంలో హరిద్వార్‌లోనూ, ఢిల్లీలోనూ రెండు పెద్ద కార్యక్రమాలు నిర్వహించాలని నిర్ణయించటం జరిగింది. దానిలో దేశ, విదేశాల కార్యకర్తలు పాల్గొననున్నారు. విదేశాలలో కూడా గాయత్రీ చేతనా కేంద్రాలు చాలా వేగవంతంగా నిర్మితమవుతున్నాయి.

హరిద్వార్‌లో జరుగు కార్యక్రమం 7 నుంచి 8 రోజుల వరకు జరుగుతుంది. దానిలో రెండు కోట్ల మంది పాల్గొననున్నారు. ఢిల్లీ కార్యక్రమంలో ఒక కోటి మంది పాల్గొననున్నారు. గాయత్రీ పరివార్ గురించి, దాని కార్యక్రమాల గురించి పూర్తి ప్రపంచానికి తెలుస్తుంది.

దాని ఏర్పాట్లలో భాగంగా 50,000 మంది కార్యకర్తలు ఆంధ్రప్రదేశ్ నుంచి కావాలి. అప్పటివరకు మనం సాధనాపరంగా, ఆరోగ్యపరంగా జాగ్రత్తలు తీసుకోవాలి. స్వయంసేవకులమైన మనమే కొత్తగా వచ్చేవారికి సహకారం అందించాలి. మనం అంతా ఒక ఇంటివారమే. మనం అతిథులను ఆదరించాలి. మన దేశసంస్థలను సంస్కృతీపరంగా జోడించే పెద్ద కార్యక్రమం.

మీ అందరి జీవితం మంగళమయం కావాలని గురుదేవులను ప్రార్థిస్తున్నాము.

★★★

**తప్పులెన్నువారు తమ తప్పులు ఎరుగరు.**

ధారావాహిక: దేవసంస్కృతీ సౌరభం-29

# భారతీయ సంస్కృతిలో 'గ' కార మహిమ

భారతీయ సంస్కృతిలో గాయత్రికి, గోవుకు, గీతకు, గంగకు, ఎంతో గొప్ప స్థానం ఉంది. ఈ నాలుగు మాతృస్వరూపాలలో తల్లి స్థానం ఇమిడి ఉంది. వీటి వలన లెక్కలేనన్ని మంచి గుణాలను, సామాజిక, నైతిక, ఆధ్యాత్మిక లాభాలను పొందగలుగుచున్నాము. ఆదర్శహిందువు ఈ నాలుగింటి ద్వారా శరీర శుద్ధిని, ఆత్మ శుద్ధినీ పొందగలుగుతాడు. ఒక్కొక్క మాతను గురించి వేరువేరుగా, విస్తారంగా తెలుసుకొనవలసిన అవసరముంది.

**1) గాయత్రి :** భారతీయ సంస్కృతికి సనాతన మంత్రము, పురాణములలో సృష్టి కర్తయైన బ్రహ్మకు ఆకాశవాణి ద్వారా గాయత్రీ మంత్రం లభించింది. ఈ మంత్ర సాధనతో తపస్సు చేసి బ్రహ్మ సృష్టి చేసే శక్తిని పొందాడు. గాయత్రీ మంత్రానికి గల నాలుగు పాదాలకు వ్యాఖ్యాన రూపాలే బ్రహ్మ యొక్క నాలుగు ముఖములనీ, వాటినుండి నాలుగు వేదములు వెలువడినాయనీ తెలుపబడింది. అందుకే గాయత్రిని వేదమాత అని పేర్కొంటారు. గాయత్రీ మంత్రాక్షరాలలో వేద, శాస్త్ర, పురాణ, స్మృతి, ఉపనిషత్తులు మొదలగువాటికి చెందిన విశేషములు ఉన్నాయి. వీటి వలన మనిషి వ్యక్తిగత, సామూహిక, పారమార్థిక సుఖ శాంతులను పొందగలుగుతాడు. గీతలో కృష్ణ భగవానుడు స్వయంగా – "గాయత్రీ ఛందసామహమ్" అని తెలిపారు. అనగా ఛందస్సులలో గాయత్రిని నేనే అన్నాడు. గాయత్రీ మంత్రము భారతీయమంత్రములన్నిటిలోను ఎంతో శ్రేష్ఠమైన మంత్రం. ఆయుర్దాయం, విద్య, సంతానప్రాప్తి, ధనం, బ్రహ్మతేజస్సు, మొదలైన వాటిని ఈ మంత్రము కలిగిస్తుంది. గాయత్రీ మంత్ర సాధన ద్వారా మన ఆత్మ మీద మురికిపోయి, దానియొక్క శుద్ధ స్వరూపం ప్రకటితమౌతుంది. అనేక బుద్ధి, సిద్ధులు ప్రకటితం కావడం మొదలౌతాయి. గాయత్రీ మంత్రోపాసన ప్రారంభించగానే మనిషి యొక్క అంతరంగంలో ఆత్మబలం పెరుగుతుంది.చెడు భావాలు అంతరిస్తాయి. ఓర్పు, నమ్రత, ఉత్సాహం, స్ఫూర్తి, శ్రమశీలత, మాధుర్యం, నిజాయితీ, సత్య నిష్ఠ, ఔదార్యం, ప్రేమ, సంతోషం,శాంతి, సేవాభావం, ఆత్మీయత మొదలగువాటి స్థాయి రోజు రోజుకు పెరుగుతూ ఉంటాయి.

గాయత్రిని మనం భూలోక కామధేనువని పిలుస్తాం, ఇందుకు కారణమేమంటే గాయత్రి ఆత్మకు చెందిన సమస్త ఆకలిదప్పులను శాంత పరుస్తుంది. గాయత్రిని సుధ అనడము జరిగింది. కారణమేమిటంటే గాయత్రి జనన మరణ చక్రమునుంచి విడిపించగల నిజమైన అమృతం. గాయత్రిని పరశువేది యని పేర్కొనడం జరిగింది. ఇందుకు కారణం గాయత్రి స్పర్శవల్ల కలుషితమైన అంతఃకరణ పరిశుద్ధమౌతుంది. కావున గాయత్రీ ఉపాసనవల్ల ప్రధానంగా ఆధ్యాత్మికమైన ఔన్నత్యం లభిస్తుంది. ఇదే ప్రముఖమైన లాభం. ఆత్మకళ్యాణం సుఖ శాంతుల వైపుకు పయనించడానికి గాయత్రిఎంతో సహాయకారిఔతుంది.

**2) గోమాత**: భారతీయ సంస్కృతికి ప్రకాశవంతమైన చిహ్నం. పూర్వకాలంలో ఆర్యులు గోవును – "మాతేవరక్షతి" – ఈ తల్లి మనను రక్షించుగాక –అని భావించేవారు. పురాణ కాలంలో గోవు మన కోరికలన్నిటినీ తీర్చేదిగా తలుపబడేది. దానిని కామధేనువనే వారు. ఇది స్వర్గలోకంలో ఉంటుంది. అప్పుడప్పుడు మానవ కళ్యాణం కోసం మానవలోకంలో అవతారమెత్తేది. ఈ భావం తోనే సాక్షాత్తు పరమాత్మ గోవురూపంలో జన్మించాడని భావించబడింది. యోగేశ్వరుడైన శ్రీకృష్ణుడు గోసేవను జీవనాదర్శంగా తీసుకోవాలని బోధించాడు. వివాహం వంటి సంస్కారాలను జరిపినపుడు దక్షిణ రూపంలో గోవును దానం చేసే విధానం గృహ్య సూత్రాలలో తెలుపబడింది. అధర్వవేదంలోని గోసూక్తంలో గోమాతయొక్క గొప్ప తనాన్ని గురించి తెలుపుతూ అనేక ప్రయోజనకర సిద్ధాంత వాక్యాలు పేర్కొనబడ్డాయి. వాటిని ఈ క్రింద ఉదహరించుట జరిగింది.

*"మాతా రుద్రాణాం దుహితా వసూనాం*
*స్వసాఽదిత్యా మమృతస్య నాభిః,*
*ప్రణువోచం చికితుషే జునాయమా*
*గామనాగామదితిం వధిష్ట."*

అనగా – గోవు రుద్రులకు తల్లి. వసువుల కుమార్తె. అదితి పుత్రులకు సోదరి, ఘృతరూపమునగల అమృతానికి భాండారము. వధింపదగనిదియైన గోవును వధింపరాదు.

అందరి ముందు తప్పులు పడితే మిత్రులు శత్రువులవుతారు.

*"యూయం గావోమేద యథా కృశం*
*కృశం చిద(శీర్ చితే కృణుథా సు(పతీకమ్*
*భ(ద గృహం కృణుథ భ(ద వాచో*
*బృహద్ధో వయ ఉచ్యతే సభాసు."*

ఓ గోవా ! నీవు కృశించిన శరీరం కలిగిన వ్యక్తిని పుష్టిగల వానినిగాచేయుదువు, తేజోహీనునికి తేజస్సును (పసాదించెదవు. అంతేకాదు. నీవు నీ మంగళ(పద శబ్దములతో మా ఇండ్లను మంగళయమ మొనరింతువు. ఇందువలన సభలలో నీ మహత్తర యశోగానము జరుగుతూ ఉంటుంది.

గోవు వలన లెక్కలేనన్ని లాభములున్నవి. గో సంపద యొక్క ఉపయోగాన్ని హిందువులు అర్థము చేసుకున్నందువల్లనే దానికి మిక్కిలి ఉన్నత స్థానమును ఇచ్చారు. భారతదేశమువంటి వ్యవసాయ (పధాన దేశానికి గోరక్షణ తప్పనిసరి. గోధనానికి ఎంతో మహత్వమున్నది. గోమాతవలన మానవ సమాజానికి కలిగే అసంఖ్యాకములైన లాభములు కలవు కావున మానవ జాతి దానికి నిరంతరము ఋణపడి ఉంటుంది. గోవంశనాశనము వలన ఆర్థికము, ధార్మికములైన రెండు రకాల నష్టములు కలుగుతాయి. (పతి (గ్రామానికి, నగరానికి నాలుగు వైపులా గోచర భూమిని వదలాలి. గోశాలల సంఖ్యను పెంచుటకు (పయత్నించాలి. దాని వలన పాలు, నెయ్యి, వంటి ఖాద్య పదార్థాలు, పుష్టి గల ఎద్దులు లభిస్తూ ఉంటాయి. భరత వర్షములో గో పాలన సనాతన ధర్మము. దానిని కాపాడుకోవాలి.

**3) గీత:** గీత మనకు జ్ఞాన, బుద్ధి, కర్మ, యోగములను నేర్పుతుంది. గీతా జ్ఞానము ఎల్లప్పుడు (పతి రంగములోను, జీవితానికి చెందిన (పతి స్థానములోను పనికి వస్తుంది. శ్రీకృష్ణపరమాత్మ యొక్క ముఖ కమలమునుండి వెలువడిన ఈ ఉపదేశములో జీవితములో ఏర్పడే (పతి చిక్కుముడిని విప్పగలిగిన సమర్థత ఇమిడి ఉంది. (పతి శ్లోకములోను నేటి వరకు ఏ దేశములోను, ఏ భాషలోను, ఏ (గంథములోను లేనటువంటి శక్తి, జ్ఞానము, వివేకము, ఉపదేశము, నీతి, ధర్మము మొదలైనవి లభిస్తాయి.

**4) గంగ :** గంగానదీజలము ఎన్నో రసాయనిక తత్వాలతో నిండి ఉన్నది. ఆ నీటిని (తాగినా, అందులో స్నానం చేసినా మనిషికి ఎన్నో లాభాలు కలుగుతాయి. గంగాజలం అజీర్తి, దీర్ఘ జ్వరాలు, వేడివలన కలుగురోగాలను, విరేచనాలను, ఆయాసాన్ని తలనొప్పివంటి రోగాలను నివారిస్తుంది. . ఇటువంటి రోగాలతో బాధపడేవారికి గంగా జలం ఎంతో లాభదాయకం దీనిలో ఆరోగ్యాన్ని గట్టిపరచగలిగినట్టి శక్తి ఉన్నది. కుష్టు రోగులను గంగా తీరంలో ఉంచడంలో గల ఉద్దేశ్యం ఇదే. గంగాజలంతో కుష్టువ్యాధితగ్గి పోతుందని అనేక (పయోగాలు చేసి తెలుసుకోవడం జరిగింది. గంగ నీటిపై గాలి కూడా ఎంతో మంచిది. గంధకం, వెండి, బంగారం, అ(భకం, మొదలైన అనేక రసాయనిక తత్వాలను తనలో నింపుకుని (పవహించే ఈ నీరు మనుష్యులకు ఎంతో (పయోజనకరం.

గంగానదియొక్క విశేషము, గొప్పతనాలను దృష్టిలో పెట్టుకునే హిందూ ధర్మములో దానికి విశేషమైన (పాధాన్యత నీయడం జరిగింది. ఇప్పటి వరకు గంగా జలం విషయంలో పరిశోధన కొనసాగుతూనే ఉన్నది. యావద్విశ్వానికి ఒక రోజున గంగ యొక్క మహిమ తెలుస్తుంది. గంగలోని రసాయనిక తత్వమునకు సంబంధించిన జ్ఞానం బయటపడిన రోజున హిందువులవలె (పపంచ (పజలందరూ గంగను ఆరాధిస్తారు.

గాయ(తి, గోవు, గీత, గంగల వలన కలిగే అసంఖ్యాక లాభాలను దృష్టిలో పెట్టుకుని భారతీయ సంస్కృతి వాటి కింత గౌరవాన్ని ఇచ్చిందనీ, అంధవిశ్వాసముతో కాదనీ తెలియ జేయడానికే ఇంత (వాయవలసి వచ్చింది.

## గంగా స్నాన పుణ్యఫలము ఎట్టిది? దేనివలన?

గంగా స్నానము చేసే పండుగ రోజది. ఎంతో మంది జనం స్నానం వల్ల కలిగే ఫలితాన్ని పొందాలని వెళుతున్నారు.అందరూ "గంగామాతకుజయ్" అంటూ నినాదాలు చేస్తున్నారు.

పార్వతీ పరమేశ్వరులు సూక్ష్మ శరీరాలను ధరించి ఆకాశములో విహరిస్తున్నారు. పార్వతి గంగాస్నానానికి కదిలి వెళుతున్న ఆ జన (పవాహాన్ని చూసి ఆశ్చర్య పడుతూ అందుకు కారణమేమిటని పరమేశ్వరుడిని అడిగింది.

"ఈ రోజు సోమవతీ అమావాస్య. శా(స్త్రాలలో ఈ పండుగకు ఎంతో మహత్వము తెలుపబడింది. గంగా స్నానం చేసేవారు స్వర్గానికి వెళతారు అని (వాయబడింది. ఈ కారణం వల్లనే (పతి పండుగనాడు ఇంతమంది గంగా స్నానానికి వెడతారు." శంకరుని మాటలు విన్న పార్వతికి ఆశ్చర్యం పెరిగిపోయింది "మనకు స్వర్గంతో నిరంతరమూ సంపర్కముంటుంది. అక్కడ స్థలం చాలా

**ఇతరుల తప్పులు సరిదిద్దాలనుకుంటే వంటరిగా నచ్చచెప్పాలి.**

తక్కువ, ఇంతమంది ప్రతి పండుగకు అక్కడకు వస్తారంటున్నారు. ప్రతి సంవత్సరమూ అనేక సోమవతీ అమావాస్యలు వస్తాయి. ఒక సంవత్సరములోనే కోట్లాదిమంది గంగలో మునుగుతారు. నూరు సంవత్సరాలలో వారి సంఖ్య స్వర్గంలో కాలుపెట్టడానికి కూడా స్థలం దొరకనంతగా పెరిగిపోతుంది. ఐతే శాస్త్రకర్తలైన ఋషులు పొరపాట్లు ఎందుకు వ్రాస్తారు? ఈ విషయం అర్థంకావడం లేదు. స్వామీ! ఈ సందేహాన్ని తీర్చండి." అని ప్రార్థించింది.

పరమ శివుడందుకు సమాధానమిస్తూ, "దేవీ! స్నానంతోబాటు మనస్సును కూడాస్వచ్ఛపరచుకోవలెనన్న నియమముంది. కానీ ఇక్కడ స్నానం చేసేవారు ఆ నియమాన్ని పాటించరు. ఆ దశలో ఈ గుంపు కేవలం ఆనందాన్ని మాత్రమే పొందుతారు గానీ శాస్త్రకారులు వివరించిన స్వర్గప్రాప్తిని పొందలేరు." అని తెలిపారు.

కానీ పార్వతియొక్క అనుమానము తాను తెలిపినదానివలన నివారింపబడక పోవడం గమనించిన పరమశివుడు ఆమెకు ఒక ఉదాహరణను చూపించి వాస్తవాన్ని తెలియజేసే ఉపాయమేమిటి యన్న ఆలోచనలో పడ్డాడు. అందుకొక నాటకమాడడం మొదలుపెట్టాడు. ఆ యాత్రికులందరూ ఏ త్రోవన వెడుతున్నారో అదే త్రోవలో పార్వతీ పరమేశ్వరులు మారువేషాలతో కూర్చున్నారు. పరమశివుడు కుష్టువ్యాధితో పీడింపబడుతున్న ఒక వృద్ధుడుగా వేషమును ధరించాడు. పార్వతిని ఒక అసాధారణ సుందరి వేషములో తన ప్రక్కన కూర్చోబెట్టుకున్నాడు. ఆ జంటను చూచి గంగాస్నానానికి వచ్చిన జనము తమలో తాము ఎవరీజంట? ఇక్కడ ఎందుకు కూర్చున్నారు? అని ప్రశ్నించుకోవడం మొదలుపెట్టారు. వారిన చూచిన పార్వతి ఆవృద్ధుడు తన భర్తయనీ ఆయనకు గంగలో స్నానంచేయవలెనని కోరిక కలదనీ, అందుకు అతని శరీరం సహకరించ నందువలన తాను ఆయనను వీపు మీద ఎక్కించుకుని యాత్రను పూర్తి చేస్తున్నాననీ, నడిచి నడిచి అలసి పోవడం వలన అక్కడ కూర్చుని విశ్రాంతి తీసుకుంటున్నామనీ, త్వరగానే మిగిలిన యాత్ర మరల ప్రారంభిస్తాననీ వివరించింది.

వారిని గురించి అడిగేవారిలో చాలా మంది కుటిలమైన దృష్టి కలవారున్నారు. వారు తమ పద్ధతిలో "ఆ ముసలి వాడిని గంగలోకి త్రోసి వేయమనీ, ఆ అందగత్తెను తమతో రావాలనీ, ఆమెకోసం అన్ని విధాలైన సుఖాలు కల్పింపబడతాయనీ, హాయిగా జీవితం వెళ్ళదీసుకోవచ్చుననీ చెప్పడం మొదలు పెట్టారు.

వారి పరామర్శలను విని, విని పార్వతి విసిగిపోయింది. వాళ్ళంతా ధర్మాత్ములా! అని ఆశ్చర్యపడిపోయింది. అంత కలుషిత మనస్కులు కూడా గంగా స్నానానికి వెడుతున్నారు, వారు ధర్మాత్ములుగా నటించడం వలన లాభమేముంటుంది? అని విస్తుపోయి, "నాథా! ధర్మాత్ములందరూ ఈ విధంగానే ఉంటారా?" అని పరమశివుడిని ప్రశ్నించింది. అందుకు శివుడు, "చేతికి గల ఐదు వేళ్ళు ఒకే విధముగా ఉండవు. ఈ జనసమూహములో కొందరు మంచి వాళ్ళూ ఉంటారు. నీవు వారిని కూడా చూడవచ్చును." అని సమాధానమిచ్చాడు.

అటువంటి వారిని చూడవలెనని పార్వతి ఎదురు చూడడం మొదలు పెట్టింది. కొంత సేపటికి ఒక భావుక భక్తుడు అక్కడకు వచ్చాడు, వారిని సునిసితంగా పరికించాడు. ఆదంపతుల యొక్క పరిస్థితిని, మానసిక స్థితిని చూచి చలించిపోయాడు. అతను వెంటనే ఆ సుందరి పాదాల మీద పడి నమస్కరించి, " అమ్మా! నీవు ధన్యురాలవు. నీ వంటి నారీమణుల ధార్మిక భావనవలన ఈ భూమి, ఆకాశములు తమతమ స్థానములలో నిలబడి ఉన్నాయి. నేను తమకు ఏదైనా సేవ చేయ గోరుతున్నాను. నా వద్ద కొద్దిగా సత్తు పిండి ఉన్నది. దానిని మీరు తీసుకొని ఆకలి తీర్చుకోండి. ఆ తరువాత ఈ వృద్ధ సజ్జనుడిని నేను నా వీపుపైన ఎక్కించుకుని గంగా స్నానం చేయిస్తాను. మీరు చెబితే మీ ఇంటిదాకా ఆయనను తీసుకువస్తాను." అని ప్రార్థించాడు.

శివుడు పార్వతితో "చూశావా !ఈ జనసమూహములో కేవలం ఈయన ఒక్కరే నిజాయితీతో గంగాస్నానానికి, తీర్థ సేవకు చెందిన షరతును పూర్తి చేస్తున్నాడు. అందువల్ల అతనికి స్వర్గానికి వెళ్ళే ఫలితం దక్కుతుంది.

నిజానికి ప్రపంచంలోని ఏ దేశానికి చెందిన సంస్కృతిలో కూడ ఒక నదీ ప్రవాహాన్ని దేవత రూపములో భావించి ఆరాధించే పద్ధతిలేదు. గంగా, హిమాలయములు ఒకదానితో ఒకటి విడదీయరాని జంట. ఈ సౌభాగ్యం మన భారతీయులకు దక్కింది.

(సమాప్తం)

*(అనువాదం–కె. బి. సోమయాజులు)*

**ఇతరులను నొప్పించే విధంగా మాట్లాడవద్దు.**

చతుర్ముఖీ సాధన : అమృతవాణి-1

# మానవుడు తన సౌభాగ్యానికి తానే నిర్మాత

స్వర్గలోకంలో కోలాహలంగా ఉంది. విష్ణుమూర్తి చెవిలో రక్షమాం రక్షమాం అన్న రొద వినిపిస్తోంది. అప్పుడే నారదుల వారు దయచేశారు. విష్ణుమూర్తి "ఆ గోల ఏమిటి? నన్ను నిద్ర పోనీయటంలేదు" అని నారదుల వారిని అడిగాడు. "మహాప్రభూ! ద్రౌపది కష్టాల్లో పడింది. మిమ్మల్ని సహాయం కోసం ప్రార్థిస్తున్నది." అని చెప్పాడు నారదుడు. "నారదా! సహాయం చేసే విధానమేదీ ఇక్కడలేదు. ఇక్కడ ఉన్నవిధానం ఒక్కటే, కర్మకు తగిన ఫలితం అనుభవించి తీరాలి. ఆ విధానంతో ఈ సృష్టి చేయబడింది. మనిషి కర్మచేస్తాడు. దాని ఫలితాన్ని అనుభవిస్తాడు. లోకంలో ఎందరో మనుషులుంటారు. వారిలో కొందరు కష్టాలు పడుతుంటారు. ఆ కష్టాలు ఎన్నోరకాలుగా ఉంటాయి. కొందరికి ఆపరేషన్లు జరుగుతాయి. కొందరికి ప్రమాదాలు సంభవిస్తాయి. కొందరికి అనేక రకాలుగా అవసరాలు వస్తుంటాయి. అందరు ఆ సమయానికి ఏదో ఒకటి అడుగుతూనే ఉంటారు. నేను ఎంతమందికని సహాయం చేయగలను? ఒకవేళ చేసినా కర్మవ్యవస్థ తప్పిపోతుంది. ఎవరికర్మ వారు అనుభవించి తీరాల్సిందే అన్నాడు.

నారదుడు ఏమీ సమాధానం చెప్పలేక విష్ణుమూర్తిని చూస్తూ ఉండిపోయాడు. పరిస్థితి గమనించాడు విష్ణుమూర్తి. "నారదా! ఇప్పుడు నేనేమీ చేయలేను. ప్రపంచాన్ని తయారుచేశాను. న్యాయవ్యవస్థనూ, చట్టాలను రూపొందించాను. వాటిని లెక్క చెయ్యకుండా కొందరు ప్రవర్తిస్తారు. విషయం ఎదురుతిరిగితే ప్రార్థిస్తారు. స్తుతులు చేస్తారు. ధనాశ చూపుతారు. వారి ప్రార్థనలు ప్రశంసల ఆధారంగా నేను రాయితీ లిస్తూ పోతానా? నేను డబ్బుకి, ప్రశంసలకు లొంగిపోయి రాయితీలు ఇవ్వడం మొదలుపెడితే సృష్టే గడబిడగా మారిపోతుంది. ఇక చట్టాలకు, న్యాయవ్యవస్థకు పనే ఉండదు. ప్రజలు ప్రార్థనలు, స్తోత్రాలు చేస్తారే తప్ప సరైన మార్గంలో నడిచే ప్రయత్నం చేయరు. ప్రార్థనలు, ప్రశంసలు విని సహాయం చేసే చట్టాలను ఏర్పాటు చేయలేదు అని నికచ్చిగా చెప్పివేశాడు.

"అయితే ద్రౌపదికి సహాయంచేసే మార్గమే లేదా?" అని నారదుడు ప్రశ్నించాడు. ఎందుకులేదు, ఆమె గతంలో ఏదైనా శుభకర్మ చేసి ఉంటే, అదే ఆమెను రక్షిస్తుంది. నేనుకాదు." అన్నాడు విష్ణుమూర్తి.

## శుభకర్మల ఖాతా

గుమాస్తాను పిలిచి ద్రౌపది చేసిన పుణ్యకర్మల చిట్టా విప్పిచూడమన్నాడు. గుమస్తా వెతగ్గా వెతగ్గా ఒక ఒక శుభకర్మ దొరకనే దొరికింది. శుభకర్మలు రెండు రకాలు. 1. చెడు సంస్కారాలను రూపుమాపటం. 2. ఆపదలలో ఉన్నవారికి సహాయం చేయటం ఆ సహాయం కూడా పాత్రతను చూసి చెయ్యాలి. మోసగాళ్ళకు, దొంగలకు చేసే సహాయం సహాయం అనిపించుకోదు. శుభకర్మల కోసం, సత్ప్రవృత్తులకోసం తోడ్పడే సహాయమే నిజమైన సహాయం. ద్రౌపది చేసిన శుభకర్మల ఖాతాలో అలాంటిది ఏదైనా ఉంటే చూపించు అన్నాడు గుమస్తాతో. గుమాస్తా ఈ విధంగా చెప్పుకొచ్చాడు.

"అయ్యా! ఇది చాలా చిన్న విషయం. ఒక మహాత్ముడు యమునా నదిలో స్నానం చేయడానికి వచ్చాడు. ద్రౌపది కూడా అదే రేవులో స్నానానికి వచ్చింది. ఎవరి జాగాలో వారు స్నానం చేస్తూ ఉన్నారు. ఆ సాధువు ఒక లంగోటీ కట్టుకున్నాడు. స్నానం చేశాక కట్టుకోవడానికి మరో లంగోటీ తెచ్చుకున్నాడు. దానిని నది ఒడ్డున పెట్టి నీటిలో దిగాడు. ఇంతలో పెద్ద సుడిగాలి వీచింది. పాపం సాధువు పెట్టిన లంగోటీ కొట్టుకుని పోయింది. దురదృష్టం కొద్దీ కట్టుకున్న లంగోటీ కూడా చినిగిపోయింది. లంగోటీ లేకుండా ఇంటికి పోవడం ఎలా? ఇరుకున పడ్డాడు. ఇంతలో తెల్లవారిపోయింది. చేసేది లేక మెల్లగా నీళ్ళలో నుండే నడుచుకుంటూ పోయి దూరాన ఒక పొదచాటుకు చేరుకున్నాడు. ఇదంతా ద్రౌపది గమనిస్తూనే ఉంది. తాను కూడా మెల్లగా పొద దగ్గరకు చేరుకుంది. నాన్నగారూ! అని పిలిచింది. "మీ పరిస్థితి నాకు అర్థం అయింది. లోకంలో ఎకరికీ కూడా సిగ్గుపడే పరిస్థితి

**ఇతరులపై నిందలువేస్తే ఆత్మ క్షోభిస్తుంది.**

రాకూడదు. నా చీరలో ఒక ముక్కను చింపి ఇక్కడ పెడుతున్నాను. మీరు దానిని ధరించి ఇంటికి వెళ్లండి" అంది వినయంగా. దానికా సాధువు సంతోషించి అమ్మా! నీవు నా మానమర్యాదలను కాపాడావు. నీకు అవసరం వచ్చినప్పుడు ఆ భగవంతుని సహాయం తప్పక లభిస్తుంది." అని మనసారా ఆశీర్వదించాడు. ఆ తరువాత ఎవరిదారిన వారు వెళ్ళిపోయారు. ద్రౌపది చేసిన ఈ చిన్నపాటి మానదాన పుణ్యం ఖాతాలో జమచేయపడింది" అని వివరించాడు.

## వడ్డీ వేలరెట్లు పెరిగిపోతుంది

నారదా! అసలుకన్నా వడ్డీ మహత్తు చాలా గొప్పది. పిల్ల వాడుపుట్టగానే వాని పేరుతో కొంతడబ్బును బ్యాంకులో జమచేస్తూ ఉంటారు. ఆ నాటి బ్యాంకు లెక్కల ప్రకారం అది పెరుగుతూ ఉంటుంది. కొంతకాలానికి రెట్టింపుఅవుతుంది. మరలా దాన్ని జమచేస్తే మరల రెట్టింపు అవుతుంది. ఆ విధంగా పిల్లవాడు పెరిగిపెద్దవాడు అయ్యేసరికి ఆ డబ్బు అతని భవిష్యత్తుకు ఉపయోగపడుతుంది. అదే విధంగా మానవుడు చేసిన పుణ్యం భగవంతుని ఖాతాలో జమచేయబడుతుంది. భగవంతుని దగ్గర వడ్డీ మరింత వేగంగా పెరిగిపోతూ ఉంటుంది. అది జమ చేసిన వారికే సుమా! కనుక ద్రౌపదికి ఇక భయపడవలసిన పని లేదు. ఆమె చేసిన పుణ్యమే ఆమెను రక్షిస్తుంది. తప్పేదేముంది? చీరల మూట నెత్తిన పెట్టుకుని మరీ వెళ్లుతాను. ఆమె మర్యాదను కాపాడి వస్తాను. అంటూ గరుత్మంతుని తొందర చేశాడు. నిండు సభలో ద్రౌపది మానమర్యాదలను కాపాడి మరీ వచ్చాడు. నాటు, కోసుకో అన్న సిద్ధాంతాన్ని ఎప్పుడూ గుర్తుంచుకోండి.

## భజనయే సేవ - సేవయే భజన

నాయనలారా! తెలిసిందా? మీరంతా రెండు చేతులు కలిపి భజన చేస్తూ ఉంటారు. భజన చేశాం కనుక మేము భక్తులం అనుకుంటారు. మేం భక్తులం కనుక దేవుడు మీకు సహాయం చేస్తాడని, చెయ్యాలని ఆశపడుతుంటారు. భజన అనేది మాకు ఒక ఆటగా సాగిపోతుంది. అలాంటి భజన చేస్తే అప్పుడప్పుడు నాకు కోపం వస్తూ ఉంటుంది. మిత్రులారా! మీ భజనలో సేవలేదు. మీరు చేసే భజన కుంటి భజన, గుడ్డి భజన, చెవిటి భజన, మూగభజన, వంకరభజన, గూని భజన. అలాంటి భజనను నేను అసహ్యించుకుంటాను. సజీవమైన భజన అంటే ఏమిటో ముందు తెలుసుకోండి. 'భజసేవాయామ్' అంటే సేవ అనే శబ్దం వల్ల భజన ఏర్పడింది. పరోపకారం, పరమార్థం, లోకహితం, జనకల్యాణం ఇవన్నీ భజనకు పర్యాయపదాలే. కనుక సజీవ భజన చేయడానికి అలవాటుపడండి.

మిత్రులారా! మాల తిప్పుతూ, నాలుక కొనతోరహ్ రహ్, బక్ బక్ శబ్దం చేయడమే భజన అనుకోవద్దు. అది భజనకు ఆరంభమే కాని అంతంకాదు. భజనలో లోకకల్యాణం ఉంది. పరమార్థం ఉంది. దేశసేవ ఉంది. ప్రాచీన కాలంలోని ఋషుల జీవితాలను గమనించండి. దైవీ భక్తులను గమనించండి. వారి జీవితాలు సేవా కార్యక్రమాలతోనే నిండి ఉన్నాయి. అలాంటి జీవితం కావాలనుకుంటే 1. సాధన 2. స్వాధ్యాయం 3. సంయమం 4. సేవ అనే నాలుగు సూత్రాలను పాటించండి. దీని వల్ల లోకకల్యాణంతో పాటు ఆత్మ కల్యాణం జరిగితీరుతుంది.

## సేవ వల్ల భగవంతుడు సంపన్నుడవుతాడు.

మిత్రులారా! భజన వల్ల అంటే సేవ వల్ల భగవంతుడు సంతోషిస్తాడు. సేవా కార్యక్రమాల్లో స్వార్థం కూడ దాగిఉంటుంది. అదే ఆత్మోన్నతి. తండ్రి యొక్క బాధ్యతలను స్వీకరించిన వాడే యువరాజు కాగలుగుతాడు. భగవంతునికి యువరాజు మానవుడే. మానవునికి ఎంతో ఉపయోగకరమైన అవయవాలను ప్రసాదించాడు. అన్నింటికీ మించి ఆలోచించడానికి మేధస్సు నిచ్చాడు. ఎందుకనుకుంటున్నారు? మనం ఆయనకు వారసులుగా నిలబడాలని. ఆయన సృష్టించిన జగత్తును మరింత వృద్ధిలోనికి తేవాలని. ప్రతి ఒక్కరు ఆయనకు పెద్ద కుమారునిగా చేయూత నివ్వాలని. అంతేకాని చేయకూడని పనులును చేస్తూ అడుగడుగునా సహాయం అర్థిస్తూ బ్రతుకుమని కాదు. మానవుడు తన అదృష్టానికి తానే నిర్మాతగా జీవించాలని ఆయన మన తండ్రిగా ఆశపడుతున్నాడు.

(27.09.1979 నాడు శాంతికుంజ్‌లో ఇచ్చిన ప్రవచనంలో భాగం)

**ఇతరులలోని మంచిని చూడండి.**

మహిళా జాగరణ

# ఆదర్శాల సజీవ ప్రతిమ భారతీయ మహిళ

వేగంగా వీచే గాలి వచ్చి ఒక్కసారిగా వణికించింది. దానితోపాటే మంచు దుమ్ముకూడా గాలిలో వచ్చింది. రోజంతా కూడా చలిగానే ఉంది. సూర్యభగవానుడు తన కిరణాలన్నింటిని ప్రోగుచేసుకుని ఎప్పుడో వెళ్ళిపోయాడు. ఇప్పుడు సంధ్యాదేవి తన మసకమసక దుప్పటిని పరుచుకుంటూ వస్తున్నది. అప్పుడే ఒక స్త్రీమూర్తి నీడవలె కనిపిస్తూ ఉంది. ఆమె తన వరండానుండి నూతివైపు అడుగులు వేస్తున్నది. సాగుతున్న ఆమె ఆడుగులతోపాటే ఆమె మనస్సులో కూడా పలు ప్రశ్నలు వెన్నంటి సాగుతున్నాయి. అవి ఎంత స్థిరమైన, అచంచలమైన ప్రశ్నలంటే వాటిముందు కాలం కూడా ఆగిపోయింది.

స్మృతుల గవాక్షంలోనుండి నేటికి 40సంవత్సరాల క్రిందటి అందమైన రాత్రి కనబడుతోంది. శయానాగారం అందంగా అలంకరించబడివుంది. పూలపానుపు తయారయ్యింది. ఇటువంటి అందమైన తొలి రాత్రి ఎప్పుడు వస్తుందా అని తన స్నేహితుడు సమరేశ్ ఎన్నో కలలు కన్నాడు. ఈ క్షణంలో అతని గుండె దడదడలాడుతోంది. మేలిముసుగు తొలగించుకొని కన్పించే అందమైన చందమామ వంటి ఆమె ముఖం కోసం ఎదురు తెన్నులు చూస్తున్నాడు. ఆమె తల్లి వద్ద పడుకుంది అని స్నేహితులందరికి తెలిసింది. ఆ రాత్రి కార్యం జరుగలేదు. రెండవరోజు ఇంటికి తిరిగి వచ్చేయాలి. బాగా వెనుకబడ్డ గ్రామం. సిగ్గు, సంకోచం, కట్టుబాట్లు అనే బంధాలు సమరేశ్ తిరిగి వెళ్తున్న సమయంలో కూడా ఆమె ముఖాన్ని చూసే అవకాశం కల్పించలేదు.

రెండు మూడు నెలలు గడిచిపోయాయి. ఆకాశం మేఘావృతమైంది. వర్షాకాలం వచ్చింది. వానలు కుండపోతగా కురిశాయి. కలరా విజృంభించింది. సమరేశ్ కూడా దానిబారినబడ్డాడు. అతని తండ్రి అతనికి చేయించని వైద్యం లేదు. మొక్కని మొక్కులేదు. కానీ అతడిని ఏవీ రక్షించలేక పోయాయి. అతను చనిపోయాడు. ఆ ఆఘాతము అతని తండ్రిని పిచ్చివాడిని చేసింది. జీవితం ముక్కలైపోయింది.

శారదమీద పర్వతమంత ఆపద వచ్చిపడింది. క్రొత్తగా వివాహమైన 16 సంవత్సరాల అందమైన యువతి. మోకాళ్ళను తాకే అందమైన వాలుజడ. అందమైన ముక్కు, ముఖ కవళికలపై వైధవ్యమనే వజ్రప్రహారం పడింది. సంవత్సరం తరువాత ఆమె అత్తవారింటికి వచ్చింది. అప్పటిదాకా అందానికి ప్రతిరూపంగా చెప్పబడే ఆమె కురులు అందరి ఎగతాళికి వ్యంగ్యానికి ఆధారాలైనాయి. రాక్షసి, కులనాశిని, దెయ్యం అనే వాక్యాలు ఆమెకు పరిచయం అయ్యాయి.

వ్యంగ్యాలు, నిందలు, దెబ్బలు తప్ప ఆమెకు ఇంక ఏమీ మిగలలేదు. ఆమెపట్ల ఎవరైనా సానుభూతి ప్రకటిస్తే వారు కూడా నీలాపనిందలు పడవలసివస్తోంది. ఆమె రాత్రిపూట ఒంటరిగా కూర్చుని ఏడ్చి ఏడ్చి తన యౌవనాన్ని వదిలేసింది. అయినా నిప్పును ఎన్నిరోజులు బూడిదక్రింద దాచగలుగుతుంది. అది రాజుకుని ఎప్పుడోఅప్పుడు మండుతుంది. ఆమె జీవితం కూడా నిప్పులోనే స్వాహా అవుతోంది.

మైథిలి అనే కవి తన 'విద్యాపతి' అనే కావ్యంలో ఒకపురుగు స్థితిని వర్ణించాడు. ఒక పురుగు చెట్టు తొఱ్ఱలో ఉంది. ఆ చెట్టు చుట్టూ నిప్పంటుకుంది. ఆ పురుగు పరిస్థితి వంటిదే ఆమె స్థితికూడా. ఆమెకు ప్రతిక్షణం సంఘర్షణగానే ఉంది. ఆశోక వాటికలో సీతవలె ఒంటరిగా బందీ అయిఉంది. ప్రతిక్షణం ఎదురయ్యే పరీక్షలలో నిర్వికారంగా అయిపోయింది.

స్త్రీ ఎప్పుడు పువ్వు వలె సుకుమారంగానే ఉంటుంది. అలాగే వజ్రం వలె కఠినంగా కూడా ఉంటుంది. పరిస్థితుల ప్రభావం వలన ఆమె కోమలత్వం ఎక్కడికి పోతుందో కూడా తేలీదు. ఆ స్థానాన్ని కాఠిన్యత ఆక్రమిస్తుంది. భయంకరమైన తుఫానుకి పెద్ద పెద్ద చెట్లుకూడా కూలవల్సిందే. కానీ ఆ తుఫాను ఎక్కువసేపు ఉండదు. అలాగే పరిస్థితుల చక్రవాకంలో నలుగుతున్న శారద ఆకాశం క్రిందకి చేరింది. మెల్లగా రామాయణం, మహాభారతం, గీతను పారాయణ చేయడం మొదలుపెట్టింది. తండ్రి ప్రసిద్ధ రామాయణ ప్రవచనకారుడు. రాధేశ్యామ్ కథావాచకం వలె రామాయణ కీర్తనలు చేసేవాడు. ఆమెకు 7,8 సంవత్సరాల వయస్సు ఉన్నప్పుడు తండ్రి 'తల్లీ! ధార్మిక సంస్కారాల మూలములు ఎంత లోతుగా ఉంటే జీవితం అంత సుఖమయమౌతుంది' అనేవాడు. ఉగ్గుతోపాటు పోసిన ఈ సంస్కారాలు శారద పాలిట ఔషధాలైనాయి.

**నోరు మంచిది అయితే ఊరు మంచిది అవుతుంది.**

ఒక ప్రక్క ఆమెలో ధర్మనిష్ఠ పెరుగుతూఉంటే ఆమె మామగారికి ఆరోగ్యం మెరుగుపడుతూ వచ్చింది. ఆయన మనసులో ఆమెపట్ల సానుభూతి కలిగింది. ఈ రోజులలో సమరేశ్ స్నేహితుడు రాజేంద్రబాబు మహాత్మగాంధీగారు తల పెట్టిన స్వాతంత్ర్యసంగ్రామ ఉద్యమంలో దూకాడు. అతని ప్రభావం మామ–కోడళ్ళమీద పడింది. శారద జీవితంలో ఇప్పుడు రెండు భాగాలు ఉన్నాయి. మొదటిది కఠోర తపస్సు, రెండోది దేశసేవ. ఆమె ఇప్పుడు ఎక్కువగా పర్వదినాలలో, ఏకాదశి మొదలగు తిథులలో ఉపవాసాలు, ప్రభుస్మరణ చేస్తున్నది.

ఒక్కసారిగా అతని గతస్మృతుల నుండి ఉలిక్కిపడిలేచాడు. శారద నూతి దగ్గర ఏదో చేస్తోంది. కొద్దిసేపటి తర్వాత ఆమె చలిలో వణుకుతూ పరిగెత్తింది. పరికించి చూస్తే ఆమె శరీరంపై తెల్లని ఖాదీ దుప్పటి కప్పబడివుంది. ఆతను ఆశ్చర్యంతో చూస్తూ శారద వదినా! ఇంత చల్లగాలి వీస్తోంది ఇది స్నానం చేసే సమయమా? అని అడిగాడు ఆమె అతని మనసుని పరికించినట్లు చూసింది. తరువాత గంభీరస్వరంతో ఇలా అంది 'రాజేంద్రబాబు! ఈ శరీరంతో ఎంత తపస్సు చేయిస్తే అంత మంచిది.

అదెలాగా? దానితో మీకు దుఃఖం పెరుగుతుంది. శరీరం కూడా పాడవుతుందికదా? అన్నాడు

మీరు పొరపాటుగా ఆలోచిస్తున్నారు. తపస్సు వల్ల వ్యక్తి బాహ్యంగా దుఃఖంతో, లేమితో కనిపిస్తాడేమోకానీ లోపల చాలా సంతోషంగా ఉంటాడు. జీవితంలోని అన్ని దుఃఖాలు తపస్సు అనే అగ్నిలోపడి బూడిద అయిపోతాయి అన్నది. ఆ సమయంలో అతనికి ఆమె మూర్తీభవించిన భారతీయ స్త్రీమూర్తి వలె కనపడింది. రాజేంద్రబాబు ఇలా ఆలోచించసాగాడు. భారతీయ స్త్రీ ప్రాచీన ఆదర్శాలకు సజీవ ప్రతిమ. ఆ ప్రతిమ అతనికి ఎంతో ఆకర్షణీయంగా మోహకంగా కనిపించింది. తన అమాయకత్వానికి విరుద్ధంగా ఎన్నో ఉద్యమాలు, ఎన్నో సంఘర్షణలు ఎదుర్కొన్న తరువాతకానీ ఆమె సజీవప్రతిమ కాలేకపోయింది. దుఃఖం యొక్క ఎన్నో ఉలిదెబ్బలు సహించి, భరించి ఆమె తన రూపాన్ని సంతరించుకుంది.

తెల్లని ఖద్దరు వస్త్రధారణలో ప్రతిమ వలె ఉన్న ఆమెను అతను నిశ్చేష్టుడై చూస్తూఉండిపోయాడు. ఆ సమయంలోనే ఆమె తన దృష్టి అతని వైపు మరల్చి ఏమి ఆలోచిస్తున్నావు రాజేంద్రబాబు? అని అడిగింది. నేను మీ ధైర్యాన్ని మెచ్చుకుంటున్నాను. కాని పరమాత్మ మిమ్మల్ని ఎందుకు ఈ భూమిమీదకు పంపాడు? ఎన్ని కష్టాలు అనుభవించాలి? అన్నాడు.

"అటువంటి మాటలు ఎప్పుడూ రానివ్వకండి ఆయన ప్రణాళిక చాలా వివేకపూరితమైనది. దానిని ఎత్తిచూపెట్టేందుకు మనకు అధికారం లేదు" అన్నది. "మరి మీరే చెప్పండి. నా ఒంటరి జీవితం ఎలా గడుస్తుంది? గాంధీగారు చూపిన బాటలోనే ఇంకా మీరు కూడ కొంత నేర్పించారు" అంది. ఇలా అంటున్న సమయంలో మొదటిసారిగా ఆమె పెదవులపై సన్నని చిఱునవ్వు తళుక్కుమంది. ఆమె ఇంకా ఇలా అంది. 'నేను చుట్టు ప్రక్కల మహిళలందరినీ అక్షరాస్యులుగా తీర్చిదిద్దాను. వారు రామయణం, మహాభారతాలు హాయిగా చదువుకుంటున్నారు. అంతేకాదు నా అనుభవం ప్రకారం స్త్రీకి ప్రథమంగా ఆర్థిక సంరక్షణ కావాలి. అందుకొరకు పూర్తిస్థాయి ప్రశిక్షణ అవసరము'.

ఆమె మాటలు వింటున్న రాజేంద్రబాబు విస్మయంతో ముగ్ధుడైపోయాడు. ఆమె మాటలు ఇలా కొనసాగించింది. 'బాపూగారు చెప్పిన ఉపాయంతో చరఖాకేంద్రాన్ని నడుపుతున్నాను. దానితోపాటే కుటీరపరిశ్రమలు కూడా నడుపబడుతున్నాయి. ఇందులో పెళ్ళికాని అమ్మాయిలు, నావలె అనాథలైన అక్కచెల్లెళ్ళు ఉన్నారు. నేనిప్పుడు చాలా సంతోషంగా ఉన్నాను. నా ఒంటరితనం ఎప్పుడో మాయమైపోయింది. నేను ఉపయోగపడే పరిధి పెరుగుతోంది.' మీరు దార్శనికులు అయ్యారు వదినా? అన్నాడు. 'నిజం చెప్పనా భగవంతుడు నన్ను మానవత్వానికి సేవ చేయుమని పుట్టించాడు. అందుకే ఇంతటి భాగ్యం నాకు కలిగింది. ఒక్కరికి సేవ చేసేబదులు అనేకమందికి సేవ చేసే అవకాశం నాకు కలిగింది' అన్నది.

రాజేంద్ర బాబుకి ఆదర్శనారి యొక్క ఈ మూర్తి ఇంకా ఆకర్షణీయంగా కనిపించసాగింది. శ్రద్ధామూర్తులారా! పూజ్యులారా! ఆమెను ఆయన ప్రథమ రాష్ట్రపతి అయిన తరువాత కూడా మరచిపోలేదు. ఆ తరువాత సందర్భవశాత్తు ఒకసారి ఆయన 'భారతీయ స్త్రీ కనుక తన స్వరూపాన్ని తాను తెలుసుకోగలిగితే ఆమెకు మార్గంలో ఎటువంటి అవరోధాలు ఉండవు' అన్ని అన్నారు. 20వ శతాబ్దం మహిళా అభ్యుదయాన్ని మూర్తీభవింపజేస్తుంది. నిజం కూడా అదే. భావికాలంలో రాజేంద్రబాబు గారి ఈ నమ్మకం ఫలించి తీరుతుంది.

అనువాదం – శ్రీమతి వల్లి శ్రీనివాస్

(అఖండజ్యోతి, మార్చి 2000)

**హృదయాన్ని నిర్మలంగా ఉంచుకో - ప్రేమతో నింపుకో.**

ఆధ్యాత్మిక విజ్ఞానం

# స్వప్నంలో దర్శనమిచ్చిన క్వాంటమ్ సిద్ధాంతం

"వైజ్ఞానికుల ఆధ్యాత్మికత అతనిలో అనుసంధానం చేసే క్రొత్త చేతనత్వాన్ని వికసింపచేసింది. ఆధ్యాత్మిక పవిత్రతతో కూడిన వైజ్ఞానిక ప్రయోగాలు ఆత్మ సంతోషంతో పాటు లోకహితం కలిగిస్తాయి. "ఈ వాక్యాలు 'మేక్స్‌ప్లాంక్' ని స్వప్నంలో కూడా వివేకవంతునిగా చైతన్య పరిచాయి. అతనికి స్వప్నం చూస్తున్నట్లు లేదు. ఏదో పరలోకానికి వెళ్ళినట్లున్నది. ఆ ప్రదేశంలో చల్లదనంతో పాటు ప్రకాశ కిరణాలు ఆనందాన్ని కలిగిస్తున్నాయి. ప్రతీ వస్తువు ప్రకాశ కిరణాలతో తయారు చేయబడ్డది. అంతా అద్భుతంగా ఆశ్చర్యకరంగా సుఖప్రదంగా ఉంది. అక్కడ తాను, తాతగారు ఉన్నారు. తాతగారు చాలా ప్రేమ పూర్వకంగా కనిపించారు. వారిరువురి శరీరాలు శ్వేత వర్ణ కిరణాలతో నిర్మించబడ్డాయి. వైజ్ఞానికత అంటే ఆధ్యాత్మిక భావాల నుండి దూరంగా ఉండడం కాదని చెప్తున్నట్లు అనిపించింది.

మేక్స్ ప్లాంక్ కొద్ది రోజులుగా చాల నిరాశగా ఉన్నాడు పని చేసి చేసి అలసిపోయాడు. ఏదో నల్లని కారుమేఘం అతని బౌద్ధిక చేతనత్వాన్ని ముంచివేసినట్లు, మార్గాలన్నీ మూసుకుపోయినట్లు అనిపిస్తోంది. అంతా అంధకారమయంగా ఉంది ఇలా ఎప్పుడూ జరుగలేదు. అతను చాల తెలివైనవాడు. ఇంటి సమస్యలు, జీవితంలోని గూఢ విషయాలు చిటికలో పరిష్కరించే వాడు. చిన్నప్పటినుండే ప్రతిభ అనే దైవీ వరదానం లభ్యమయింది. అతని ప్రతిభను సానబట్టేందుకు కుటుంబంలోని వారు సహకరించారు. వారితాత ముత్తాతలు జర్మనీలో సైన్సు ప్రొఫెసర్లు. అతని తండ్రి మ్యూనిక్ పట్టణంలో న్యాయ శాస్త్రంలో ప్రొఫెసర్. వారి మేనమామ గౌరవనీయులైన జడ్జిగా ఉండేవారు.

మేక్స్ ప్లాంక్ కేల్ నగరంలో జన్మించాడు. 21వ ఏట మ్యూనిక్ విశ్వవిద్యాలయంలో భౌతిక శాస్త్రంలో డాక్టరేట్ (పి.హెచ్‌డి) పొందాడు. డాక్టరేట్ పొందిన తరువాత తన రీసెర్చ్ ప్రయోగాలలో మునిగిపోయాడు. 20 సంవత్సరాలు రీసెర్చిలో గడిచిపోయాయి. కాని ఏమీ కనిపెట్టలేకపోయాడు. గణిత శాస్త్ర కోవిదుడైనా, ప్రయోగశాల పరికరాలు లభించినా, ఏ క్రొత్త సిద్ధాంతం ప్రతిపాదించలేకపోయాడు. 20 సంవత్సరాల ప్రయాశ వృధాయేనా అని అనుకుంటున్నాడు.

రోజులు గడిచిన కొద్దీ నిరాశ, బాధ ఎక్కువ అవుతున్నది. బాధ నుంచి విముక్తి కొరకు ఇష్టమైన సంగీతాన్ని ఎంచుకున్నాడు. చిన్నప్పటి నుండి సంగీతం అంటే ఇష్టమే. పియానో, హార్మోనియం చక్కగా వాయించేవాడు. అతని కంఠం కూడా శ్రావ్యంగా ఉంటుంది. అతని గాత్రాన్ని వాద్య సంగీతాన్ని విన్నవారు అదే వృత్తిగా చేసుకోమని సలహా ఇచ్చేవారు. కాని అతనికి భౌతిక శాస్త్రమంటే ఇష్టం. పదార్థాల యొక్క సృష్టి యొక్క రహస్యాలను విప్పడంలో అతనికి చాలా ఆనందం కలిగేది. అతని తాత గారు అతనికి ప్రోత్సాహమిస్తూ ఇలా అనేవారు "మేక్స్! ఈ సృష్టి సృష్టించిన వాని నుండి వేరుగా లేదు. సృష్టించిన వాని ఊర్జా (శక్తి) ఈ సృష్టిని నడిపిస్తున్నది నిర్జీవ పదార్థాల కణాలలో కూడా అది స్పందిస్తున్నది.

తాతగారి మాటలను అతను పెద్దగా పట్టించుకోలేదు. కాని ఈ రోజు ఆయన గుర్తుకొస్తున్నారు. పియానో వాయిస్తున్నా కూడా మనస్సులో ఆయన జ్ఞాపకాలు వస్తున్నాయి. తండ్రి జోహన్ జూలియస్ వ ఇల్హెమ్ ప్లాంక్ చెప్తుండేవారు. "మేక్స్! తాతగారు ధర్మ విజ్ఞానాన్ని బోధించడమే కాదు వీటిని స్వయంగా జీవితంలో ఆ అనుభూతులతో తాదాత్మ్యం చెందారు." తండ్రి మాటలు, ఆయన జ్ఞాపకాలు నెమరువేసుకుంటూ ఎదురుగా గోడపై చిరునవ్వు నవ్వుతున్న తాతగారి చిత్రపటం చూస్తూ నిద్రలోకి జారుకున్నాడు. అతని చేతనత్వం అదృశ్య జగత్తులో కలసిపోయింది. మంచి స్వప్నం, స్వప్నంలో ఒక అత్యంత రమ్యమైన ప్రకాశపూర్ణమైన అలలతో కూడిన నదీ తీరం. తాతగారు అక్కడ ఉన్నారు. ఆయన ఇలా అన్నారు. "మేక్స్! పదార్థమైనా, ప్రకాశమైనా వీటి వాస్తవిక ప్రకృతి ఊర్జా (శక్తి)గా గుర్తించాలి. పదార్థాలు సూక్ష్మకణాలతో నిర్మించబడినట్లే ప్రకాశం (కాంతి) కూడా సూక్ష్మ ఊర్జా కణాలతో తయారయింది. ఈ ఊర్జా కణాలు నిశ్చితమైన పరిణామంలో ప్రవహిస్తుంటాయి.

స్వప్నంలో ఏమి జరిగిందో కాని తాతగారిని చూడటం, ఆయన మాటలతో మాక్స్ ప్లాంక్ అలనట అంతా మటుమాయమయింది. అతని చేతనత్వంలో ఉన్న కారుమేఘాలు ఛిన్నాభిన్నమయ్యాయి. అంతరాళాలలో ఒక నూతన ప్రకాశ

**చేయాలనుకున్న పని పట్ల సంశయాలు పెంచుకోవద్దు.**

అవతరణ జరిగింది. చేతనత్వంలో ఒక నూతన సూర్యోదయమే అయింది. అతను తన ప్రయోగశాలలోకి వెళ్ళి మరల ప్రయోగాలు మొదలు పెట్టాడు. అది 1900 సంవత్సరం ఆక్టోబర్ నెల, చలిరోజులు. ఒక ప్రక్క వేడినిచ్చే కొలిమి మండుతున్నది. పని చేసుకుంటున్న టేబుల్ మీద కాంతి పడుతోంది. దానిని పరిశీలనగా చూచాడు. చూస్తుండగానే నిజంగా వేడి, వెలుగు ఊర్జా కణాల రూపంలో నాలుగు ప్రక్కల వెదజల్లబడుతున్నాయి. ఊర్జా కణాలు ఒక నిశ్చిత పరిమాణంలో వెదజల్లబడుతున్నాయి. అతని అంతఃచేతనలో "క్వాంటా" అనే శబ్దం వినిపించింది.

ఆ క్షణంలో క్వాంటం సిద్ధాంత రచన జరిగింది. ఈ అద్భుత అనుభవాన్ని తన మిత్రుడు ఆటోహాన్‌కు ఇలా చెప్పాడు "పదార్థానికి వలె ఊర్జాకు కూడా సూక్ష్మలోకం ఉంటుంది. కనిపించే దానికే కాక కనిపించని అస్తిత్వం ఉంటుంది. తర్కబుద్ధి కన్న అంతర్ ప్రజ్ఞ ప్రతిదీ ఇక్కడ నుండే అంకురిస్తుంది.

1919లో మేక్స్ ప్లాంక్ కు తన రిసెర్చి ఫలితంగా నోబుల్ పురస్కారం లభించింది. ఆ సమయంలో ఆయన ఇలా అన్నాడు. "వైజ్ఞానిక ప్రయోగాలతో పాటు ఆధ్యాత్మిక పవిత్రత అనివార్యం. విజ్ఞానం మానవతను పెంపొందించే దిశలో అడుగులు వెయ్యకపోతే అది విజ్ఞానమే కాదు. విజ్ఞానం అందరికీ మేలు కలుగచేసేదిగా ఉండాలి. దీని కొరకు అది అధ్యాత్మిక సంవేదనలతో స్పందించాలి. ఇదే వైజ్ఞానిక ఆధ్యాత్మికత."

★★★

## ప్రేరణాత్మక ఘట్టాలు - ప్రయోజనాలు

*ఈ ప్రపంచంలో అధికశాతం ప్రజలు జీవితాన్ని ఒకానొక ప్రత్యేక ప్రపంచంగా భావిస్తుంటారు. జీవితమనేది ఒక మాయాజాలమని, ఆ పరాత్పరుని ఆటఅని పలుకుతూ ఉంటారు. ఈ మాటల బలంతోనే తాము తరచుగాచేస్తున్న చిన్న-పెద్ద తప్పులను క్షమింపతగినవిగానే భావించి ఊరట పొందుతూ ఉంటారు.*

*ఈ సంఘర్షణామయ జీవితంలో ఎలాంటివ్యక్తి అయినా అన్ని వేళలా న్యాయ బద్ధమైన జీవితాన్ని గడపటం చాలా కష్టమని ఒక నిర్ణయానికి వస్తారు. పెద్దపెద్ద విద్వాంసులు, గొప్ప గొప్ప నీతికోవిదులు, ధర్మ శాస్త్రాలను ఔపాసన పట్టిన వారు కూడ తరచుగా అనుచిత మార్గాన్నే ఎంచుకుంటూ ఉంటారు. కేవలము స్వార్థలాభమునపేక్షించిన వారే పరమార్థ చింతన చేయగలుగుతున్నారు. ఎవరైనా వారి తప్పుల నెత్తి చూపిన నాడు తెలివిగా "ఈ కాలంలో మోసం, దగా అసత్యం అనేవి లేకుండా జీవించడం దుర్లభం" అంటూ ఒక్క మాటతో తేల్చిపారేస్తారు.*

*ఐనప్పటికీ లోకంలో ప్రతి యొక్క మనిషికి ఏదో ఒకనాడు ఏదో ఒక సందర్భములో సత్యసిద్ధాంతమును, సత్యకర్మను గూర్చిన అనుభవం రాకుండాపోదు. అదే మార్గదర్శిగా మారుతుంది. మహా పురుషుల యొక్క లక్ష్యము, ప్రవర్తన సహజత్వానికి భిన్నంగానే ఉంటాయి.*

*మహాత్ములైన వారు ఒక మహోన్నత లక్ష్యాన్ని ఎంచుకుంటారు. అవసరమైతే దాని సాధన కొరకు స్వార్థాన్ని త్యాగం చేస్తారు. అలాంటివారు చేసే పనిలో త్రికరణ శుద్ధి కనిపిస్తూ ఉంటుంది. వారి నోటి నుండి వెలువడే ప్రతిమాట ఇతరులకు ప్రేరణనందిస్తూ ఉంటుంది. కాని వారుపైకి మాత్రం అతి సామాన్యులుగా కనిపిస్తూ ఉంటారు. ఐనా వారిలో దాగియున్న సత్యాలు వారి మరణానంతరం కూడ మనలను ప్రేరేపిస్తూనే ఉంటాయి.*

*ఈ విధమైన పరిస్థితి ఒక్కొక్క సారి అతి సామాన్యుని జీవితంలో కూడ ప్రత్యక్షమౌతూ ఉంటుంది. ప్రేరణాత్మకమైన చిన్న-పెద్ద సంఘటనలు సామాన్యుల-అసామాన్యుల జీవితాల్లో కూడ జరుగుతూనే వుంటాయి. కాని ఆ ఘట్టాలలోని స్ఫూర్తిని వారు తెలుసుకోలేకపోవచ్చు. సాంసారికలంపటంలో పడి కొట్టుమిట్టాడుతూ దాని మహత్వాన్ని గుర్తించలేకపోవచ్చు. అందువలన మహాత్ముల జీవితానుభవాల ప్రభావం వ్యాపించినంత తొందరగా సామాన్యుల జీవితానుభవాలు వ్యాప్తి చెందవు. అవి నీటి బుడగల్లా పుడుతూనే అణగారిపోతుంటాయి.*

*దేశ విదేశాలలోని మహానుభావుల జీవిత ఘట్టాలను సందర్భానుసారంగా ఉపయోగించుకునే విధంగా మిక్కిలి సంక్షిప్త రూపంలో ప్రకటించడం ప్రయోజనకరం. ఇవి సామాన్య మానవునకు కూడ మార్గదర్శకాలు అవుతాయి. చైతన్య దీపాల కాంతి కాంతివేగంతో పయనించి హృదయకుహరాలలోనికి చొచ్చుకొనిపోయి వెలుగును ప్రసాదిస్తుంది.*

*హృదయాలను చొచ్చుకుపోయే మహనీయ ఘట్టాలు ఈనాటి యువతకు మరువరాని ముచ్చట్లుగా, అదృష్టవశాత్తు దొర్లిన ముత్యాలుగా పావన ఘట్టాలై, దాగినసత్యాలకు బింబ-ప్రతిబింబాలుగా ఆకట్టుకోగలుగుతాయి.*

**- పండిత శ్రీరామ శర్మ ఆచార్య**

**పిల్లలకు మెచ్చుకోలు టానిక్కులా పనిచేస్తుంది.**

# ఆలోచనల్లో ప్రచండ శక్తి

జ్ఞానాన్ని పెంచుకోవడానికి, ఆత్మోన్నతికి మంచి సాహిత్యం చదవటం చాల అవసరం. చదవటం మాత్రమే చాలదు. దానిని గురించి మననం చేయాలి. లోతుగా ఆలోచించాలి. ఆలోచనలకు చాలా శక్తి ఉన్నది. మంచి ఆలోచనల ప్రభావం మనస్సుపై ఎల్లప్పుడు పడుతూఉండాలి. ఆలోచనలు పరిపక్వమైనప్పుడు ఆచరణకు వస్తాయి.

మనిషి ఎలాంటి ఆలోచనలు చేస్తాడో అలాంటి మాటలే మాట్లాడతాడు. ఎలాంటి మాటలు మాట్లాడుతాడో అలాంటి కర్మలే చేస్తాడు. ఎలాంటి కర్మలు చేస్తాడో అలాంటి కర్మ ఫలితాలు అనుభవిస్తాడు.

మనిషి ఆత్మస్వరూపుడు అంటారు. మానవశరీరంలో అనంత శక్తులున్నాయంటారు. మనకున్న శక్తులను గుర్తించలేకుండా ఉన్నాం. ఉపయోగించుకోలేక పోతున్నాం. ఎందువల్ల ఇలా జరుగుతున్నది? కొంచెం ఆలోచిస్తే మనకు మన శక్తులను లిమిట్ చేసుకున్నామని తెలుస్తుంది. మన చెడు ఆలోచనలే మన అనంతమైన శక్తులను మరుగున పడేశాయి. మనకున్న పరిస్థితులను మనమే నిర్మించుకుంటున్నాము. ప్రతి ఆలోచనను విశ్లేషించి చూచినట్లయితే ఈ విషయం అవగాహనకు వస్తుంది. ప్రతి ఆలోచనకు రచనాత్మక లేదా వినాశకరమైన శక్తులున్నాయని అవగతమవుతుంది. మీరు ఇతరులను బాధపడుతున్నట్లు చూడానులకుంటే, అలాంటి ఆలోచనల వల్ల మనకే ముందు దుఃఖం కలుగుతుంది.

మనిషి ఎలాంటి ఆలోచనలు చేస్తాడో సరిగ్గా అలాగే తయారవుతాడు. ఏ వస్తువుల గురించి ఆలోచిస్తాడో, మననం చేస్తాడో ఆ వస్తువులు సమీపానికి నిశ్చయంగా వస్తాయి. ఈ ఆలోచనలకు నిర్మలత్వం వచ్చేందుకు మన శాస్త్రాలలో రెండు గుణాలను ప్రశంసించారు. అవి దయ, క్షమ. దయ వల్ల ఆలోచనలకు నిర్మలత్వం కలుగుతుంది. క్షమ వల్ల నిర్మలత్వానికి స్థిరత్వం ప్రాప్తిస్తుంది. దయ, క్షమ భావములు లేకుండా ఎవరికి శాంతి లభించదు.

మంచి ఆలోచనలు, మంచి భావములే మన సంపత్తి. ఎప్పుడైతే ఆలోచనల శక్తిని సవ్యంగా అర్థం చేసుకుంటారో ఆ రోజు అన్ని సమస్యలు వాటంతట అవే తొలగిపోతాయి. మంచి పనులు చేయటం వల్ల, మంచి ఆలోచనలవల్ల మంచి శక్తి లభిస్తుంది. ఎలాంటి ఆలోచనలు చేస్తామో కొద్ది సమయంలో అలాంటి వాతావరణమే నిర్మించబడుతుంది. ఎటువంటి పరిస్థితులు, ఎటువంటి వస్తువుల గురించి ఆలోచిస్తామో అవే దగ్గరకు వస్తాయి. మనిషి తన ఆలోచనల వల్లే ఉత్తముడిగానో, నీచుడిగానో తయారవుతాడు. అందరి స్థూల శరీరాలు చూడటానికి దాదాపు ఒకటిగానే ఉంటాయి. కాని మహాపురుషులు అత్యంత కఠినమైన పరిస్థితులలో కూడా తమ ఆలోచనలను, భావములను మార్చుకోరు.

పనులకు ప్రేరక శక్తి ఆలోచనలే. మనిషి ఎలా తయారవ్వలనుకుంటాడో అలాంటి ఆలోచనలు చెయ్యడం ప్రారంభించాలి. నెమ్మది నెమ్మదిగా అతని ఆలోచనలు కార్యరూపం దాలుస్తాయి. సూక్ష్మం నుండే స్థూలం తయారవుతుందని ఆధ్యాత్మిక శాస్త్రాలు చెప్తాయి. ప్రారంభంలో సూక్ష్మరూపంలో ఉన్న వస్తువు ఈ రోజు స్థూలరూపధారణ చేసి స్థూలమయింది. సమస్త చరాచర జగత్తు ఈ ఆలోచనల శక్తి ఆధారం వల్లనే నడుస్తున్నది. కుమ్మరి ఒక కుండను తయారు చేసే ముందు దాని రూపం అతని మనస్సులో పూర్తిగా స్థిరపడి ఉంటుంది. అతని ఆలోచనలు దృఢమైనపుడు ఆ కుండ సూక్ష్మం నుంచి స్థూలరూపాన్ని ధారణ చేసి మనకు కనిపిస్తుంది.

ప్రపంచంలో మహాపురుషులు తమ తమ జీవితాలలో సాధించిన మహాకార్యములు ముందుగా ధ్యానంలో స్వప్న రూపంలో దర్శిస్తారు. నెమ్మది నెమ్మదిగా అవి సాధారణమైన ఆలోచనలుగా సంకల్పరూపంలో ధారణ చేసి ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచివేస్తాయి. ఎవరిలో ఎలాంటి భావాలు ఉంటాయో ప్రపంచం ఆ విధంగానే కనిపిస్తుంది.

ఆలోచనలకు పనులకు ఘనిష్ఠ సంబంధమున్నది. ఆలోచనా సంయమము కావాలి. సంయమము అంటే సవ్యముగా ఉపయోగించుకోవడమే. ఆలోచనల శక్తి యొక్క మహాత్వాన్ని తెలుసుకొని ఆ శక్తిని సద్వినియోగం చేయడానికి ప్రయత్నశీలు రవ్వటమే మనుష్య జీవన సఫలతా రహస్యం.

*(అఖండజ్యోతి ఫిబ్రవరి 1955)*

పై వ్యాసం చదివి క్రింది ప్రశ్నలకు జవాబులు ఆలోచించి స్థిరపరచుకోండి.

1. **మనకు కావలసిన వస్తువుల కొరకు ఏమి చేస్తే లభిస్తాయి?**
2. **మనకు కావలసిన పరిస్థితులు ఎలా నిర్మించుకోవచ్చు.?**
3. **దయ, క్షమ గుణముల ప్రాముఖ్యము ఏమిటి?**
4. **పనులకు ప్రేరక శక్తి ఏమిటి?**

★★★

**ఆయాచితంగా వచ్చే డబ్బువల్ల శుభం జరుగదు.**

# విపత్తులకు విలపించడం కాదు - వివేకంతో సాగాలి
## (మరోహరిత విప్లవం)

వానకు వరుసలేదు. వరదకు వైనం లేదు. నిన్నటి వరకు నీటిచుక్క కోసం తల్లడిల్లిన ఆంధ్రప్రదేశ్ వరద తాకిడితో అల్లాడిపోయింది. వానదేవుడికి జాలిలేదు, అవసరమైనప్పుడు ఒక్క చినుకురాల్చడు. చేనుపొట్టమీద ఉన్నప్పుడు మాత్రం కుండపోతగా కుమ్మరిస్తాడు. వరద ఏరులైపారుతుంది. ఇది ఈనాటి వ్యథకాదు. తరతరాలకథ. ఒక్క ఆంధ్రప్రదేశ్‌కాదు. ఒక్క భారతదేశం కాదు. ప్రపంచంలో ఈ ప్రకృతి విలయాలు ఎక్కడైనా తప్పవు. ప్రకృతి కనికరిస్తేనే రైతు చల్లగా ఉంటాడు. రైతు చల్లగా ఉంటేనే ప్రజలు తిండితిని, బట్టకడతారు. ఇది జగమెరిగిన సత్యం. ఈనాటి ఈ వరద లక్షలాది హెక్టార్లలో విలయ తాండవం చేసింది. అదృష్టవశాత్తు ప్రాణనష్టం అంతగాలేదు. కాని పంట నష్టాన్ని అంచనావేయలేం. తాడిదన్నే వాడుంటే తలదన్నేవాడు పుట్టివస్తాడు. తప్పదు. అది ప్రకృతి ధర్మం. మండుటెండల తర్వాత చిరు జల్లులు సేదతీరుస్తూనే ఉంటాయికదా!

వరదనీటిలో మురిగిపోయే వరిని తిరిగి బ్రతికించే ప్రయత్నం 2006లోనే ప్రారంభంఅయింది. ఆ ప్రయత్నానికి మూలవిరాట్టులు ముగ్గురు అమెరికన్ వ్యవసాయ శాస్త్రవేత్తలు. పమెలారోనాల్డ్, జూలియాబెయిలీ సెరెస్, డేవిడ్ జె. మాకిల్ యూనివర్శిటీ ఆఫ్ కాలిఫోర్నియాకు చెందిన వ్యవసాయ శాస్త్రవేత్తలు. వారు చాలా ఏళ్ళుగా వరి వంగడాల అభివృద్ధికి కృషి చేస్తున్నారు. వారి పరిశోధనలకు తొలి క్షేత్రంగా భారతదేశాన్నే ఎంపిక చేసుకున్నారు. ప్రపంచవ్యాప్తంగా వరిని పండించే దేశాలలో అగ్రస్థానం భారత్‌దే. ఇక్కడ తూర్పు ప్రాంతాల్లో వరద ముంపుకు గురయ్యే పంట పొలాలే ఎక్కువ. ఏటా 44 లక్షల హెక్టార్ల విస్తీర్ణంలో పంట నీటిపాలుఅవుతోంది. అందువల్ల వారు ముందుగా ఒరిస్సాను ఎంచుకున్నారు.

కిరణజన్య సంయోగక్రియ కార్బన్ డై ఆక్సైడ్‌నూ, సూర్యరశ్మినీ వినియోగించుకుని మొక్కలు శక్తిని సమకూర్చుకుంటాయి. మొక్క నిటారుగా నిలబడి సూర్య కాంతిని పొందుతున్నంత వరకూ ఎలాంటి సమస్య ఉండదు. వరదలో మునిగిన మొక్కకు సూర్య కాంతి అందదు. కిరణజన్య సంయోగ క్రియ జరగదు. అందువల్ల మొక్క బతకదు. దీనికి పరిష్కార మార్గం వరదను తట్టుకుని బ్రతకగలిగే రకం విత్తనాలను సృష్టించడమే. ప్రయత్నాలు చాలా కాలం నుండి జరుగుతూనే ఉన్నాయి. కానీ చివరకు ఈ ముగ్గురు అమెరికన్ శాస్త్రవేత్తలు విజయాన్ని సాధించగలిగారు.

మాకిల్ 1982 నుండే ఈ తరహా పరిశోధనలు ప్రారంభించాడు. భారతదేశంలో పండించే ఒక తరహా విత్తనం నీటి ముంపును తట్టుకుని బతకగలిగే లక్షణం కలిగి ఉందని మాకిల్ గమనించాడు. దానిపై విస్తృతంగా పరిశోధనలు నిర్వహించాడు. 2006లో కటక్‌లోని కేంద్రీయ పరిశోధనా సంస్థతోనూ, ఫైజాబాదులోని నరేంద్రదేవ్ వ్యవసాయం పరిజ్ఞాన విశ్వవిద్యాలయం వారితోనూ ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

సాధారణంగా వరిపంటనీటమునిగినప్పుడు సూర్యకాంతి కోసం నీటిని చీల్చుకుని బయటికి రావడానికి మొక్కలు విశ్వ ప్రయత్నం చేస్తాయి. చివరికాశక్తినంతా కోల్పోయి చనిపోతాయి. కాని మాకిల్ బృందం రూపొందించిన 'స్వర్ణసబ్' రకం అలాకాదు. నీటిలో మునిగినప్పుడు ఈ మొక్కల్లో ఉండే ఒక జన్యువు జీవక్రియ వేగాన్ని బాగా మందగింపచేస్తుంది. బతకడానికి ఎక్కువ శక్తి అవసరంలేదు. అందువల్ల మొక్కలు చనిపోవు. నీరు తొలగిపోగానే మళ్ళీ జీవక్రియవేగం పుంజుకుంటుంది.

మాకిల్ బృందం రూపొందించిన 'స్వర్ణ సబ్' రకం వంగడాలను ఉత్తరప్రదేశ్, ఒరిస్సా, అస్సాం, బీహార్, పశ్చిమబెంగాల్ వంటి చోట్ల విస్తృతంగా వినియోగంలోకి తెచ్చే ప్రయత్నాలు పెరుగుతున్నాయి. "అవి గనుక ఫలితాన్ని ఇస్తే ఇది మన దేశంలో రెండో హరిత విప్లవానికి నాంది అవుతుంది." అని అంతర్జాతీయ వరి పరిశోధనా సంస్థ దక్షిణాసియా సమన్వయకర్త ఉమాశంకర సింగ్ అన్నారు.

గంజిలోకి ఉప్పులేక కొందరు బాధపడుతుంటే పాలల్లోకి పంచదారలేక కొందరు బాధపడుతున్నారని ఒక సామెత. అదే విధంగా వరద ముంపులతో కొందరు బాధపడుతుంటే సాగునీరు దొరక్క కొందరు, ఉప్పునీటి నేలలతో కొందరు రకరకాలుగా బాధపడుతున్నారు. ఉమాశంకర సింగ్ వంటిస్వదేశీ శాస్త్రవేత్తలతో కలసి మాకిల్ బృందం 2008 మార్చి నుండి కొత్త పరిశోధనలు చేపట్టింది. 10 సంవత్సరాల విజన్ ప్రారంభమైన ఈ పరిశోధనలు పూర్తి అయితే ఉప్పునీటి ప్రాంతాల్లోనూ, కరువు ప్రాంతాల్లోనూ పచ్చదనం వెల్లివిరుస్తుంది. పుడమితల్లి ఆకుపచ్చచీర ధరించి ఆనందంగా పరవశించిపోతుంది.

ప్రకృతి విపత్తులు సహజం. వివేకంతో ఎదుర్కోవడంలోనే విజ్ఞత ఉంటుంది.

*(30-8-2009 ఈనాడు ఆదివారం అనుబంధం ఆధారంగా)*

**బుద్ధిహీనుడు మాట్లాడిన తరువాత ఆలోచిస్తాడు.**

ధారావాహిక : ప్రజ్ఞోపనిషద్

# ఒక పరిచయం

***పరమపూజ్య గురుదేవుల వాఙ్మయంలోని ప్రజ్ఞోపనిషద్ అనే గ్రంథాన్ని శ్రీ మారెళ్ళ కామరాజు గారు తెలుగులోనికి అనువదించారు. డిసెంబర్ మాసం నుండి ధారావాహికంగా ప్రచురిస్తున్నాం. – సంపాదకవర్గం.***

ఆరణ్యకాలు ఆది గ్రంథాలుగా మాన్యత పొంది ఉన్నాయి. విజ్ఞాన సమ్మతమైన సాంస్కృతిక వివేచనతో పాటు గురుదేవుల వాఙ్మయం జ్ఞానవిజ్ఞానాల విరాట్ భాండాగారం. నాలుగు వేదాలలో మొత్తం ఇరవైవేల మంత్రాలు ఉంటే పద్దెనిమిది పురాణాలు, ఉపపురాణాలలో సుమారు ఒక కోటి కంటే ఎక్కువ మంత్రాలు ఉన్నాయి. వీటన్నింటిలో కూడా మహత్తును తెలిపే ప్రధాన కథలు నిండి ఉన్నాయి. ఈ కథలన్నింటిలో అక్కడక్కడ కొన్నింటిని జోడించి, కొన్నింటిని తీసివేసి చెప్పడం జరిగింది. పరమపూజ్య గురుదేవులు ప్రజ్ఞా పురాణం రూపంలో నూతన విద్యను కనుగొన్నారు. ప్రజ్ఞోపనిషద్ ద్వారా మన ధార్మిక వ్యవస్థపై కలిగిన అపనమ్మకాలను నిర్మూలించి, ఋషిపరంపర యొక్క పునరుజ్జీవనంతోపాటు సత్యయుగాన్ని తిరిగి తీసుకువచ్చే విధానం చెప్పబడింది. వాటిని సూత్రప్రాయంగా ఫార్ములాలుగా అందచేశారు. వీటిలో సంస్కృత శ్లోకాలతోపాటు వాటి అర్థం కూడా ఇవ్వబడింది. పరమపూజ్య గురుదేవులను కలియుగ వ్యాసుడు అంటారు. ఈ ప్రజ్ఞోపనిషద్‌లోని ఆలోచనా ప్రవాహం యొక్క భంగిమ ప్రశ్నోత్తర శైలిలో ఇవ్వబడింది. పరమపూజ్య గురుదేవుల లేఖిని యొక్క చమత్కారమేమిటంటే ఆయన నేటి మానవ జీవితం యొక్క ప్రతిభాగాన్ని, ప్రతి యాంగిల్‌ని స్పృశించి దానిని నేటి యుగానుకూలంగా చిత్రీకరించారు. మారుతున్న సమయానికి అనురూపంగా ఆనాటి పరిస్థితులు, మాన్యతలు, మార్గాలు, సమస్యలు అవసరాలు మారుతూ ఉంటాయని చెప్పారు. తదనుసారంగానే వాటి సమాధానాలు వెతుక్కోవాలి. ఈ ప్రజ్ఞోపనిషద్ గ్రంథం దాని కొరకే వ్రాయబడింది. ప్రజలు నేర్చుకోవడానికి అత్యంత సరళశైలిలో వ్రాయబడిన ప్రతి ఒక్క ఖండం ఒక్కొక్క విశేషతను కలిగి ఉంది.

ప్రజ్ఞోపనిషద్ యొక్క ప్రథమ ఖండంలో యుగ సమస్యలు, వాటికి కారణమైన అపనమ్మకాలు, దాని నుంచి విముక్తి చెంది ప్రజ్ఞాయుగాన్ని తీసుకువచ్చే అవతార సత్తా ప్రక్రియ మనకు అందచేయబడ్డాయి. చింతన, దుష్ట ఆచరణతో సమరం చేసి అధ్యాత్మ దర్శనాన్ని వ్యవహారిక రూపంలో ఏవిధంగా పాటించాలో తెలుసుకొని, దానిని వివరంగా వివరించారు.

రెండవ ఖండంలో శాశ్వత హిందూ ధర్మ సిద్ధాంతాలుగా తెలుసుకొనబడే గుణాలను విస్తారపూర్వకంగా వర్ణించారు. సత్యం, వివేకం, నియమశీలత, కర్తవ్యపరాయణత, అనుశాసనం, అనుబంధం, సౌజన్యం, పరాక్రమం, సహకారం, పరమార్థం లాంటి గుణాలను అలవరచుకునే విధానం చెప్పబడింది. దేవమానవుల సృజన మరియు దివ్య సమాజంలో సత్ప్రవృత్తుల స్థాపన ఎలా జరుగుతుందో తెలియచేశారు.

మూడవ ఖండంలో పరివార్ సంస్థను విశ్లేషణచేసి, దానిలో ఉన్న విభిన్న విభాగాలు (1) దాంపత్య జీవనం (2) గృహస్థ బాధ్యత (3) కుటుంబములో నారీశిశువృద్ధజనుల భూమిక (4) సుసంస్కారాల అభివృద్ధి

నాల్గవ ఖండంలో దేవసంస్కృతి యందలి అనేక విషయాలను చెప్పడం జరిగింది. వాటిని ఈనాడు మనం పూర్తిగా మరచిపోయాము. వర్ణాశ్రమ ధర్మాలు, పర్వ సంస్కారాలు, తీర్థయాత్రలు, సన్యాసజీవనం, దృఢ విశ్వాసం, మరణోత్తర జీవనం మొదలైన వాటిని ప్రజ్ఞావతరణంద్వారా కాపాడే విధానం వివరించబడింది.

ఐదవ ఖండంలో సర్వధర్మ సమభావం చెప్పబడింది. నేడు మనముందున్న ప్రమాదకరమైన పరిస్థితి ఏమిటి అంటే వివిధ ధర్మాల మధ్య బద్ధవైరం. దీనిని సర్దుబాటు చేసుకుని కర్మవ్యవస్థ, ఆత్మ పరిష్కారం, వ్యవహారిక తపోయోగం, ఆత్మబోధ, ధర్మధారణ, ఉపాసన–ఆరాధనల ద్వారా సర్వ ధర్మ సమభావం ఎలా పొందాలో వివరించారు. అన్ని ధర్మ సాంప్రదాయాలు, మతాలు, వాటిలో వచ్చేటటువంటి సంఘటనలు వీటన్నింటిని చూసి, జోడించి ఇక్కడ వివరించారు.

ఈ ప్రజ్ఞోపనిషద్ చివరి ఖండంలో దేవాత్మ హిమాలయాల యొక్క, ఋషిసత్తాల యొక్క అదృశ్య క్రియాకలాపాల నుంచి మానవ శరీరం ప్రకృతి జగత్తు యొక్క అవిజ్ఞాత రహస్యాలను వైజ్ఞానిక ఆధ్యాత్మికతను ఎలా పొందాలో తెలియచేసారు. యజ్ఞ విజ్ఞానం, మంత్ర శక్తి, ఔషధ విజ్ఞానం మొదలుకుని ఆర్ష సంస్కృతి యొక్క అన్ని మార్మిక విషయాల మీద ప్రశ్న జవాబుల శైలిలో వ్రాయబడింది. ప్రజ్ఞోపనిషద్ రూపంలో పూజ్యవరుల యొక్క ఆలోచన, కోట్లాది ప్రజల జీవితాన్ని ప్రభావితం చేసి లక్షలాది మందికి కొత్త ద్వారం తెరుస్తుందని ఆశిస్తున్నాం.

– డా॥ మారెళ్ళ శ్రీరామకృష్ణ

**జీవితం తెల్ల కాగితంలా ఉంచుకోవాలి.**

నావారితో నామాట

# శతజయంతి ఉత్సవాల రూపురేఖలు-10

## ఆలోచనల్లో మార్పు వస్తేనే యుగనిర్మాణం - గుర్తుంచుకోండి

### భావవిప్లవానికి అస్త్రశస్త్రాలను ఇంటింటికి చేర్చాలి

పరమపూజ్య గురుదేవుల జన్మశతాబ్దిని గురించి ప్రతినెలా మార్గదర్శనం చేస్తూనే ఉన్నాం. పరాధీన భారతదేశంలో **1911**లో గురుదేవులు జన్మించారు. **1902** నుండి **1920** వరకు పరివర్తనా గాడ్పులు వస్తూపోతూ ఉన్నాయి. ఆ వాయువులే 21వ శతాబ్దికి పునాదిగా నిలిచి ఉన్నాయి. 20-21వ శతాబ్దాలలోని క్రియా కలాపాలకు నిర్దేశకులే కాకుండా విరాట్ భావ విప్లవోద్యమానికి జనకులు మన గురుదేవులే. ఈ ఉద్యమాన్ని గురించి తెలుసుకుందాం.

గురుదేవుల బాల్యం 15 సంవత్సరాలు సాధనా ప్రధానంగానే ఉన్నా దాదా గురుదేవుల సాక్షాత్కారం తరువాత వారి జీవిత క్రమమే మారిపోయింది. వారు వివేకంతో మూఢాచారాలను వ్యతిరేకించారు. ఆవల్‌ఖేడాలోనూ, ఆగ్రాలోనూ వారు చేపట్టిన కార్యక్రమాలే వారి ఉద్యమానికి ప్రధాన సాక్ష్యాలు. స్వాతంత్ర్య సమరంలో పాల్గోవడం కూడా వారి ఉద్యమంలో ఒక భాగమే. స్వాతంత్ర్య సమరంలో వారికి "శ్రీరామమత్త" అని నామకరణం చేశారు. అది వారి స్వాతంత్ర్య కాంక్షకు గుర్తు. కాని వారు చేయవలసిన అసలైన కార్యం వేరే ఉంది. **1927** వసంత పంచమి నాడు వారి గురుదేవుల ద్వారా సంకేతాలు అందుకున్నారు. ఆనాటి నుండి సాధనాత్మక దినచర్య ప్రారంభం అయింది. రోజూ దాదాపు 6 గంటలు సాధన, జపం, అనుష్ఠానాలతో గడిపివేసేవారు. ఆహార నియమాలను పాటిస్తూ విశిష్ట తపస్సు చేసేవారు. అఖండదీపం నిరంతరం వెలుగుతూ ఉండేది. దాని కాంతిలో వారి గురుదేవులు సూక్ష్మ శరీరంతో దర్శనం ఇచ్చేవారు. యుగపరివర్తన గురించి ప్రచారం మొదలయింది. ఆలోచనల్లో మార్పు తీసుకుని వచ్చే నిమిత్తం గాయత్రీ మంత్ర జపం, గాయత్రి మహా యజ్ఞాలు, అఖండ జ్యోతి మాస పత్రిక మొదలయ్యాయి.

అఖండ జ్యోతి పత్రిక ద్వారా ఆలోచనల్లో మార్పు జరుగుతోంది. రెండవ ప్రపంచ యుద్ధంలోని కష్టనష్టాలు ప్రజల్లో **1940** నుండి ఏకతా భావాన్ని తీసుకువచ్చాయి. తమంతట తామే ఉద్యమంలో ప్రవేశించడం మొదలుపెట్టారు. చాలా తక్కువ సంఖ్యలో నడుస్తున్న 'అఖండజ్యోతి' ప్రజల మనస్సుల్లో స్థానాన్ని సంపాదించింది. వారి దైనందిన జీవితాల్లో ఎదురయ్యే సమస్యలకు పరిష్కార మార్గాలను వెదుక్కోవడం మొదలుపెట్టారు. క్రమంగా అఖండ జ్యోతి పాఠకులే ప్రచారకులుగా మారిపోయారు. గాయత్రీ సాధనవల్ల కలిగే లాభాలను గురించి, యజ్ఞీయ జీవనం గురించి ప్రజలలో ప్రచారం జరిగిపోయింది. **1953**లో మథురలో గాయత్రీ తపోభూమి స్థాపించబడింది. దానితోపాటు **24**లక్షల చొప్పున జరిగిన **24** అనుష్ఠానాలకు పూర్ణాహుతి జరిగింది. నరమేధ యజ్ఞాల ద్వారా పూర్తి సమయదాతల, జీవనదాతల నిర్మాణం జరిగింది. అలాగే వానప్రస్థుల పరంపర మొదలయ్యింది. **1958**లో **1008** కుండీల గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించబడింది. అంతరిక్ష ప్రక్షాళనకు అది ఒక ప్రయోగంగా ఉపయోగపడింది. లక్షల సంఖ్యలో పరిజనులు భాగస్వాములు అయ్యారు. దానితో గాయత్రీ పరివార్ గ్రామగ్రామాలకు ప్రాకిపోయింది. ఈ మహాయజ్ఞానికి ముందుగా ప్రచారం చేసినవారు (ప్రయాజ్.) యజ్ఞ సమయంలో కార్యక్రమాన్ని నిర్వహించినవారు (యాజ్).యజ్ఞం తరువాత తీసుకున్న సంకల్పాలను ఆచరణలో పెట్టేవారు (అనుయాజ్.) శక్తివంచన లేకుండా తమవంతు కృషిని చేసి చూపారు.

ఒకే ఒక వ్యక్తి ఇంతటి కార్యాన్ని చేయగలిగారంటే నమ్మశక్యం కాని విషయం. కాని పూజ్య గురుదేవుల జీవన చర్యను గమనించిన వారికి ఇది మామూలు విషయం. వారు రాత్రి 12 గంటల నుండి ఉదయం 4 గంటల వరకు జపం-ధ్యానం చేసేవారు. విశ్రాంతి కేవలం రాత్రి 8 గంటల నుండి 12 గంటల వరకు మాత్రమే. ఉదయం 4 నుండి 8 గంటల వరకు వ్రాసుకుంటూ ఉండేవారు. తరువాత తన కొరకు వచ్చిన వారితో కలసి మాట్లాడేవారు. తరువాత భోజనం, కొద్ది సేపు విశ్రాంతి. తరువాత వందనీయ మాతాజీతో చర్చించేవారు. రోజువారీ

**పనిలోని వినమ్రత పలువురిని ఆకర్షిస్తుంది.**

కార్యక్రమాల గురించి శ్రేష్ఠ కార్యకర్తలకు మార్గదర్శనం చేసేవారు. తరువాత విశిష్ట వ్యక్తులతో కలసి మంతనాలు జరిపేవారు. సమయంలో సమయం చూచుకుని ప్రతిరోజూ తప్పనిసరిగా వాకింగ్ చేసేవారు. వారు 21వ శతాబ్ది గురించి ప్రణాళికలు చేసేవారు. ఈవిధంగా ఒక కర్మయోగివలె రోజును గడిపివేసేవారు. "నేను రాత్రి వేళలో చేసిన జపం, ధ్యానం గాయత్రీ పరివార్‌ను మొత్తం రక్షిస్తూ ఉంటుందనీ, భగవద్గీత 3వ అధ్యాయంలో కృష్ణ భగవానులు "నా కంటూ ఈ లోకంలో చేయవలసిన పనులు లేవు. పొందవలసిన ప్రయోజనాలు లేవు. అయినా నిరంతరం ఏదో ఒక కర్తవ్యాన్ని నిర్వహిస్తూనే ఉంటాను. ఆ విధంగా చేయకపోతే లోకాలకు హాని కలుగుతుంది" అని చెప్పారనీ, (22,23 శ్లోకాలు) లోక కళ్యాణం కొరకు పనులు చేయువలసిన విధానాన్ని నేను నా గురుదేవులనుండి నేర్చుకున్నాననీ" చెప్పారు.

**1926** నుండి **1990** లో చివరి శ్వాసను వదిలే వరకు ఈ ఆలోచనతోనే గడిపారు. మూఢవిశ్వాసాలను తొలగించి, నవయుగ నిర్మాణం చేయడం కోసమే నిరంతరం ఆలోచించేవారు. ఇదే వారికి ఒక అఖండ యజ్ఞం అయి కూర్చునేది. వారి అవతారం యొక్క ప్రధాన లక్ష్యం – "స్వామి వివేకానంద ప్రచారం చేసిన అధ్యాత్మవాదాన్ని, ఆశావాదాన్ని, వేదాంతాన్ని ప్రజలు ఎంతవరకు తమ తమ జీవితాల్లో అన్వయించుకుంటున్నారో పరిశీలించాలి. దానికి కావలసిన తగు శిక్షణను అందించాలి. ధర్మతంత్రం ద్వారా ప్రజలకు శిక్షణను అందించడం ప్రజారంజనం ద్వారా లోకకల్యాణం, ఆధ్యాత్మిక విజ్ఞానం ద్వారా సమన్వయవాదం, ఆలోచనల్లో మార్పు మొదలయిన వాటిని గ్రామ గ్రామానికి చేర్చాలి. అవతార లక్ష్యాన్ని చాలా వరకు నెరవేర్చుకున్నారు. మిగిలిన వాటిని సూక్ష్మరూపంలో నెరవేర్చుకుంటున్నారు.

1969 అఖండజ్యోతిలో వారు వ్రాశారు "భావవిప్లవానికి కావలసిన అస్త్రశస్త్రాలు మనమే తయారు చేసుకోవాలి. మనమే అమ్ముకోవాలి. మనమే ఉపయోగించాలి. మనమే వృద్ధి చేయాలి. అన్నీ మనమే స్వయంగానే చేసుకోవాలి. రాత్రంతా మేల్కొని వ్రాస్తున్నాను. తెల్లవారి ప్రచురిస్తున్నాను" అని స్పష్టం చేశారు. 41వ పేజీలో తన అంతరంగాన్ని వివరిస్తూ వ్రాసేవారు.

నేను వ్రాస్తున్న సాహిత్యంలో ఎంతో స్ఫూర్తి ఉంది. ఎంతో వెలుగు ఉంది. ఎంతో నూతనత్వం ఉంది. ఎంతో శక్తి ఉంది. దానిని మాటల్లో వ్రాయటం కష్టం. అనుభవ పూర్వకంగా తెలుసుకోవలసిందే. మండుతున్న హృదయజ్వాల యొక్క ప్రకాశంలో కంటి నీటి సిరాతో వ్రాస్తున్నాను. అందువల్ల నా సాహిత్యానికి శక్తి ఉండి తీరాలి ఉన్నది. భవిష్యత్తులో కూడ ఉండి తీరుతుంది" అన్న వాక్యాలు చదివితే ఎలాంటి వారికైనా మనస్సు స్పందించకమానదు.

యుగనిర్మాణ ఉద్యమం విషయంలో యుగ పరివర్తనా ప్రక్రియ మహాకాలుని సంకల్పం. మహాకాలుడు డమరును మ్రోగిస్తూ తాండవనృత్యం ప్రారంభించపోతున్నాడు. ప్రజల హృదయాలలోని ప్రమాద భరితమైన ఆలోచనలను మార్చివేసి, వివేక పూరితమైన ఆలోచనలను రేకెత్తించడమే ప్రధాన లక్ష్యం. ప్రతి కార్యక్రమాన్ని వివేకంతో నిర్వహించాలి. వివేకం అనే చమురులో ఔచిత్యం అనే బట్టను తడిపి జ్ఞానయజ్ఞం అనే కాగడా వెలిగించబడింది. ఇది ఎప్పటికీ ఆరిపోదు. ఈ భావవిప్లవ జ్యోతి మహాకాలునిసంకల్పం నెరవేరే దాకా వెలుగుతూనే ఉంటుంది. పరమపూజ్యగురుదేవుల యుగనిర్మాణయోజన, భావవిప్లవ ఉద్యమం ఒక దానికి మరొకటి పర్యాయపదాలు అనే చెప్పాలి. కాకపోతే తేడా ఒక్కటే. యుగనిర్మాణ యోజన బృహత్తరమైనది. భావవిప్లవ ఉద్యమం దానికి మూల సిద్ధాంతంగా పని చేస్తుంది.

ఈ ఉద్యమాన్ని దృష్టిలో పెట్టుకుని పరమపూజ్యగురుదేవులు తమ స్పష్టమైన భావాన్ని వ్యక్తం చేస్తూ "రోబోయే రోజుల్లో దేశం కళ్లు తెరుస్తుంది. ఒళ్లు విరుచుకుంటూ లేచి నిలబడుతుంది. ఈ జాగరణ కలిగిన నాడు దశ దిశలు దద్దరిల్లిపోతాయి. దానితో ఆధ్యాత్మ జ్ఞానం, తత్వజ్ఞానం, శౌర్యసాహసాలు, వైజ్ఞానిక స్ఫూర్తి తమంతట తామే వచ్చిచేరుతాయి. ప్రపంచం అంతా అద్భుత శక్తి సామర్థ్యాలతో విలసిల్లుతుంది. సర్వశ్రేష్ఠమైన పరిపూర్ణమైన భారతీయ సంస్కృతికి ఉజ్జ్వల భవిష్యత్తు తప్పదు. అప్పుడు మనం ప్రత్యేక స్థానంలో నిలబడగలుగుతాం. భారతదేశం మరొక్కమారు జగద్గురువుగా విలసిల్లుతుంది. ఇది నా దృఢవిశ్వాసం అని 1969 ఆగష్టు అఖండ జ్యోతి 17వ పేజిలో వ్రాశారు.

ఇదే విషయంలో పూజ్యగురుదేవులు "నిజం చెప్పాలంటే ఆలోచన కూడా ఒక తత్వమే. మానవ జీవనం మీద ఆలోచనా ప్రభావం కూడా ఉంటుంది. ఆ విషయమే నేను మరచిపోయాను. దానికి కారణం మానవునికి ముఖ్యమైన సమస్యల గురించి ఆలోచించకపోవడమే. వాటి గురించి మాట్లాడలేదు.

**నీ హితం కోరేవాడే నిజమైన స్నేహితుడు.**

చర్చించలేదు. ఇప్పుడీ చర్చ బోయవాని ముందర రత్నరాసుల విలువను గూర్చి చెప్పినట్లే ఉంటుంది.

పరమ పూజ్యగురుదేవుల జీవితమంతా ప్రతివ్యక్తిలోని ఆలోచనా విధానాన్ని మార్చే ప్రయత్నంలోనే గడిచిపోయింది. దానికోసం వారు తన శరీర బరువుకు 5 రెట్లు ఎక్కువ బరువున్న సాహిత్యాన్ని వ్రాశారు. వారి (అమృత వాణి) ప్రవచనాలు వేలు కాదు లక్షల సంఖ్యలో, సులభశైలిలో చెప్పబడ్డాయి. 3200ల పుస్తకాలు, 70 సెట్లు గల వాఙ్మయం (38 సెట్లు శతాబ్ది నాటికి అచ్చువేయడానికి సిద్ధంగా ఉన్నాయి) చిన్న పెద్ద విజ్ఞప్తులు, ఆగకుండా వెలువడుతున్న అఖండ జ్యోతి, యుగనిర్మాణ యోజన పత్రికలు భావ విప్లవానికి సంబంధించిన సాహితీ సాక్ష్యాలు. ఈ సాహిత్యం వేలాదిమందిని, లక్షలాది మందిని మార్చివేసింది. ఇంకా మార్చివేస్తూనే ఉంది. వారు వ్రాసిన సద్వాక్యాలు ఇప్పుడు అనేక స్థలాలలో కనిపిస్తూనే ఉన్నాయి. ఈ సాహిత్యం అంతా వారి జ్ఞాన శరీరం. దాన్ని ఇప్పుడు గ్రామ గ్రామానికి పంపడం జరుగుతోంది. చదివిన ప్రజలు అనేకమైన సంకల్పాలు తీసుకుంటున్నారు. శక్తి కొలది అమలుచేస్తున్నారు. ఇంకా 15 నెలలు మన ముందున్నాయి. క్రిందివానిలో కొంతవరకు పాటించగలిగినా భావవిప్లవ సందేశాన్ని అందించిన వారలం అవుతాం.

1. గురుదేవుల ఆలోచనలను మనం చదువుదాం, ఇతరులచేత చదివిద్దాం, జీవితంలో ఆచరిద్దాం.
2. అక్కడక్కడ వారి సాహిత్యంతో గ్రంథాలయాలను నడిపిద్దాం.
3. గురుదేవుల సద్వాక్యాలు స్టిక్కర్లు, పోస్టర్లు, బేనర్లు, ఫ్లెక్స్ బోర్డ్ అక్కడక్కడ ఏర్పాటు చేద్దాం.
4. సంచుల్లో, సైకిలు మీద రిక్షాలవంటి జ్ఞానరథాలలో, మోటారు సైకిలు మీద, మారుతీ వ్యాన్‌లో, పెద్ద పెద్ద వాహనాల మీద వీలున్న విధంగా సాహిత్యాన్ని చేరవేద్దాం.
5. గురుదేవుల వ్యక్తిత్వం, చేసిన పనులు, మనం చేయాల్సిన పనులు గ్రామగ్రామంలో స్తంభాలపైన అంటించి ప్రచారం చేద్దాం.
6. ఇంటర్నెట్‌లోను ప్రతి టి.వి ఛానెల్ లోను వారి ఆలోచనలను ప్రకటిద్దాం.
7. ప్రతి శక్తి పీఠంలోను, ప్రజ్ఞాపీఠాలలోను, గాయత్రీ చేతనా కేంద్రాలలోను స్వాధ్యాయ ప్రజ్ఞామండళ్లలోను ఒక సాహిత్య విక్రయ కేంద్రాన్ని పెట్టుకుందాం. ఒక పఠనాలయాన్ని తెరుచుకుందాం.

జన్మశతాబ్దిని గురించి యోజన మాత్రమే మనలక్ష్యం కాకూడదు. మనకు ఒక మైలురాయి ఉన్నది. మన లక్ష్యం యుగనిర్మాణం. అది పూర్తిఅయ్యేవరకు ఆగేదే లేదు. ఈ విషయాన్ని గుర్తుంచుకోండి.

★★★

## శ్రద్ధను మించిన యోగ్యత లేదు

*సిఖ్ఖు సంప్రదాయంలో నాల్గవ గురువు శ్రీరామదాసు. అనేక మంది శిష్యులు ఆయన చుట్టూ ఉండేవారు. ఒక్కొక్క ప్రతిభతో గురువుగారి మన్ననలు పొందేవారు. వారిలో "అర్జున దేవుడు" అనే శిష్యుడున్నాడు. అతనికి ఆశ్రమంలో పాత్రలు శుభ్రం చేయడం మాత్రమే. గురువు గారప్పగించిన పని. అతడత్యంత శ్రద్ధతో తనకప్పగించిన పనిని కిమ్మనకుండా చేసేవాడు. లేచింది మొదలు సాయంకాలం వరకు తన పనిని తాను చేసుకుపోయేవాడు.*

*గురువుగారికి అవసానకాల మాసన్నమైంది. శిష్యులందరు ఎవరికి వారే గురువుగారి తరువాత ఆశ్రమానికి ఉత్తరాధికారితానే అని ఆశలు పెంచుకున్నారు. ఎవరికి వారు తామే యోగ్యులమని భావించారు.*

*గురుదేవులు కన్ను మూశారు. ఆయన తలక్రింద నున్నవీలునామాను ఆసక్తిగా తెరచి చూచారు. అందరి ముఖాలు నల్లబడ్డాయి. దానిలో ఆశ్రమానికి ఉత్తరాధికారిగా అర్జున్‌దేవ్ పేరు వ్రాయబడి వుంది. ఆశ్చర్యపోయారు. అతని శ్రద్ధ, నియమపాలనయే ఆ అధికారం కట్టబెట్టాయని తెలుసుకున్నారు.*

*అర్జున్ దేవుడు సిఖ్ఖు మతానికి 5వ గురువుగా నియమితుడయ్యాడు. ఆతనికున్న ఒకే ఒక యోగ్యత శ్రద్ధ.*

**బుద్ధిమంతుడు ఆలోచించి మాట్లాడతాడు.**

# ఏ పుస్తకంలో ఏముంది?

## చదువు - విద్య

రచన : **శ్రీరామ శర్మ ఆచార్య**

అనువాదం : **డి. వి. ఆర్. మూర్తి**

క్రాంతి ధర్మీ సాహిత్యంలో ఇది 15వ పుస్తకం. ఈరోజులలో చదువే విద్య అనుకుంటున్నారు. 21వ శతాబ్దం ఉజ్జ్వలంగా ఉండటానికి చదువుతో పాటు విద్యకూడకావాలి.

దూరదృష్టి లేకపోవడమే ఈనాటి ఆపదలకు మూలం. తాత్కాలిక రసాస్వాదన సర్వం అనుకుంటున్నారు. తనకేమయినా లాభం ఉందనుకుంటేనే ఇతరులకు సహకరిస్తున్నారు. ఇతరుల పట్ల తనకు ఎంతోకొంత బాధ్యత, కర్తవ్యం ఉన్నాయని మరచిపోయారు. ప్రణాళికలు, ప్రయత్నాలు కేవలం స్వార్థం కొరకే జరుగుతున్నాయి. నవనిర్మాణయోజనకు భావసంవేదనలు కలిగిన వ్యక్తిత్వాలే ఆధారం. అలాంటి వ్యక్తిత్వాలను తయారుచెయ్యడమే విద్యయొక్క లక్ష్యం.

నవయుగానికి అనుగుణంగా మానసిక స్థితిని పరిస్థితులను ఉత్పన్నం చేయగలగాలి. స్వాధ్యాయం, సత్సంగాలతో బుద్ధిని కడిగివేయాలి. ఇటువంటి విద్యలు విస్తరింపచేయటానికి జ్ఞానరథం, సైకిల్‌యాత్రలు, సద్వాక్యలేఖనం, సంచీ గ్రంథాలయం సాప్తాహికసత్సంగాలు, దీపయజ్ఞం మొదలైన వాటి ద్వారా యుగచేతన విస్తరణకు కంకణ బద్ధులు కావాలి.

మానవుని యొక్క సూక్ష్మ శరీరంలో దూరదృష్టి, కారణ శరీరంలో భావసంవేదనలు నివాసముంటాయి. సూక్ష్మ శరీర జాగరణకు గాయత్రి మంత్ర జపం సర్వశ్రేష్ఠమైనది. కారణ శరీర జాగరణకు ప్రాతఃకాలసూర్యధ్యానము అత్యున్నతమైనదిగా తెలుసుకోవాలి.

పూర్వకాలంలో విద్యావిస్తరణ కార్యక్రమాలు దేవాలయాలు నిర్వహించేవి. అందుకే దేవాలయాలకు దానాలను, దక్షిణలను, శ్రద్ధాళువులైన ప్రజలు అందజేసేవారు. వ్యవస్థను జాగృతం చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. పరిజనులందరు చదువుతోపాటు విద్యావంతులయి, ఇతరులను విద్యావంతులుగా చేయాలని ఈ పుస్తకం పిలుపునిస్తోంది.

## సంజీవనీ విద్యయొక్క విస్తారమైన రూపం

రచన : **శ్రీరామ శర్మ ఆచార్య**

అనువాదం : **ముక్కామల రత్నాకర్**

క్రాంతి ధర్మీ సాహిత్యంలో ఇది 16వ పుస్తకం. పూర్వకాలంలో ప్రతిఒక్కరు సంజీవనీ విద్య యొక్క జ్ఞానాన్ని కలిగి ఉండేవారు. తిరిగి ఈనాడు ఈ విద్యయొక్క అవతరణ జరుగుతున్నది. కాని ఈ జ్ఞానం ఈనాటి పుస్తకాలలో, చదువులలో లేదు.

వ్యక్తిత్వ సమగ్రవికాసం; సమాజ నిర్మాణం; దాని పద్ధతులు, ఆర్థిక వ్యవస్థ, బ్రతుకు తెరువు ఎలా సబబుగా పొందాలి; మనిషి యొక్క ఆలోచనలలో, ప్రవర్తనలో, ఆచరణలో సౌమ్యత ఎలా పెంచుకోవడం; శారీరక మానసిక రోగాలకు నివారణ ఎలా పొందాలి? అవాంఛనీయతను ఎలా ఎదుర్కోవాలి? సుఖ ప్రదమైన సరళమైన పరిస్థితులను నిర్మించడం ఎలా? సద్భావన – సహకార క్షేత్రాలను ఎలా పెంపొందించాలి? మార్పును అడ్డుకునే విశ్వాసాలను ఎలా అంతం చేయాలి? రాజ తంత్రం, ధర్మ తంత్రముల సమర్థమైన శక్తులను నూతన యుగానికి ఎలా మలచాలి? అనేది సంజీవనీ విద్యయొక్క కొన్ని విభాగములు ఇవన్నీ ఇంకా శాఖోపశాఖలుగా ఎదుగుతాయి.

ఇటువంటి సంజీవనీ విద్యను తెలిసినవారు ఎక్కడ నివసిస్తారో ఆ స్థలం స్వర్గతుల్యంగా అయ్యేది. అదే ప్రక్రియ వినియోగిస్తే మరల సత్యయుగం వస్తుందనడంలో ఎటువంటి సందేహం లేదు. ఈ విద్య 21వ శతాబ్దంతో పాటు దిగ్ దిగంతములను ప్రకాశవంతం చేయడానికి ఉషఃకాలము వలె ఆవతరిస్తుంది.

రెండు ముక్కలలో చెప్పాలంటే మానవుని గుణ కర్మ స్వభావాలలో ఉత్కృష్ట ఆదర్శాలను చేర్చగలగితే అదే సంజీవనీ విద్య. దీనితో సుఖ శాంతి ప్రగతులు ముడిపడి ఉన్నాయి. దీనిని ఉపేక్షిస్తే భౌతిక ప్రగతి సాధ్యం కాదు. ఆధ్యాత్మిక ప్రగతి అసలే ఉండదు. ఈ సంజీవనీ విద్యా శిబిరాలు శాంతికుంజ్‌లో నిర్వహిస్తున్నారు. వీటిలో పాల్గొని, మనం నేర్చుకొని ఇతరులకు నేర్పి జీవితాలను స్వర్గతుల్యం చేసుకోవాలని ఈ పుస్తకం సందేశమిస్తున్నది.

**ఎంత ఎదిగినా ఒదిగి ఉన్నవాడే మహనీయుడు.**

వార్తలు

# రాష్ట్రమంతటా జరిగిన వివిధ కార్యక్రమాలు

## తెనాలిలో

ఆగస్టు 24,25,26 తారీఖులలో తెనాలి సుల్తానాబాద్ శ్రీ రామకృష్ణ మనోహర ఆశ్రమమనందు 24 కుండముల గాయత్రి మహాయజ్ఞం, సత్రయాగం అత్యంత వైభవంగా నిర్వహించబడింది. 24వ తేది ఉదయం కలశ యాత్ర, తదనంతరం యజ్ఞకార్యక్రమం నిర్వహించబడింది. యజ్ఞ సందర్భమున గుంటూరు శేషాచలం ఆశ్రమం నుంచి విచ్చేసిన శ్రీశ్రీశ్రీ నిర్వికల్పానందగిరి స్వామివారు యజ్ఞ విశిష్టత, గాయత్రి మంత్రమును విశ్వజనీనం చేయుటలో పూజ్య గురుదేవుల, గాయత్రి పరివార్ పాత్రపై వారి అనుగ్రహ భాషణం గావించారు. భోజన ప్రసాద వితరణతో ఆరోజు కార్యక్రమం ముగిసింది. 25వ తేదీన శ్రీమతి ధారాభవాని గారిచే అంతర్యాగం నిర్వహించబడింది. శ్రీ బి.యల్.యన్.మూర్తిగారు గురుపాదుకా స్థవనం ఆరోగ్యపరంగా ఉపయోగించుట గురించి ఉపన్యసించారు. 26.08.2009న శ్రీ కొంగర భాస్కరరావు గారు (సంపాదకులు దివ్యదీపిక త్రిమాస పత్రిక, తెనాలి) గాయత్రి సూక్ష్మ అంతరముపై ఉపన్యసించారు. శ్రీమతి శారదగారు పూజ్యగురుదేవుల కార్యక్రమమునకు విలువైన సమయ వినియోగం గురించి వివరించారు.

కార్యక్రమునకు విచ్చేసిన పరిజనులకు మూడు రోజులు శ్రీ రామకృష్ణ మనోహర ఆశ్రమ నిర్వాహకులు శ్రీ గడ్డిపాటి సాంబశివరావు, వారి సతీమణి శ్రీమతి శోభారాణి భక్తి శ్రద్ధలతో భోజన, వసతులు కల్పించారు.

ఈ కార్యక్రమం మంగళగిరి గాయత్రిపరివార్ సభ్యులు శ్రీ భోజనపల్లి ప్రసాద్, శ్రీ బి.యల్.యన్.మూర్తి, శారద దంపతులు, శ్రీ పేర్ల వెంకటేశ్వరరావు, శ్రీ కొత్తమాను నరసింహారావు, శ్రీ యల్.కె.శర్మ, శ్రీ శేషురెడ్డి గార్లు నిర్వహించారు.

తెనాలిలో జరిగిన ఈ కార్యక్రమమునకు తెనాలి గాయత్రి పరివార్ సభ్యులను కలుపుకొని చేసివుంటే బాగుండేది.

## వైదేహి నగర్‌లో

2009 సెప్టెంబర్ 4,5,6 తారీఖులలో డా॥ బేబి నిర్వహిస్తున్న గాయత్రీ ప్రజ్ఞాకేంద్రం. వైదేహి నగర్ హైదరాబాద్‌లో 4వ సత్రయాగం సాయంత్రం 6 గం॥ల నుంచి 8.30 వరకు నిర్వహించారు. వివిధ ఆధ్యాత్మిక సంస్థలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నాయి. పరమ పూజ్యగురుదేవులు ఉచ్చరించిన గాయత్రి మంత్రంతో 24సార్లు గాయత్రి జపంతో కార్యక్రమం ప్రారంభమయింది. 4వ తారీఖు పౌర్ణమి ధ్యానమును శ్రీ యస్.యస్.రావు, ఆర్ట్ ఆఫ్ లివింగ్ వారు చేయించగా, శ్రీమతి విజయశ్రీ అంతర్యాగం ఎలా చెయ్యాలో నేర్పించారు. 5వ తారీఖున గాయత్రి మంత్రోచ్చారణ అనంతరం శ్రీ మిలింద్, శ్రీమతి వర్షా అగర్వాల్, ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఫౌండేషన్ వారు జీవించే కళను వివరించారు. 6వ తారీఖున డా॥రవి గాయత్రి మంత్ర మహిమ గురించి వివరణ ఇస్తు యజ్ఞవిద్య తంత్ర విద్య సామాజిక అభివృద్ధికి తోడ్పడుతుందని తెలిపారు.

## భీమిలిలో

19.08.2009 నుండి 28.09.2009 వరకు భీమిలి శ్రీ దుర్గా గాయత్రీ శక్తి పీఠంలో శరన్నవరాత్రి ఉత్సవములు భక్తి శ్రద్ధలతో నిర్వహించారు.

19.08.2009 ఉదయం గాయత్రి ఆలయంలో కలశస్థాపన జరిగింది. ప్రతి నిత్యం ఉదయం అష్టోత్తర శతనామాలతో ప్రత్యేక పూజలు ఒక గంట సామూహిక మంత్రజపం, ఒక గంట లలిత సహస్రనామ పారాయణ జరిగింది. సాయంత్రం 4 నుంచి 5 వరకు సత్సంగం గోష్ఠి నిర్వహించారు. దుర్గాష్టమినాడు సువాసిని పూజలు జరిగినవి. 50 మంది కన్యలు పాల్గొన్నారు. ప్రతి దినం 50 మంది తక్కువ కాకుండా హాజరయిన శ్రీ కార్యక్రమమును శ్రీమతి భారతి నిర్వహించారు. డా॥ చంద్రశేఖర్, ఇతరులు సహకరించారు.

## జగన్నాథపురంలో

08.09.2009 తూర్పు గోదావరి జిల్లా, అయినవిల్లి మండలం కె.జగన్నాథపురం గ్రామం నందుగల శ్రీ దుర్గా పీఠంనందు పంచకుండీ గాయత్రి మహా యజ్ఞం శ్రీ వెంకట నారాయణ రావు (స్వామి) ఆధ్వర్యంలో నిర్వహించబడింది. 150 మంది పరిజనులు ఈ కార్యక్రమములో పాల్గొన్నారు. 34 మంది

**ఆత్మవిశ్వాసం లేకపోవడం వల్ల భయం, భయం వల్ల సమస్యలు ఎదురవుతాయి.**

ప్రతి రోజు 24సార్లు గాయత్రి మంత్ర జప సంకల్పం తీసుకున్నారు.

## కొణిజేడులో

22.08.2009 ప్రకాశం జిల్లా, టంగుటూరు మండలం కొణిజేడు గ్రామంలో పంచకుండీ గాయత్రి మహాయజ్ఞం శ్రీ మలసాని వెంకటేశ్వర్లు దంపతులు నిర్వహించారు. సుమారు 70మంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. శ్రీ తాటిపర్తి వెంకటేశ్వర రెడ్డి, సుజాతల వివాహదిన సంస్కారం నిర్వహించారు.

## యర్రబాలెంలో

31.08.2009 ప్రకాశం జాల్లా, కొరిశపాడు మండలం యర్రబాలెంనందు పంచకుండీ గాయత్రి మహాయజ్ఞం శ్రీ మలసాని వెంకటేశ్వర్లు దంపతులచే నిర్వహించబడింది. శ్రీ మిరవినేని సుధీర్‌కు జన్మదిన సంస్కారం నిర్వహించబడింది. ఈ సందర్భమున శ్రీ సుధీర్ **7000** రూపాయల విలువగల గురుదేవుల సాహిత్యమును అందరికి పంచారు. ఈ యజ్ఞ కార్యక్రమమునకు సుమారు 80మంది పాల్గొన్నారు.

## ఒంగోలులో

25.08.2009 ఒంగోలులోని చివుకుల వారి వీధి యందు పంచకుండీ గాయత్రి మహాయజ్ఞం మలసాని వెంకటేశ్వర్లు దంపతులు నిర్వహించారు. సుమారు 150మంది ఈ యజ్ఞ కార్యమ్రంలో పాల్గొన్నారు.

## పొదిలిలో

13.08.2009 శ్రీ కృష్ణ గోశీల యందు పంచకుండీ గాయత్రి మహాయజ్ఞం శ్రీమతి మలసాని శ్యామలాదేవి, శ్రీ మలసాని వెంకటేశ్వర్లు నిర్వహించారు. సుమారు 200 మంది పరిజనులు ఈ యజ్ఞ కార్యక్రమంలో పాల్గొన్నారు. 400 రూపాయల సాహిత్య విక్రయం జరిగింది.

## తెనాలిలో

20.09.2009 పూజ్య గురుదేవుల జన్మదిన సందర్భమున తెనాలిలోని నందుల పేటలో పంచకుండీ గాయత్రి మహాయజ్ఞం డా॥ శ్రీరాం గారిఆధ్వర్యంలో నిర్వహించబడింది. సుమారు 50 మంది కార్యకర్తలు పాల్గొన్న ఈ యజ్ఞ కార్యక్రమమునకు శ్రీమతి జయప్రద ఆర్థిక సహకారం, శ్రీమతి వసంత లక్ష్మి ఇతర సహకారం అందించారు.

## మూసాపేట

25.09.2009 హైదరాబాద్ మూసాపేటలోని శ్రీహరినగర్‌లో పంచకుండీ గాయత్రి మహాయజ్ఞం దుర్గాష్టమి ఉత్సవ మండపములో శ్రీ.జి.వెంకటనారాయణ గారు నిర్వహించారు. 50 మంది పాల్గొన్న ఈ కార్యక్రమమునకు శ్రీ అశ్విని అనిల్ భోజన ప్రసాదం అందించారు.

## జగిత్యాలలో

దేవి నవరాత్రుల సందర్భమున స్థానిక ఓంకార్ భవనంలో 19.09.2009 కులశస్థాపన చేశారు. ప్రతినిత్యం ఉదయం 6 గంటల నుండి సాయంత్రం 6 గంటల వరకు అఖండ గాయత్రి జపం జరిగింది. 8 గంటలనుంచి 10 గంటలవరకు యజ్ఞం, సాయంత్రం గాయత్రి చాలీసా, హారతి, తీర్థ ప్రసాదముల వితరణ జరిగింది. 28.09.2009న విజయదశమి రోజు పూర్ణాహుతి కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంతమంది పాల్గొన్నారో తెలియపరిస్తే బాగుండేది.

## కామారెడ్డిలో

27.09.2009 కామారెడ్డి సి.హెచ్. ఉపేందర్‌గారి ఇంట్లో పంచకుండీ గాయత్రి మహాయజ్ఞం శ్రీ జి.వెంకటనారాయణ, శ్రీ ప్యారేలాల్ నిర్వహించారు. సర్వతో భద్రవేదిక పూజా సందర్భముగా 33 దేవతలను ఆహ్వానించటం జరిగింది

27.09.2009 కామారెడ్డి ప్రజ్ఞామండలిలో త్రికుండి గాయత్రి యజ్ఞం శ్రీ జి.వెంకటనారాయణ, శ్రీ ప్యారేలాల్ నిర్వహించారు. రంగారావు దంపతులు సహకరించారు.

## నేరెళ్ళపాలెంలో

06.09.2009 ముమ్మిడివరం మండలం, నేరెళ్ళ పాలెం గ్రామంలోని శ్రీ సీతారామాలయం నందు పంచకుండీ గాయత్రి యహాయజ్ఞం శ్రీ. జి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా నిర్వహించబడినది. సుమారు 300 మంది పరిజనులు ఈ కార్యక్రమము నందు పాల్గొన్నారు. 83 మంది ప్రతి రోజు గురుదేవుల వాణితో 24 సార్లు గాయత్రి మంత్ర జపం చేయుటకు సంకల్పించారు శ్రీ రామానందస్వామి కార్యకర్తలకు క్రాంతి ధర్మి సాహిత్యం అందించారు.

## అంతర్వేదిపాలెంలో

05.09.2009 తూర్పుగోదావరి జిల్లా, సఖినేటి మండలం అంతర్వేది పాలెం గ్రామంలోని వేణుగోపాల స్వామి ఆలయ మందు పంచకుండీ గాయత్రి మహాయజ్ఞం శ్రీరామానందస్వామి

**బుద్ధిమంతుడు ఆలోచించిన తర్వాతే మాట్లాడతాడు..**

ఆధ్వర్యంలో నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో సుమారు 70 మంది పరిజనులు పాల్గొన్నారు.

## కాశీపాడులో

కాశీపాడులో గ్రామం రామాలయం నందు దుర్గానవరాత్రుల సందర్భమున ప్రతిదినం 11 మాలల సామూహిక గాయత్రీజపం, లలితా సహస్రనామం, కుంకుమపూజలు శ్రీమతి పిచ్చమ్మ, శ్రీమతిలక్ష్మమ్మ, శ్రీ వెంకట అప్పారావు, శ్రీమతి వెంకటేశ్వరమ్మ, అలివేలమ్మ శివ సత్యన్నారాయణ దంపతులు, గ్రామ ప్రజల సహకారంతో అత్యంత వైభవంగా జరిగాయి. పూర్ణాహుతిగా నవకుండీ గాయత్రీ మహాయజ్ఞం నిర్వహించబడింది. ఈ కార్యక్రమములు శ్రీ అంకారావు గారి ఆధ్వర్యంలో జరిగాయి.

## వరద బాధితులకు గాయత్రి పరివార్ చేయూత

కొద్ది రోజుల క్రితం సంభవించిన వరద ప్రమాద బాధితులకు తనవంతుగా గాయత్రి పరివార్ సహాయ సహకారాలు అందిస్తున్నది. శ్రీ అశ్విని సుబ్బారావుగారి ఆధ్వర్యంలో శాంతికుంజ్ నుండి శ్రీ రాకేష్ జైస్వాల్ (disaster management expert) నేతృత్వంలో సుమారు 40 మంది కార్యకర్తలతో కర్నూలు జిల్లా ముదిమాల, పాలదొడ్డి, కొండాపురం, రంగాపురం, గుండ్రెవీలు ప్రాంతాలలో సర్వేజరిపి బాధిత కుటుంబములకు వంట పాత్రలు, బక్కెట్లు, మగ్గులు, సబ్బులు, బట్టలు ఉతికే సబ్బులు, డెట్టాల్, బియ్యం, పప్పు, వంటనూనె, బిస్కట్లు, మంచినీరు, క్రొవ్వొత్తులు, దుప్పట్లు, చీరలు, టార్పాలిన్‌లు, అందించారు. ఇంతేగాక వైద్య సదుపాయం నిమిత్తం గుజరాత్ నుంచి, మధ్యప్రదేశ్ నుండి మందులతో సహా వచ్చిన డా॥ పటేల్, డా॥ వర్మ, డా॥ శైల్ మూలే వైద్య బృందం స్థానిక కార్యకర్తల సహాయంతో విశేష వైద్య సహాయం అందిస్తున్నారు.

**పరమపూజ్య గురుదేవుల విశాల వాఙ్మయంలో నుంచి ఎంపిక చేయబడిన నలభై పుస్తకాలను భారతదేశ మరియు ప్రపంచంలోని 40 భాషల్లోకి అనువదించబడుతున్నాయి. లక్ష్యం : 2010 సంవత్సరం లోపల కార్యం పూర్తికావాలి.**

1. 21వ శతాబ్దం మారుపేరు ఉజ్వలభవిష్యత్తు – భాగం 1
2. 21వ శతాబ్దం మారుపేరు ఉజ్వలభవిష్యత్తు – భాగం 2
3. యుగావసరం – ప్రతిభా సంస్కరణ – భాగం – 1
4. యుగావసరం – ప్రతిభా సంస్కరణ – భాగం – 2
5. సత్యయుగ పునరాగమనం
6. మార్పు యొక్క మహత్తర క్షణాలు
7. జీవన సాధనకు బంగారు సూత్రములు
8. ప్రతిభావంతులకు మహాకాలుని ఆహ్వానము
9. ప్రజ్ఞావతార విస్తార ప్రక్రియ
10. నూతన సృష్టికి మహాకాలుని తయారీ
11. నేటి సమస్యలు – రేపటి సమాధానాలు
12. మనఃస్థితి మారితే పరిస్థితి మారుతుంది
13. సృష్టికర్త పరమప్రసాదం – ప్రఖర ప్రజ్ఞ
14. ఆది శక్తి గాయత్రి సమర్థ సాధన
15. చదువేకాదు – విద్యకూడా
16. సంజీవనీ విద్యా విస్తరణ
17. భావ సంవేదనల గంగోత్రి
18. మహిళా జాగరణ ఉద్యమం
19. జీవన దేవత సాధన – ఆరాధన
20. సమయదానమే యుగ ధర్మం
21. నవయుగ మత్స్యావతారం
22. 21వ శతాబ్ది గంగావతరణ
23. అందరికీ సులభ ఉపాసన – సాధన
24. ఉపాసనకు రెండు చరణములు – జపం, ధ్యానం
25. గాయత్రి ఉపాసన ఎందుకు? ఎలా?
26. మన యజ్ఞ ఉద్యమం
27. గాయత్రి విషయంలో సందేహాలు – సమాధానాలు
28. స్త్రీల గాయత్రి అధికారం
29. గాయత్రీ మంత్ర విలక్షణ శక్తి
30. ఆధ్యాత్మిక ప్రగతికి చేయూత అవసరం
31. నిత్య గాయత్రీ సాధన
32. సంక్షిప్త హవన విధి
33. యుగ యజ్ఞ పద్ధతి
34. యుగ సంస్కార పద్ధతి
35. నేను ఎవరు?
36. ఆధ్యాత్మిక వాదమే ఎందుకు?
37. వివేకుల అవివేకం
38. నిర్వహణా బుద్ధి యొక్క గౌరవం
39. సప్త ఉద్యమాలు
40. ఋషి యుగ్మ పరిచయం

పత్రిక అందనివారు, పత్రికకు సంబంధించిన సూచనలు, సలహాలు ఇవ్వదలచినవారు క్రింది నంబర్లను సంప్రదించగలరు.
**(1) 9652862601 (2) 9032674117**

**బుద్ధిహీనుడు మాట్లాడిన తరువాత ఆలోచిస్తాడు.**